





PRGI Reg No. TGTEL/25/A0555

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ,రంగారెడ్డి, సంపుటి : 01 సంచిక : 14, ఎడిటర్,చెరుకు ఉపేందర్, పేజీలు : 8, వెల రూ. 5, సోమవారం - 16 - జూన్ - 2025

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## అంతరిక్షంలోకి శుభాంశు శుక్లా..



ఈనెల 19న ప్రయాణం

భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్రకు సిద్ధం

ఈనెల 19న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి ప్రయాణం

ఆగ్జియమ్-4 వాణిజ్య మిషన్‌లో పైలట్‌గా శుక్లా

2

## ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం.. దర్యాప్తునకు ప్రభుత్వ ఉన్నతస్థాయి కమిటీ



రెండు బ్లాక్ బాక్స్‌లు స్వాధీనం

దర్యాప్తులో అమెరికా, కెనడా ఏజెన్సీల సహకారం

ఘటనకు దారితీసిన పరిస్థితులు, మూల కారణాలను వెలికితీయడమే కమిటీ ప్రధాన లక్ష్యం

2

## ఇజ్రాయెల్‌పై సరికొత్త క్షిపణిని ప్రయోగించాం: ఇరాన్

సరికొత్త బాలిస్టిక్ మిస్సైల్ సిద్ధమైంది



2లో

అమెరికా థాడ్, పేట్రియాట్ గగనతల రక్షణ వ్యవస్థలను కూడా ఛేదించుకొని వెళ్లగలది

సరికొత్త క్షిపణి రేంజ్ 1200 కిలోమీటర్లుగా ఇరాన్ పేర్కొంది

## ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు... కేంద్రానికి తెలంగాణ మంత్రి లేఖ



2

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం

కేంద్ర జలశక్తి శాఖకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ

ప్రాజెక్టు జీడబ్ల్యూడీటీ, పునర్విభజన చట్టానికి విరుద్ధమని స్పష్టీకరణ

ఏపీ పీఎఫ్ఆర్‌ను తిరస్కరించాలని, డీపీఆర్ సమర్పణను ఆపాలని వినతి

టెండర్లు పిలవకుండా ఏపీని నిలువరించాలని కేంద్రానికి డిమాండ్



2

### కేటీఆర్‌పై మరో కేసు నమోదు

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో, హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు తాజాగా కేసు నమోదు చేశారు. ఇటీవల జరిగిన ఒక ప్రెస్ మీట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అసభ్యంతర వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియా కూడా పోస్టు పెట్టారు.

# ఫీజుల దందాకు చెక్.. ఇంజినీరింగ్ కాలేజీలపై సీఎం రేవంత్ రెడ్డి కొరడా

- ఇంజినీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపుపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం
- ప్రతిసారీ ఫీజులు పెంచడంపై అధికారులను ప్రశ్నించిన ముఖ్యమంత్రి
- ఫీజుల ఖరారుపై లోతైన, శాస్త్రీయ అధ్యయనం చేయాలని ఆదేశం
- గత ప్రభుత్వ విజిలెన్స్ నివేదికలపైనా ఆరా తీసిన సీఎం
- ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణకు చట్టంపై సీఎం సానుకూలత
- జులైలో కౌన్సెలింగ్, నెలరోజుల్లో ఫీజుల ఖరారుపై నెలకొన్న సందిగ్ధత



2లో

హైదరాబాద్ : రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో తరచూ ఫీజులు పెంచుతుండటంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇలాగే ఫీజులు పెరుగుతూ పోతే భవిష్యత్తులో కన్వీనర్ కోటా సీట్లలో చేరేందుకు కూడా విద్యార్థులు వెనుకాడే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. శుక్రవారంవిద్యాశాఖ ఉన్నతాధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. రాబోయే మూడేళ్ల (2025-26, 2026-27, 2027-28 విద్యా సంవత్సరాలు)

## ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు.. రేవంత్ రెడ్డి, కేంద్రంపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు



వివరాలు 2లో..

- బనకచర్ల మరో పోతిరెడ్డిపాడు అవుతుందని హరీశ్ రావు ఆందోళన
- బనకచర్ల ప్రాజెక్టుపై ఏపీ ముందుకెళుతుంటే తెలంగాణ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుందని విమర్శ
- రాష్ట్ర ప్రయోజనాల కంటే కేసులపైనే ప్రభుత్వానికి ధ్యాస అని ఆరోపణ
- నిధులు, నదుల విషయంలో తెలంగాణకు కేంద్రం అన్యాయం చేస్తోందని వ్యాఖ్య




2

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో లీడర్ కార్యక్రమం.. టార్గెట్ యూత్

## సవాళ్లు కాదు, ఏసీబీ ముందుకు రా: కేటీఆర్‌కు ఆది శ్రీనివాస్ సవాల్

ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్‌కు భయం పట్టుకుందన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సీఎంకు సవాళ్లు విసరడం మానుకుని, ఏసీబీ విచారణకు హాజరుకావాలని కేటీఆర్‌కు సూచన

గతంలో డ్రగ్స్ టెస్టుకు రమ్మంటే కేటీఆర్ పారిపోయారని ఆరోపణ


కేటీఆర్ బూతు మాటలను ప్రజలు చూస్తున్నారన్న ఆది శ్రీనివాస్



2


# అహ్మదాబాద్ విమాన ప్రమాదం 31 మంది మృతదేహాల గుర్తింపు పూర్తి..

- 12 కుటుంబాలకు అప్పగింత
- డీఎన్‌ఏ పరీక్షల ద్వారా మృతులను గుర్తించిన అధికారులు
- ఇప్పటివరకు 12 మృతదేహాలు వారి కుటుంబ సభ్యులకు అప్పగింత
- ఇంకా అందని గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ డీఎన్‌ఏ నివేదిక
- ప్రమాదంలో గాయపడిన 13 మందికి ఆసుపత్రిలో కొనసాగుతున్న చికిత్స
- మృతదేహాల గుర్తింపు ప్రక్రియలో ఫోరెన్సిక్ బృందాల నిరంతర కృషి



అహ్మదాబాద్: అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మరణించిన వారిలో 31 మందిని డీఎన్‌ఏ పరీక్షల ద్వారా గుర్తించినట్టు సివిల్ ఆసుపత్రి అధికారులు వెల్లడించారు. వీరిలో 12 మంది మృతదేహాలను ఇప్పటికే మిగతా.. 2లో

## దీన్ని బట్టి కొమ్మినేని వ్యాఖ్యలను సుప్రీం కూడా తప్పుబట్టింది!: హోంమంత్రి అనిత



2

వైసీపీ మహిళా నేతల తీరుపై హోంమంత్రి అనిత తీవ్ర అసంతృప్తి

అమరావతి : వైసీపీ నాయకులు, ముఖ్యంగా ఆ పార్టీ మహిళా నేతలు చేస్తున్న విమర్శలపై ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో స్పందించారు. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మహిళల రక్షణ విషయంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంటే, దానిపై వైసీపీ కడుపు మంటతో విమర్శలు చేస్తోందని ఆరోపించారు. వైసీపీ మహిళా నేతలు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని హితవు పలికారు. అమరావతిని "వేశ్యల రాజధాని" అంటూ చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, అలాంటి వ్యక్తిని వైసీపీ నేతలు, మాజీ మంత్రులు సమర్థించడం దారుణమని మంత్రి అనిత అన్నారు. "అదే అమరావతిలో జగన్మోహన్ రెడ్డి, భారతి రెడ్డి ఇల్లు కట్టుకోలేదా? మాజీ మంత్రులు, ఎంపీలు, వారి కుటుంబాలు నివసించడం లేదా?" అని ఆమె ప్రశ్నించారు.

# ప్రభుత్వ శాఖల్లో అవినీతి సహించేది లేదు

- అవినీతి రుజువైతే చర్యలు తప్పవన్న సీఎం చంద్రబాబు
- ఆరోపణలు వస్తే తక్షణ విచారణ
- 10 ముఖ్యమైన ప్రజా సమస్యలపై దృష్టిపెట్టి పరిష్కరించాలని ఆదేశం
- ఐవీఆర్ఎస్ ప్రజాభిప్రాయ సేకరణపై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి: ఏ శాఖలో, ఎక్కడ, ఎవరు అవినీతికి పాల్పడినా సహించేది లేదని, జీరో కరెప్షన్ దిశగా రాష్ట్రంలో పాలనా వ్యవస్థను నిర్మించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎక్కడ అవినీతి జరుగుతుందో అక్కడ ప్రధానంగా దృష్టి పెట్టి విచారణ జరపాలని, అవినీతి రుజువైతే తక్షణం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఏడాది పాలనపై ప్రజల నుంచి, వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై వ్యక్తమైన అభిప్రాయాలపై నిన్న ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వంపై అత్యధిక స్థాయిలో సంతృప్తి వ్యక్తమైనట్లు ఐవీఆర్ఎస్, సీఎస్‌డీఎస్ ప్రజాభిప్రాయ సేకరణలో వెల్లడైందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రజాభిప్రాయ సేకరణపై టెక్నికల్ ఆడిటింగ్ జరపాలని, సమస్యలు ఉన్న చోట సంతృప్తి పెంచేలా చూడాలని సీఎం అన్నారు. సంక్షేమం, ఉద్యోగాల కల్పన, రహదారులు వంటి 10 ముఖ్యమైన ప్రజా సమస్యలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. వర్క్ ఫ్రమ్ హోమ్, పెట్టుబడుల రాక, నైపుణ్య శిక్షణతో ఎంత మందికి ఉద్యోగాలు వచ్చాయో తెలియజేయాలన్నారు. 175 నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించడంతో మిగతా.. 2లో

# తల్లికి వందనంపై చంద్రబాబు మాట తప్పారంటూ రోజా ఫైర్

- అందుకే జగన్ అంటే నమ్మకం... బాబు అంటే మోసం అని ప్రజలు అనుకుంటున్నారు: రోజా
- కేంద్రీయ విద్యాలయాల్లో చదివేవారిని అనర్హులను చేశారని ఆరోపణ
- మోసం చేసిన మిమ్మల్ని ఏమనాలి బాబు గారూ అంటూ ట్వీట్



అమరావతి : తల్లికి వందనం పథకం విషయంలో చంద్రబాబు ప్రభుత్వం మాట తప్పుతోందని, తల్లులను మోసం చేస్తోందని వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు, అధికారంలోకి మిగతా.. 2లో

PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# సవాళ్లు కాదు, ఏసీబీ ముందుకు రా: కేటీఆర్‌కు ఆది శ్రీనివాస్ సవాల్

హైదరాబాద్ : ఫార్ములా-ఈ కార్ రేస్ కేసు వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు భయం పట్టుకుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్రస్థాయిలో విమర్శించారు. దమ్ముంటే ముఖ్యమంత్రికి సవాళ్లు విసరడం మానేసి, ఏసీబీ విచారణకు హాజరై వాస్తవాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఫార్ములా-ఈ కార్ రేస్ నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ నోటీసులు అందుకున్న కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లై డిటెక్టర్ టెస్టుకు సిద్ధమా అంటూ సవాల్ విసిరిన విషయం తెలిసిందే. ఈ సవాల్‌పై ఆది శ్రీనివాస్ తాజాగా ఒక వీడియో ప్రకటన ద్వారా స్పందించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, "సవాళ్లు విసిరి వెనక్కి వెళ్లిపోయే సంస్కృతి బీఆర్ఎస్ నేతలది. గతంలో డ్రగ్స్ టెస్టుకు రావాలని రేవంత్ రెడ్డి సవాల్ విసిరితే పారిపోయింది ఎవరు? మీరా గొప్పలు చెప్పేది?" అని ప్రశ్నించారు. తెలంగాణను గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. మాటలు చెప్పడం కాదని, ఏసీబీ ముందు హాజరై విచారణకు సహకరించాలని కేటీఆర్‌కు సూచించారు. కేటీఆర్ ఉపయోగిస్తున్న భాషపై కూడా ఆది శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేశారు. "కేటీఆర్ నోటి నుంచి వస్తున్న బూతు మాటలను తెలంగాణ సమాజం అంతా గమనిస్తోంది. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కూడా కేటీఆర్‌కు శిక్ష తప్పదని ఆది శ్రీనివాస్ జోస్యం చెప్పారు. ఫార్ములా-ఈ కేసులో నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు కేటీఆర్ విచారణను ఎదుర్కోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# కేటీఆర్‌పై మరో కేసు నమోదు

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో, హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు తాజాగా కేసు నమోదు చేశారు. ఇటీవల జరిగిన ఒక ప్రెస్ మీట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అసభ్యంతర వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియా కూడా పోస్టు పెట్టారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం, హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు కేటీఆర్‌పై ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డి పట్ల కేటీఆర్ వ్యాఖ్యలు అవమానకరంగా ఉన్నాయని వెంకట్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే, కేటీఆర్ వ్యాఖ్యలు సీఎం ప్రతిష్టను దెబ్బతీసే విధంగా ఉండడంతో పాటు, సామాజిక శాంతిని భంగపరిచే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. ఇక, ఎమ్మెల్సీ వెంకట్ ఫిర్యాదుతో పోలీసులు.. కేటీఆర్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దీంతో, సీసీఎస్ పోలీసులు.. కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది.

### ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో నోటీసులు..

ఇదిలా ఉండగా.. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసు దర్యాప్తులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అవినీతి నిరోధక శాఖ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు బంజారాహిల్స్‌లోని ఏసీబీ కేంద్ర కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు శుక్రవారం పంపిన నోటీసులో సూచించారు. ఈ కేసులో కేటీఆర్ ఏ-1గా ఉన్నారు. వాస్తవానికి మే 28నే తమ ఎదుట విచారణకు హాజరుకావాలంటూ కేటీఆర్‌కు మే 26న ఏసీబీ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే విదేశీ పర్యటనకు వెళ్లాల్సి ఉన్నందున తిరిగి వచ్చాక హాజరవుతానని కేటీఆర్ సమాధానం ఇచ్చారు. దీంతో ఈ నెల 16న విచారణకు హాజరుకావాలంటూ ఏసీబీ అధికారులు తాజాగా మరోసారి నోటీసులు ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా%-%ఈ కార్ రేస్‌లో రూ.54.89 కోట్లు దుర్వినియోగం జరిగినట్టు ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఫార్ములా-ఈ కార్ రేస్ నిర్వహణకు సంబంధించి నిబంధనలు అతిక్రమించి విదేశీ కంపెనీకి డబ్బులు పంపారన్నది ప్రధాన ఆరోపణ. ఈ కేసులో ఇప్పటికే జనవరి 9న కేటీఆర్ స్టేట్‌మెంట్‌ను ఏసీబీ అధికారులు రికార్డు చేశారు. కేసులో ఏ-2గా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ-3గా ఉన్న హెచ్ఎండీఏ బోర్డు మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్‌రెడ్డిని సైతం ఇప్పటికే ఏసీబీ అధికారులు విచారించారు. జనవరి 8న అర్వింద్‌కుమార్‌ను, జనవరి 9న కేటీఆర్, 10న బీఎల్ఎన్‌రెడ్డిని, అదే నెల 18న గ్రీన్‌కో ఏస్ నెక్స్ట్‌జెన్ ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు విచారించారు. వీరందరి స్టేట్‌మెంట్ల ఆధారంగా ఫార్ములా-ఈ ఆపరేషన్స్ సంస్థ ప్రతినిధులు, సీఈవోను జూమ్ మీటింగ్ ద్వారా వర్చువల్‌గా విచారించారు. తాజాగా కేటీఆర్‌ను ఏసీబీ ప్రశ్నిస్తుండడంతో ఈ కేసు దర్యాప్తు తుది దశకు చేరినట్టుగా తెలుస్తోంది. ఏసీబీ నోటీసులు జారీ చేసిన విషయాన్ని కేటీఆర్ సైతం ధ్రువీకరించారు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదం 31 మంది మృతదేహాల గుర్తింపు పూర్తి..

మొదటి పేజి తరువాయి

వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు తెలిపారు. మిగిలిన మృతదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని, వీరిలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మృతదేహం కూడా ఉందని, ఆయన డీఎన్ఏ పరీక్ష ఫలితాలు ఇంకా రావాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు. సివిల్ ఆసుపత్రి ఏడీఎంఎస్ డాక్టర్ రజనీష్ పటేల్ మీడియాతో మాట్లాడుతూ "ఇప్పటివరకు 31 మంది వ్యక్తుల డీఎన్ఏ సరిపోలింది, వారిని గుర్తించాం. వీరిలో 12 మృతదేహాలను ఉదయ్‌పూర్, వడోదర, ఖేడా, కుషీనగర్, అహ్మదాబాద్‌లోని వారి స్వస్థలాలకు పంపించాం" అని తెలిపారు. "మిగిలిన వారి ఆప్తుల మృతదేహాలను తీసుకెళ్లేందుకు మరికొన్ని కుటుంబాలు ముందుకు రావాల్సి ఉంది. ఇతరుల డీఎన్ఏ ఫలితాలు ఇంకా రావాల్సి ఉంది" అని ఆయన వివరించారు. మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ డీఎన్ఏ పరీక్ష ఇంకా కొనసాగుతోందని డాక్టర్ పటేల్ ధ్రువీకరించారు. "ఇప్పటివరకు ఆయన డీఎన్ఏ సరిపోలలేదు. ఫలితం రాగానే సంబంధిత అధికారులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందిస్తాం" అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన 13 మంది ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని కూడా ఆయన వెల్లడించారు. మృతదేహాలు తీవ్రంగా కాలిపోయి, గుర్తుపట్టలేని విధంగా ఉండటంతో, వాటిని గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు తప్పనిసరి అయ్యాయి. రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్), నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ (ఎన్ఎఫ్ఎస్‌యూ) కు చెందిన ఫోరెన్సిక్ బృందాలు ఈ బృహత్తర గుర్తింపు ప్రక్రియను నిర్వహిస్తున్నాయి. బాధిత కుటుంబాలకు త్వరితగతిన ఊరట కలిగించేందుకు ఈ బృందాలు అహోరాత్రులు శ్రమిస్తున్నాయి. ఈ నెల 12న అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే అదుపుతప్పి సివిల్ ఆసుపత్రి బి.జె. మెడికల్ కళాశాల సమీపంలోని జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతంలో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమాన ప్రయాణికులు, నేలపై ఉన్న నివాసితులు సహా 260 మందికి పైగా మరణించారు. ఒక ప్రయాణికుడు మాత్రం గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ప్రమాదం వల్ల సమీప ప్రాంతాల్లో, ముఖ్యంగా అక్కడి వైద్య విద్యార్థుల వసతి గృహాలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

## ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు... కేంద్రానికి తెలంగాణ మంత్రి లేఖ

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల మధ్య గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు అంశం మరోమారు వివాదాస్పదమైంది. ఈ ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం కేంద్ర ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుందని, దీనిని తక్షణమే అడ్డుకోవాలని ఆయన ఆ లేఖలో కోరారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జలశక్తి శాఖకు రాసిన లేఖలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ తలపెట్టిన ఈ గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు, గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) అవార్డుతో పాటు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని నిబంధనలకు పూర్తిగా విరుద్ధంగా ఉందని తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాథమిక సాధ్యసాధ్యతల నివేదిక (పీఎఫ్ఆర్)కు కేంద్రం ఇంకా ఆమోదం తెలపకముందే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డీపీఆర్ ఎలా అడుగుతుందని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ పీఎఫ్ఆర్‌ను తిరస్కరించాలని, డీపీఆర్ సమర్పించకుండా ఆంధ్రప్రదేశ్‌ను నిలువరించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎటువంటి టెండర్లు పిలవకుండా ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించాలని కూడా మంత్రి ఉత్తమ్ తన లేఖలో కేంద్రాన్ని కోరారు.

## దీన్ని బట్టి కొమ్మినేని వ్యాఖ్యలను సుప్రీం కూడా తప్పుబట్టింది!

మహిళలను అగౌరవపరిచేలా మాట్లాడిన వ్యక్తికి సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇస్తే, దాన్ని సమర్థిస్తూ జగన్మోహన్ రెడ్డి ట్వీట్ చేయడం మహిళల పట్ల ఆయనకున్న గౌరవాన్ని తెలియజేస్తోందని విమర్శించారు. కొమ్మినేని శ్రీనివాస్‌కు ఇచ్చిన బెయిల్ షరతుల్లో టీవీ డిబేట్లలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదని స్పష్టంగా ఉందని, దీన్నిబట్టి ఆయన వ్యాఖ్యలు తప్పని సుప్రీంకోర్టు కూడా నిర్ధారించిందని అనిత గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమ కేసులు బనాయించి చంద్రబాబును, అంకబాబునూ, ఒక వృద్ధురాలిని అర్ధరాత్రి అరెస్టు చేయించిన ఘటనలను ఆమె ప్రస్తావించారు. "తనదాకా వస్తే కానీ నొప్పి తెలియదు అన్నట్లుంది వైసీపీ నేతల తీరు" అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# ప్రభుత్వ శాఖల్లో అవినీతి సహించేది లేదు

మొదటి పేజి తరువాయి

175 నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించడంతో పాటు, ఆగస్ట్ 15 కల్లా అన్ని సేవలను వాట్సప్ గవర్నెన్స్ మన మిత్ర కింద అందించాలని స్పష్టం చేశారు. మరోవైపు వికలాంగులు, వృద్ధులకు రేషన్ సరుకులు ఇంటికి తీసుకువెళ్లి అందించడం మరింత మెరుగ్గా జరిగేలా ఆలోచన చేయాలన్నారు. చౌక ధరల దుకాణాలను పెంచడం, నగదు లేదా కూపన్లు ఇవ్వడం వంటి ప్రత్యామ్నాయాలపై లబ్ధిదారుల అభిప్రాయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. అలాగే ఉచిత ఇసుక విధానం అమలులో ఇసుక లేని చోట్ల సంతృప్తి, ఇసుక ఉన్న చోట అసంతృప్తి ఉండటంపై ప్రాంతాల వారీగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

### ప్రజాభిప్రాయం ఇలా

పింఛన్ల పంపిణీలో అవినీతి లేదని 85 శాతం మంది, ఇంటి దగ్గరే ఇస్తున్నారని 87.8 శాతం, ఉద్యోగుల ప్రవర్తన బావుందని 83.9 శాతం మంది ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయం వ్యక్తం చేశారు. సీఎస్‌డీఎస్ ఫీల్డ్ సర్వేలో లబ్ధిదారులను నేరుగా కలిసి ప్రశ్నించగా పింఛన్ల పంపిణీలో అవినీతి లేదని 93.9 శాతం మంది, ఇంటి దగ్గరే ఇస్తున్నారని 93.3 శాతం, ఉద్యోగుల ప్రవర్తన బావుందని 73.3 శాతం మంది, పర్వాలేదని 23.1 శాతం మంది చెప్పారన్నారు. అన్న క్యాంటీన్లు పరిశుభ్రంగా ఉన్నాయని 80.5 శాతం, ఆహారం నాణ్యత బావుందని 79.3 శాతం, సమయపాలన పాటిస్తున్నారని 80.8 శాతం మంది ఐవీఆర్ఎస్ ద్వారా చెప్పారన్నారు. ఆస్పత్రి సేవలు క్వాలిటీ చెకప్‌పై 68.4 శాతం, రక్త పరీక్షలపై 55 శాతం, ఉచిత మందుల పంపిణీపై 65.5 శాతం, సిబ్బంది ప్రవర్తనపై 71.3 శాతం సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో రోజూ చెత్త సేకరణపై 68.1 శాతం, 24 గంటల్లో చెత్త డంప్ తరలింపుపై 57 శాతం సంతృప్తి చెందారని చెప్పారు. ఆలయాలలో సౌకర్యాలకు సంబంధించి 68 శాతం దర్శనం బాగుందని, 63.6 శాతం సౌకర్యాలు బావున్నాయని, 77.7 శాతం ప్రసాదం నాణ్యత బావుందని భక్తులు చెప్పారన్నారు

ఏపీఎస్ఆర్టీసీలో శుభ్రత, సీటింగ్ విషయంలో 53.4 శాతం, నీటి సౌకర్యం 45.2 శాతం, టాయిలెట్స్‌పై 56 శాతం, బస్సు సమయం-రూట్ వివరాలపై 61.5 శాతం, 69 శాతం మంది బస్సులు సమయానికి బయల్దేరుతున్నాయని, 69.7 శాతం సమయానికి చేరుకుంటున్నామని, 72.4 శాతం సిబ్బంది ప్రవర్తన బాగుందని, 69.7 శాతం రక్షణ కలిగి ఉన్నాయని చెప్పారన్నారు. దీపం-2లో ఎక్కువ డబ్బు వసూళ్లు చేయడం లేదని 62.8 శాతం చెప్పారని అధికారులు వివరించారు. నెలనెలా రేషన్ సరుకులు తీసుకుంటున్నామని 75.1 శాతం, నాణ్యత బాగుందని 73.8 శాతం చెప్పారన్నారు. ఎరువుల లభ్యత ఉందని 60.9 శాతం మంది రైతులు చెప్పారన్నారు. సమయానికి విత్తనాల సరఫరా జరిగిందని 63 శాతం, తమ ప్రాంతంలో డ్రగ్స్ సంబంధిత సమస్య ఉందని 27.4 శాతం, పోలీసులు స్పందిస్తున్నారని 54.5 శాతం, పబ్లిక్ ప్రాంతాల్లో వేధింపులు ఉన్నాయని 27.8 శాతం, పోలీసుల స్పందన బావుందని 59.5 శాతం, పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని 56.3 శాతం మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్‌లో స్లాట్ బుకింగ్ ప్రాసెస్‌పై 63.4 శాతం సంతృప్తి వ్యక్తం చేయగా, అవినీతి లేదని 62.3 శాతం మంది చెప్పారన్నారు.

ఇసుక రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌పై 70.6 శాతం, లభ్యతపై 67.5 శాతం, ధర పైన 61.1 శాతం సంతృప్తి వ్యక్తం చేయగా, రెవెన్యూ ఎఫ్ లైన్‌పై ఎక్కువ డబ్బులు వసూళ్లు చేయడం లేదని 77.4 శాతం, పాస్‌బుక్ సర్వేలో ఎక్కువ మొత్తం తీసుకోలేదని 75.1 శాతం చెప్పారన్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అవుతోందని 61.6 శాతం, పంచాయతీ చెత్త సేకరణ జరుగుతోందని 56.7 శాతం, ఎన్టీఆర్ వైద్య సేవ అడ్మిషన్లపై 86.2 శాతం, సేవలపై 81.3 శాతం, ఆరోగ్య మిత్ర సాయంపై 82.4 శాతం మంది సంతృప్తి వ్యక్త చేయగా అవినీతి లేదని 78.5 శాతం తెలిపారన్నారు.

# ఫీజుల దందాకు చెక్.. ఇంజినీరింగ్ కాలేజీలపై సీఎం రేవంత్ రెడ్డి కొరడా

రాబోయే మూడేళ్ల (2025-26, 2026-27, 2027-28 విద్యా సంవత్సరాలు) కాలానికి ఇంజినీరింగ్ కళాశాలలకు కొత్త ఫీజులను ఖరారు చేసేందుకు అధికారులు రూపొందించిన నివేదికను సీఎంకు సమర్పించారు. ఈ నివేదికను పరిశీలించిన అనంతరం ఫీజుల పెంపునకు అనుసరిస్తున్న ప్రామాణికత ఏమిటని అధికారులను రేవంత్‌రెడ్డి ప్రశ్నించినట్లు సమాచారం. "ప్రతిసారీ ఫీజులు ఎందుకు పెంచుతున్నారు? కళాశాలలు అందిస్తున్న విద్యా నాణ్యత ఏ స్థాయిలో ఉంది? యాజమాన్యాలు నిబంధనలు పాటిస్తున్నాయా లేదా?" వంటి అంశాలపై ఆయన ఆరా తీశారు. ఫీజుల ఖరారు విషయంలో ఆలస్యమైనా పర్వాలేదని, మరింత లోతుగా, శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. గతంలో, 2016 విద్యా సంవత్సరంలో, నాటి ప్రభుత్వం 40 విజిలెన్స్ బృందాలను ఇంజినీరింగ్ కళాశాలలకు పంపి, రికార్డులను తనిఖీ చేయించిందని సీఎం గుర్తుచేశారు. ఆ విజిలెన్స్ నివేదికలు ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయని, వాటి ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకున్నారనే వివరాలను కూడా ఆయన అధికారుల నుంచి కోరినట్లు సమాచారం. ఈ చర్చ సందర్భంగా, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ అంశాన్ని అధికారులు ప్రస్తావించగా, ఇంజినీరింగ్ విద్య తరహాలోనే పాఠశాలల ఫీజుల నియంత్రణకు కూడా ఒక సమగ్రమైన చట్టం తీసుకువద్దామని, దీనిపై కూడా క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సీఎం సూచించినట్టు తెలిసింది. రాబోయే 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి బీటెక్ సీట్ల భర్తీ ప్రక్రియ జులై మొదటి లేదా రెండో వారంలో ప్రారంభం కావాల్సి ఉంది. అప్పటికల్లా ప్రభుత్వం కొత్త ఫీజులను ఖరారు చేస్తూ అధికారిక ఉత్తర్వులు (జీవో) జారీ చేయాలి. అయితే, ఫీజుల ఖరారుపై మరింత సమగ్రంగా అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించిన నేపథ్యంలో మిగిలిన నెల రోజుల వ్యవధిలో ఈ ప్రక్రియ పూర్తవుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కూడా కొత్త ఫీజులను సకాలంలో ఖరారు చేయని సందర్భాల్లో, పాత ఫీజులనే వసూలు చేసి, కొత్త ఫీజులు ఖరారైన తర్వాత వ్యత్యాసాన్ని సర్దుబాటు చేసుకునేలా కళాశాలలకు అనుమతిచ్చారు. ఈసారి కూడా అదే విధానాన్ని అనుసరిస్తారా, లేక ఈ సంవత్సరానికి ఫీజుల పెంపును వాయిదా వేస్తారా అనేది తేలాల్సి ఉంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయంలో ప్రభుత్వ నిర్ణయం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు.. రేవంత్ రెడ్డి, కేంద్రంపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు

హైదరాబాద్ : కృష్ణా నదీ జలాలను అక్రమంగా తరలించుకుపోవడానికి పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ఏ విధంగా ఉపయోగపడిందో, అదే విధంగా గోదావరి జలాలను తరలించుకోవడానికి బనకచర్ల ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు ఉపయోగపడుతుందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు కీలక విషయాలను వెల్లడించారు. ఈ ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుంటే, తెలంగాణ ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. "ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణ పనులను చురుగ్గా చేపడుతుంటే, మన ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది" అని హరీశ్ రావు విమర్శించారు. ఈ నెలాఖరు నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు చేస్తుంటే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇంకా నిద్రలోనే ఉందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేవలం ఉత్తుత్తి మాటలతో కాలం గడుపుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కీలక అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడానికి కూడా ముందుకు రావడం లేదని, కేటీఆర్‌పై ఎలా కేసులు పెట్టాలనే దానిపై ఉన్న శ్రద్ధ, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో లేదని ఆయన అన్నారు.

కేంద్రం తీరుపై విమర్శలు

కేంద్ర ప్రభుత్వ వైఖరిని కూడా హరీశ్ రావు తప్పుపట్టారు. "గత రెండు కేంద్ర బడ్జెట్లను పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌కు నిధుల వరద పారుతుంటే, తెలంగాణకు మాత్రం గుండు సున్నా దక్కింది. నిధులు ఆంధ్రాకే, నదులు ఆంధ్రాకే అన్నట్లుగా ఢిల్లీ పాలకుల తీరు ఉంది" అని ఆయన అన్నారు. నిధుల కేటాయింపుల్లో, నదీ జలాల పంపకాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా రాష్ట్రం నుంచి గెలిచిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది బీజేపీ ఎంపీలు నోరు మెదపడం లేదని, రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కూడా స్పందించడం లేదని విమర్శించారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు ఇచ్చి మరీ సహకరిస్తోందని, తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే హక్కు మీకు ఎవరు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2 టీఎంసీల బాబ్లీ నీటి కోసం 2008లో చంద్రబాబు పోరాటం చేశారని గుర్తు చేస్తూ, ఇప్పుడు ఏకంగా 200 టీఎంసీల నీటితో ఏపీ అక్రమ ప్రాజెక్టు కడుతుంటే తెలంగాణ ప్రభుత్వం ఎంతటి పోరాటం చేయాలో ఆలోచించాలని హరీశ్ రావు అన్నారు. తమకు రాజకీయాల కంటే రాష్ట్ర భవిష్యత్తే ముఖ్యమని స్పష్టం చేశారు. "ఇప్పటికైనా కళ్లు తెరవండి. ఇంకా ఎక్కువ నష్టం జరగక ముందే గోదావరి-బనకచర్లను అడ్డుకోండి. రాష్ట్ర ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ఏ పోరాటానికైనా బీఆర్ఎస్ మద్దతు ఇస్తుంది. మీరు ముందుకు రాకపోతే, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు బీఆర్ఎస్ పార్టీనే పెద్ద ఎత్తున పోరాటం చేస్తుంది" అని హరీశ్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ఇజ్రాయెల్‌పై సరికొత్త క్షిపణిని ప్రయోగించాం: ఇరాన్

## సరికొత్త బాలిస్టిక్ మిస్సైల్ సిద్ధమైంది

ఇంటర్నెట్‌డెస్క్: ఇజ్రాయెల్‌పై అత్యాధునిక క్షిపణిని ప్రయోగించామని ఇరాన్ ప్రకటించింది. ఆ దేశానికి చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ ఈ విషయాన్ని తెలిపింది. ఆదివారం ఇరాన్ జరిపిన క్షిపణి దాడిలో హాజ్ ఖాస్సీం గైడెడ్ బాలిస్టిక్ మిస్సైల్‌ను వినియోగించారు. ఇరాన్ రక్షణ మంత్రి అజీజ్ నసీర్‌జాదా మే 4న ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ తమ వద్ద సరికొత్త బాలిస్టిక్ మిస్సైల్ సిద్ధమైందని ప్రకటించారు. అది అమెరికా థాడ్, పేట్రియాట్ గగనతల రక్షణ వ్యవస్థలను కూడా ఛేదించుకొని వెళ్లగలదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇజ్రాయెల్ వీటిని కూడా వినియోగిస్తోంది. ఈ సరికొత్త క్షిపణి రేంజ్ 1200 కిలోమీటర్లుగా ఇరాన్ పేర్కొంది. దీని వార్ హెడ్ తన గమనాన్ని మార్చుకోగలదని.. అందుకే ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ఛేదిస్తుందని వెల్లడించింది. దీనికి ఐఆర్‌జీసీ ఖుద్స్ ఫోర్స్ జనరల్ ఖాసిం సులేమానీ పేరు పెట్టినట్లు చెప్పింది. కాకపోతే దీనిని కచ్చితంగా ఏ ప్రదేశంపై ప్రయోగించిందో మాత్రం వెల్లడించలేదు. నిన్న రాత్రి ఇరాన్ జరిపిన క్షిపణి దాడుల్లో 200 మంది గాయపడ్డారని ఇజ్రాయెల్ ప్రభుత్వం వెల్లడించింది. బెట్‌యామ్ ప్రాంతంలో దాదాపు 35 మంది ఆచూకీ గల్లంతైందని ఆ దేశ మీడియా పేర్కొంది. ఇరాన్‌తో మొదలైన సంక్షోభం రోజుల్లో ముగిసే విషయం కాదని అమెరికా శ్వేతసౌధం, ఇజ్రాయెల్ అధికారులు పేర్కొన్నారు. దీనికి కొన్ని వారాల సమయం పట్టొచ్చన్నారు. ఇజ్రాయెల్ చేపట్టిన ఆపరేషన్‌కు అమెరికా అనుమతి పరోక్షంగా లభించినట్లు వారు పేర్కొన్నారు.

## తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో లీడర్ కార్యక్రమం.. టార్గెట్ యూత్

హైదరాబాద్: తెలంగాణ యువత, మహిళలకు రాజకీయ శిక్షణ అందించేందుకు తెలంగాణ జాగృతి 'లీడర్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. యువతను రాజకీయాల్లోకి రప్పించి, సమాజంలో మార్పు తీసుకురావడానికి అవసరమైన నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమ లక్ష్యం. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత, మహిళలకు తెలంగాణ జాగృతి ఒక రాజకీయ శిక్షణ వేదికగా మారబోతుందని తెలిపారు. రాజకీయాల్లోకి యువత రావడం ద్వారా స్వచ్ఛమైన రాజకీయాలకు నాంది పడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. తెలంగాణ గడ్డ అంటే ప్రశ్నించే తత్వం అని కవిత పేర్కొన్నారు. ప్రశ్నించే తత్వం మనతో ఆగవద్దని, ముందు తరాలకూ ప్రశ్నించే తత్వాన్ని నేర్పించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమం ద్వారా యువతలో ప్రశ్నించే ఆలోచనలను ప్రోత్సహించడం ముఖ్యమని స్పష్టం చేశారు కవిత. దీని కోసం తెలంగాణ వ్యాప్తంగా ప్రతీ నెల మూడు రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహించబడతాయన్నారు. జులైలో హైదరాబాద్‌లో ప్రారంభించి, ఆగస్టు నుంచి జిల్లాల్లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంపై ఆసక్తి ఉన్న ప్రతీ ఒక్కరూ ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొనాలని కవిత కోరారు. ఇది ఒక నిరంతర కార్యక్రమంగా కొనసాగుతుందని ఆమె వెల్లడించారు. సర్పంచ్ నుంచి మొదలుకుని ఎమ్మెల్యే, ఎంపీ వంటి ప్రజాప్రతినిధుల విధులు, పరిధి, పరిమితులు అందరికీ తెలియాల్సిన అవసరం ఉందని కవిత ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజాసమస్యలను గుర్తించడం, వాటిని పరిష్కరించడం, అభివృద్ధికి నిధులు సాధించడం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజాసేవ చేయాలన్న సంకల్పం ఉంటే అన్ని దారులు ప్రజాసంక్షేమం వైపు వెళ్తాయని ఆమె అన్నారు. యువత, మహిళలు, తెలంగాణ వాదాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రతీ ఒక్క నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ వస్తున్నామని కవిత పేర్కొన్నారు. చేసే పోరాటాలకు కూడా ఫలితం వచ్చే రోజు వస్తుందని ఆమె చెప్పారు. మహిళా రిజర్వేషన్ల చట్టం వచ్చినందున.. రాబోయే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో 33 శాతం మహిళా అభ్యర్థుల నాయకులు కావాల్సిన అవసరం ఉంటుందని గుర్తు చేశారు. డీలిమిటేషన్ తర్వాత తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 153కు పెరుగుతాయని, లోక్ సభ సీట్లు కూడా పెరుగుతాయని అన్నారు. కాబట్టి, మనం నాయకులను తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వచ్చే వరకూ ఉద్యమిస్తామని వెల్లడించారు కవిత.

# అంతరిక్షంలోకి శుభాంశు శుక్లా..

న్యూఢిల్లీ : భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్షంలోకి పయనం కానున్నారు. ఆగ్జియమ్-4 (యాక్స్-4) వాణిజ్య అంతరిక్ష యాత్రలో భాగంగా ఆయన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐ.ఎస్.ఎస్) వెళ్లనున్నారు. పలుమార్లు వాయిదా పడిన ఈ ప్రయోగాన్ని ఈనెల 19న చేపట్టేందుకు సర్వం సిద్ధమైంది. ఈ యాత్ర విజయవంతమైతే రాకేశ్ శర్మ తర్వాత అంతరిక్షంలోకి వెళ్లిన రెండో భారతీయుడిగా శుభాంశు శుక్లా చరిత్ర సృష్టిస్తారు. ఆగ్జియమ్ స్పేస్ సంస్థ, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సహకారంతో ఈ యాత్రను నిర్వహిస్తోంది. స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ ద్వారా ఈ ప్రయోగం జరగనుంది. నలుగురు సభ్యుల బృందంలో శుభాంశు శుక్లా పైలట్‌గా వ్యవహరించనున్నారు. మిషన్ కమాండర్‌గా నాసా మాజీ వ్యోమగామి పెగ్గీ విట్సన్, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ప్రాజెక్ట్ వ్యోమగామి స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ-విస్నీవ్‌స్కీ (పోలాండ్), టిబోర్ కాపు (హంగేరి) ఇతర సభ్యులుగా ఉన్నారు. వాస్తవానికి ఈ మిషన్ మే 29న ప్రారంభం కావాల్సి ఉండగా.. ఫాల్కన్-9 రాకెట్‌లో ద్రవ ఆక్సిజన్ లీక్ సమస్య తలెత్తడంతో పలుమార్లు వాయిదా పడింది. తొలుత ఈనెల 8కి, ఆపై 10, మళ్లీ 11వ తేదీలకు మార్చినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీనికి తోడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని రష్యన్ జ్వెజ్డా మాడ్యూల్‌లో పీడన సమస్య కూడా తలెత్తడంతో నాసా, ఆగ్జియమ్ స్పేస్ సంస్థలు వ్యోమగాముల భద్రత దృష్ట్యా ప్రయోగాన్ని మరింత ఆలస్యం చేశాయి. అయితే, ఇటీవల జరిగిన సమన్వయ సమావేశంలో అన్ని సాంకేతిక సమస్యలను విజయవంతంగా పరిష్కరించినట్లు ఇస్రో ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో జూన్ 19న ప్రయోగానికి మార్గం సుగమమైందని పేర్కొంది. శుభాంశు శుక్లా యాత్రకు సంబంధించిన ఏర్పాట్లలో ఇస్రో చురుగ్గా పాలుపంచుకుంటోంది. ఈ ఆగ్జియమ్-4 మిషన్ విజయవంతమైతే వాణిజ్య అంతరిక్ష ప్రయాణ రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవడమే కాకుండా, అంతర్జాతీయ మానవసహిత అంతరిక్ష యాత్రలలో భారతదేశ పాత్రను మరింత బలోపేతం చేస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు.. రేవంత్ రెడ్డి, కేంద్రంపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు

హైదరాబాద్ : కృష్ణా నదీ జలాలను అక్రమంగా తరలించుకుపోవడానికి పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ఏ విధంగా ఉపయోగపడిందో, అదే విధంగా గోదావరి జలాలను తరలించుకోవడానికి బనకచర్ల ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు ఉపయోగపడుతుందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు కీలక విషయాలను వెల్లడించారు. ఈ ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుంటే, తెలంగాణ ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. "ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణ పనులను చురుగ్గా చేపడుతుంటే, మన ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది" అని హరీశ్ రావు విమర్శించారు. ఈ నెలాఖరు నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు చేస్తుంటే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇంకా నిద్రలోనే ఉందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేవలం ఉత్తుత్తి మాటలతో కాలం గడుపుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కీలక అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడానికి కూడా ముందుకు రావడం లేదని, కేటీఆర్‌పై ఎలా కేసులు పెట్టాలనే దానిపై ఉన్న శ్రద్ధ, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో లేదని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని కూడా హరీశ్ రావు తప్పుపట్టారు. "గత రెండు కేంద్ర బడ్జెట్లను పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌కు నిధుల వరద పారుతుంటే, తెలంగాణకు మాత్రం గుండు సున్నా దక్కింది. నిధులు ఆంధ్రాకే, నదులు ఆంధ్రాకే అన్నట్లుగా ఢిల్లీ పాలకుల తీరు ఉంది" అని ఆయన అన్నారు. నిధుల కేటాయింపుల్లో, నదీ జలాల పంపకాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా రాష్ట్రం నుంచి గెలిచిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది బీజేపీ ఎంపీలు నోరు మెదపడం లేదని, రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కూడా స్పందించడం లేదని విమర్శించారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు ఇచ్చి మరీ సహకరిస్తోందని, తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే హక్కు మీకు ఎవరు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2 టీఎంసీల బాబ్లీ నీటి కోసం 2008లో చంద్రబాబు పోరాటం చేశారని గుర్తు చేస్తూ, ఇప్పుడు ఏకంగా 200 టీఎంసీల నీటితో ఏపీ అక్రమ ప్రాజెక్టు కడుతుంటే తెలంగాణ ప్రభుత్వం ఎంతటి పోరాటం చేయాలో ఆలోచించాలని హరీశ్ రావు అన్నారు. తమకు రాజకీయాల కంటే రాష్ట్ర భవిష్యత్తే ముఖ్యమని స్పష్టం చేశారు. "ఇప్పటికైనా కళ్లు తెరవండి. ఇంకా ఎక్కువ నష్టం జరగక ముందే గోదావరి-బనకచర్లను అడ్డుకోండి. రాష్ట్ర ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ఏ పోరాటానికైనా బీఆర్ఎస్ మద్దతు ఇస్తుంది. మీరు ముందుకు రాకపోతే, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు బీఆర్ఎస్ పార్టీనే పెద్ద ఎత్తున పోరాటం చేస్తుంది" అని హరీశ్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## తల్లికి వందనంపై చంద్రబాబు

# మాట తప్పారంటూ రోజా ఫైర్

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు, అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న తీరుకు పొంతన లేదని ఆమె విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని, వాటి గురించి ప్రశ్నిస్తే నాలుక మందమని అనుకోవాల్సి వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ రోజా ఘాటుగా స్పందించారు. "చంద్రబాబు గారిని సూటిగా ప్రశ్నిస్తున్నా. ప్రతి విద్యార్థి తల్లికి 'తల్లికి వందనం' పథకం కింద రూ.15 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఇప్పుడు అడ్డగోలు షరతులు విధిస్తూ కొందరికే ఈ పథకాన్ని పరిమితం చేశారు. తల్లులను మోసం చేసిన మిమ్మల్ని ఏమనాలి బాబు గారూ?" అంటూ రోజా నిలదీశారు. ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాల కోసం ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కో పథకాన్ని నీరుగార్చడం చంద్రబాబు ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ఆమె ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూనే, మరోవైపు షరతులతో వాటికి కోతలు విధిస్తున్నారనేది వాస్తవం కాదా? అని ఆమె ప్రశ్నించారు. ముఖ్యంగా 'తల్లికి వందనం' పథకం విషయంలో కేంద్రీయ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల తల్లులను పూర్తిగా అనర్హులుగా చేయడం దారుణమని రోజా అన్నారు. "గతంలో జగనన్న హయాంలో కేంద్రీయ విద్యాలయాల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి తల్లికి 'అమ్మ ఒడి' పథకం ద్వారా లబ్ధి చేకూర్చాం. ఆ వివరాలు ప్రభుత్వం దగ్గర అధికారికంగా ఉన్నాయి. కానీ, ఇప్పుడు పథకాన్ని ఎగ్గొట్టే కుట్రతో యూడైస్ ప్లస్ నుంచి కేవీ సంస్థలను కట్ చేసినట్టు తెలుస్తోంది. దీనివల్ల తాము తల్లికి వందనం పథకానికి దూరమవుతున్నామని తల్లులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు" అని రోజా తెలిపారు. పేరుకు అందరికీ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెబుతూ, మరోవైపు ఇలా లబ్ధిదారులను తగ్గించడం ప్రభుత్వ మోసపూరిత వైఖరికి నిదర్శనమని ఆమె విమర్శించారు. ఇలాంటి చర్యల వల్ల కూటమి ప్రభుత్వం భవిష్యత్తులో ఇంకెన్ని కోతలు విధిస్తుందోననే ఆందోళన ప్రజల్లో ఉందని రోజా వ్యాఖ్యానించారు. "అందుకే జగన్ అంటే నమ్మకం, బాబు అంటే మోసం అని ప్రజలు అనుకుంటున్నారు" అని పేర్కొన్నారు. ఈ మేరకు రోజా ట్వీట్ చేశారు.

## 48వ డివిజన్ మున్నూరు కాపు నూతన అధ్యక్ష , కార్యదర్శులుగా ఎంపిక



ప్రభాత సూర్యుడు - ఖమ్మం: ఖమ్మం జిల్లా కేంద్రం సారథి నగర్ పరిధిలోని మున్నూరు కాపు సభ్యులను మాజీ కార్పొరేటర్ శ్తోట రామరావు నివాసంలో మున్నూరు కాపు రాష్ట్ర ఉపాదక్షులు ఆకుల గాంధీ సమక్షంలో 48వ డివిజన్ మున్నూరు కాపు అధ్యక్షులుగా శాభాసు వెంకట రమణ , కార్యదర్శి గా ఆకుల సత్యనారాయణ ( సత్యం) లను ఎన్నుకున్నారు . ఈ సందర్భంగా అధ్యక్ష , కార్యదర్శి లను రాకం శ్యామ్ బాబు , విప్ప వేణు , వెంకట నరసయ్య , ప్రభాకర్ , రాధాకృష్ణ , రవికిషోర్ , వెంకటప్పయ్య , వీరాస్వామి , నర్సింహరావు , నాంచారయ్య లు అభినందనలు తెలియజేశారు .

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం.



చిలుకూరు ( ప్రభాత సూర్యుడు): మండలంలోని నారాయణపురం గ్రామంలో జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల లో 1999 - 2000 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. అనంతరం తమ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గత ప్రధానోపాధ్యాయులు పి నరసయ్య, పూర్వ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, నరసయ్య, పరమేష్, నారాయణపురం శ్రీను సార్, రవి చందర్ లను సన్మానించారు. పూర్వ విద్యార్థులు కీసర నాగరాజు, కోల్లయ్య, లింగస్వామి, ఎమ్మెస్ నాగలక్ష్మి , సరిత తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ

## వేడుకలను ఘనంగా నిర్వహించాలి



చిలుకూరు ( ప్రభాత సూర్యుడు) : చిలుకూరు మండలంలోని నారాయణపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి రాష్ట్ర నాయకులు కొండపల్లి ఆంజనేయులు మాదిగ మాట్లాడుతూ జూలై 7వ తేదీన గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని అన్నారు. అనంతరం నూతన గ్రామ కమిటీనీ ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నూతన అధ్యక్షుడిగా కందుకూరి ఏసు మాదిగ, కందుకూరు సైదులునుఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి సత్యరాజ్ మాదిగ, చిలుకూరు మండల అధ్యక్షులు మల్లె పొంగు సూరిబాబు, జిల్లా మండల నాయకులు కందుకూరి శ్రీను, వెంకటయ్య, సైదులు, దన మూర్తి, నరసయ్య ,నరేష్ ,గాంధీ నాగరాజు, కాంతారావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మెగా లోక్-అదాలత్ ను విజయవంతం చేసిన అధికారులను, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ శ్రీ. పరితోష్ పంకజ్ ఐపిఎస్.

సంగారెడ్డి జిల్లా:: అరుణ ప్రభ ప్రతినిధి: జాతీయ మెగా లోక్-అదాలత్ లో భాగంగా, జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన, రాజీ పడటానికి అవకాశం ఉన్నటువంటి మరియు చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న 502 - ఐ.పి.సి., 206 - సైబర్ క్రైమ్, ఇ-పెట్టి -300, డిడి కేసులు - 1279 మొత్తం = 4287 కేసులలో ఇరు వర్గాలను రాజీ కుదిరచడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.. జాతీయ మెగా లోక్-అదాలత్ లో భాగంగా సైబర్ క్రైమ్ రీఫండ్ నందు రాష్ట్ర స్థాయిలో జిల్లాకు ఐదవ స్థానం, కమిషనరేట్లు మినహా జిల్లాతో పోలిస్తే సంగారెడ్డి జిల్లాకు మొదటి స్థానం రావడం జరిగిందన్నారు. జిల్లాను రాష్ట్ర స్థాయిలో అగ్రగామిగా ఉంచడంలో కృషి చేసిన అధికారులు, సైబర్ క్రైమ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవాడానికి లోక్-అదాలత్ అనేది ఒక మంచి అవకాశం అని, అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోకూడదని అన్నారు. రాజీ మార్గమే రాజా మార్గం అని, రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్ని కేసులల్లో ఇరు వర్గాలు రాజీపడవచ్చు అన్నారు. ముఖ్యంగా సైబర్ బాధితులకు సత్వర న్యాయం చేయాలని, టి యస్ సి యస్ బి %ళి%తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరోం డైరెక్టర్ శ్రీమతి. శిఖాగోయల్ ఐపిఎస్. గారి ఆద్వర్యంలో ప్రతి జిల్లాలో డి4సి ని ఏర్పాటు చేసి డియస్పి స్థాయి అధికారులచే పర్యాయవేక్షించడం జరుగుతుందన్నారు. సంగారెడ్డి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన సైబర్ నేరాలలో ఈ జాతీయ మెగా లోక్-అదాలత్ నందు 206 సైబర్ క్రైమ్ కేసులలో 1 కోటి, 43 లక్షల రూపాయలను తిరిగి సైబర్ బాధితులకు ఇప్పించేందుకు ఆర్డర్ కాపీలను సంబంధిత బ్యాంక్ నోడల్ అధికారులకు పంపించడం జరిగిందన్నారు. జిల్లా ప్రజలెవరైనా సైబర్ మోసాలకు గురి అయినట్లయితే వెంటనే 1930 కి కాల్ చేసి గాని, ఎన్ సి ఆర్ పి పోర్టల్ నందు లాగిన్ అయి దరఖాస్తు చేయవచ్చు అన్నారు. ఈ సందర్భంగా జాతీయ మెగా లోక్-అదాలత్ ను విజయవంతం చేసిన అధికారులు డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, డి4సి ఇన్స్పెక్టర్ రవి, ఐటి ఇన్స్పెక్టర్ కిరణ్, ఎస్ఐ సత్యనారాయణ, అధికారులను, కోర్ట్ డ్యూటీ, సైబర్ సెల్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది

### పేద ప్రజల కోసం మూడు నెలలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుంది.

### పెద్ద గొట్టిముక్కల గ్రామం పాఠశాల అభివృద్ధికి పది లక్షలు మంజూరు మెదక్ ఎంపీ రఘునందన్ రావు.

శివంపేట జూన్ 15 : గ్రామాల అభివృద్ధికి బిజెపి పార్టీ కోసం కృషి చేస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు మెదక్ జిల్లా శివంపేట మండలంలోని పెద్ద గొట్టేముక్కల గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు భారతీయ జనతా పార్టీలో చేరిన సందర్భంగా మండల బిజెపి అధ్యక్షులు పెద్దపులి రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ గ్రామాలను అభివృద్ధి చేయడంలో కాంగ్రెస్ విఫలం చెందాయని ఆయన ఆరోపించారు బిజెపి ప్రభుత్వం తెలంగాణలో అనేక సంక్షేమ పథకాలు పేదల కోసం అమలు చేసి అందజేస్తుందని కూడా ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు అభివృద్ధికి సాధ్యమని ఈ సందర్భంగా చెప్పారు త్వరలో వికలాంగులు ట్రై సైకిల్ ఇప్పిస్తామని మెదక్ ఎంపీ రఘునందన్ రావు చెప్పారు గ్రామానికి ఆర్టిసి బస్సు వేయడం కోసం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు వచ్చే సంవత్సరం పెద్ద గొట్టుముక్కల గ్రామానికి సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని సభలు హామీ ఇచ్చారు గ్రామాల్లోనూ భారతీయ జనతా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షులు వాల్దాస్ మల్లేశం గౌడ్ ప్రసంగిస్తూ గ్రామాల్లోనూ భారతీయ జనతా పార్టీ అభివృద్ధి కోసం అందరం కలిసి కృషి చేయాలని సూచించారు నాయకులు కార్యకర్తలు చేరిన వారు గ్రామాల అభివృద్ధి కోసం పార్టీ అభివృద్ధికి కృషి చేయవలసిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు గ్రామాల్లోనూ బిజెపి పార్టీ కమిటీలు కూడా వేసి పార్టీ బలోపేతం కోసం అందరం ఐక్యంగా ఉండి కృషి చేయాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు గడ్డం శ్రీనివాస్ కొండలరావు పెద్దపులి రవి. ఎరుకల బిక్షపతి నరసాపూర్ ఆంజనేయులు గౌడ్ కాషా ఆంజనేయులు చారి.అశోక్ షాదుల్లా సురేష్ వినోద్ భాస్కర్ గౌడ్ శేఖర్ సుదర్శన్ శ్రీనివాస్ గౌడ్ భాస్కర్ గౌడ్ గ్రామాలకు చెందిన బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు

# ఒక్కరోజు ఫోటో పెట్టడం కాదు ప్రతిరోజ బుక్కెడు బువ్వ పెట్టండి

### పుణ్యక్షేత్రాలు ఎన్ని తిరిగిన నీకు పుణ్యం రాదు నీ తల్లిదండ్రులను పూజించు స్వర్గానికి వెళ్తారు

### -తొట్ల వెంకటలక్ష్మి కవయిత్రి

చిన్న గూడూరు/: ఫాదర్స్ డే శుభాకాంక్షలు ఒక్కరోజు ఫోటో పెట్టడం కాదు ప్రతిరోజ బుక్కెడు బువ్వ పెట్టండి వారు బ్రతికినంత కాలం భద్రతగా బాధ్యతగా చూసుకోండి. అంతకంటే తండ్రికి అదృష్టం మరొకటి లేదు పిల్లలకు తొలి మార్గదర్శి ఆ తండ్రే తండ్రి లేనిదే తనయునికి తనము లేదు. అ తండ్రికి పిల్లలే ఒక ప్రపంచం ఆ ఇల్లును నడిపించే నావా నానే నా తండ్రి ఎదపై నడక నేర్చుకున్నాను తన చూపుడు వేలు పట్టి లోకాన్ని చూసాను. అమ్మే నా దేహము నానే నా ప్రాణం అమ్మ నాన్న అనే మాట నాకు తెలియదు నా బాల్యంలో మా అయ్య బహు కష్టపడటం నేను చూశాను. భూమి పోడు గడ్డ తండా రైతులకు పెద్ద మోట బొక్కెన వాటి చుట్టూ రంధ్రాలు ఉండేటివి తోలు తొండంతో ఆ బొక్కినకు పెద్ద ఆరెతో కజం వేసేవారు మా అయ్య కజమంటే కుట్టడం తోలు కు టు వారితో కుట్టి ఆ మోట ఓకేనా ను నెత్తినెత్తుకొని గొడ్లకు బెరటాకులు పనకుచ్చులు చెప్పుల జోళ్ళు ఇవన్నీ పట్టుకొని మా అవ్వ మా అయ్యా నన్ను చేతిలో పట్టుకొని మధ్యలో జిన్నేల వాగు దాటుకుని భూమి పోడు గడ్డ తండాకు వెళ్లేవారు నాకు జొన్న రొట్టెలు అడిగి పెట్టేవారు కనుమరువై ఉన్న నా తల్లిదండ్రులకు పాదాభివందనాలు వరి కల్లాలు చేస్తూ తెగ లుకూ డు తూ వారి జీవితాన్ని మాకు త్యాగం చేసిన రూ అలాంటి తండ్రి రుణం తీర్చుకోలేదు నేను ఎందుకంటే వారు లేరు తండ్రి ఉన్నవారికి తండ్రి బరువు తండ్రి లేని వారికి తండ్రి కరువు ప్రతిరోజు వారిని తలవకుండా అర ముద్ద కూడా నేను నోట్లో పెట్టను ఇది అక్షర సత్యం ఈ సమాజంలో నేను చూస్తున్నా నిజాలు నిగ్గు తండ్రి ఏది సంపాదించి పెట్టలేదని చిత్రహింసలు పెట్టి అనాథాశ్రమంలో తోలుతున్నారు బుక్కెడు బువ్వ కొరకు కోడలు కొడుకులు కొడుతున్నారు తిడుతున్నారు తండ్రి పిల్లలకు ఏ నుముక్క అనుకుంటే వెనకనే పడేస్తుండు తండ్రి ఈ చెడ్డ సమాజం మార్పులేని మానవ సమాజం లగేజ్ తోటి రాలేదు మానవుడు లగేజ్ తోటి పోరు ఎవరు? ఇక్కడిది ఇక్కడ వదిలేసి పోవాల్సిందే కదా ఎన్నటికైనా బు కె డు బువ్వ కోసం ఎందుకంత చిత్రహింసలు పెడుతుండ్రు తల్లిదండ్రులను వాళ్ల పిల్లల వీలు కూడా పిల్లలు అనుకోవచ్చు కదా సప్త తీర్థాలు సప్త దీపాలు సప్త పుణ్యక్షేత్రాలు ఎన్ని తిరిగినా కానీ నీకు పుణ్యం రాదు నీ తల్లిదండ్రులను పూజించు స్వర్గానికి వెళ్తారు కానీ తల్లిదండ్రులను హింస పెడితే అంతకంటే పాపం మరొకటి లేదు కాలానికి కర్మకి మానవుడు బాగా గుర్తుండిపోతాడట గుర్తుపెట్టు కొండి తల్లిదండ్రి దీవెన తోటే ఎక్కడికెళ్లినా నువ్వు క్షేమంగా ఇంటికి వస్తావా గుర్తుపెట్టుకో మాన వ తండ్రి ఒళ్లంతా పుండు బిడ్డలకు ఇస్తుండు పండు తండ్రి చాలా గొప్పవాడు. నిన్ను ఎత్తుకొని భుజాలపై మోస్తాడు ఎందుకంటే తనకంటే ఎత్తుగా నువ్వు ఎదగాలని ఏ బంధాన్ని అయినా మర్చిపో కానీ తల్లిదండ్రుల బంధాన్ని మర్చిపోకు ఎందుకంటే వారు లేకుంటే నీవు లేవు గుర్తుపెట్టుకో కష్టాల కావడి కన్నీళ్లు ఒరవడి బాధలన్నీ గుండెల్లో దాచుకొని బాధ్యతగా పనిచేసేవాడు తండ్రి చెమటతో చెమట మొక్కలు నాటుతాడు తండ్రి శ్రమను దోసుకున్న పుత్రచోరులు కొందరు ఈ సమాజం ఇకనైనా మారండి మార్చుకోండి



ఇవాళ ఇంట్లో రేపు మట్టిలో ఈ జీవితాలు నా తల్లిదండ్రుల రుణాన్ని తీర్చుకోవాలంటే నాకు దక్కకుండా చేశాడు ఆ దేవుడు తండ్రి లేని వారికి తండ్రి కరువు తండ్రి ఉన్నవారికి తండ్రి బరువు నేను చూస్తున్న మానవత్వం లేని ఈ సమాజం తండ్రి సంపాదన ఆ పిల్లలే తండ్రి ఏమి సంపాదించలేదని తల్లిదండ్రులను చిత్రహింసలు పెట్టి అనాధ ఆశ్రమం కు పంపుతున్నారు ఎంతవరకు న్యాయం బుక్కెడు బువ్వ పెట్టలేక కొడుకులు కోడండ్లు కొడుతున్నారు తిడుతున్నారు తండ్రి పిల్లలకు వెన్ను ముక్క అంటారు ఎనకకే పడేస్తున్నారు మార్పు లేని ఈ సమాజం మానవత్వం లేని మనుషులు మారేది ఎన్నటికో మానవుడు లగేజ్ తోటి రాలేదు లగేజ్. తో టీ పోలేరు కాబట్టి స్వస్థ సముద్రాలు దాటిన సప్త దీపాలు తిరిగిన సప్త పుణ్యయాత్రలు తిరిగిన పుణ్యమేమీ రాదు నీకు తల్లిదండ్రులను పూజిస్తే అంతకంటే పుణ్యము ఇంకేమీ ఉండదు తల్లిదండ్రులను హింస పెడితే అంతకంటే పాపము మరొకటి లేదు ఏ బంధాన్ని దూరం చేసుకున్న తల్లి తండ్రుల బంధాన్ని మాత్రం దూరం చేసుకోకు ఎందుకంటే ఆ బంధం లేనిదే నీవు లేవు మిత్రమా తండ్రి చాలా గొప్పవాడు నిన్ను భుజాలపై మోస్తుంటాడు ఎందుకంటే తనకంటే ఎత్తుగా పైకి నీవుఎదగాలని కష్టాలు కన్నీళ్లు గుండెల్లో దాచుకొని చెమట మొక్కలు నాటిన శ్రమ తండ్రి ది మాత్రమే తండ్రి శ్రమను దోసుకున్న బిడ్డలు కొడుకులు ఉన్నారు కానీ వారి పాపానికి ప్రాయశ్చిత్తం ఉండదు పిల్లలకు తొలి మార్గదర్శి తొలి ఆది గురువు ఆత్మ జ్యోతి ఆ తండ్రి వెలుగు మాత్రమే.

తొట్ల వెంకటలక్ష్మి కవయిత్రి

# సైనికులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి

### వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు

### వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్ లో పాల్గొన్న జవాన్లకు స్వాతంత్ర సమరయోధులకు మరియు రైతుకు సన్మానం .







15 జూన్/మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక కిరాణా వెల్ఫేర్ అసోసియేషన్ హాల్లో వాసవి క్లబ్ వారి డాన్ టు డస్క్ 2025 కార్యక్రమాన్ని వాసవి క్లబ్ అధ్యక్షుడు కర్లపాటి హరి, ప్రధాన కార్యదర్శి సాయి కృష్ణ, కోశాధికారి ఉపేందర్ అధ్యక్షతన వాసవి క్లబ్ 101 ఎ గవర్నర్ వేమిశెట్టి కిషోర్ కుమార్ ఆదేశాల మేరకు వాసవి క్లబ్ ఆర్సి వేమిశెట్టి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డాన్ టు డస్క్ అనగా సూర్యుడు ఉదయించిన నుండి అస్తమించే వరకు చేయు సేవా కార్యక్రమాలను పిలుస్తారని అన్నారు వాసవి క్లబ్ మరియు ఇతర క్లబ్బులతో భిన్నంగా సేవా కార్యక్రమంలు ఉంటాయని క్లబ్ వారు అత్యధికముగా విద్యకు సహాయం చేస్తుందని వాసవి క్లబ్ ను ప్రధానంగా హైదరాబాదులో స్థాపించి నేడు విశ్వవ్యాప్తంగా విస్తరించి వివిధ దేశాలలో ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రస్తుతం 13 దేశాల్లో పనిచేస్తుందని వాసవి క్లబ్ 2013లో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుతుందని వాసవి క్లబ్ లో అందరూ ఆర్యవైశ్యులే ఉంటారని ఈ వాసవి క్లబ్ అనగా వైశ్యులు వీరు అందరికీ సహాయం చేసే వారి కానీ ఆసించేవారు కాదని అన్నారు ఈ కార్యక్రమంలో ఆపరేషన్ సింధూర్ లో జిల్లా కు చెందిన జవానులయినా వినయ్,సాయి మరియు సుధాకర్ యుద్ధంలో పాల్గొని విశిష్ట సేవలు అందించగా వారిని మరియు అలాగే జిల్లా కేంద్రానికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు గర్రెపల్లి సత్తయ్యను కె సి జి ఎఫ్ సిల్వర్ స్టార్ చిదిరాల లింగయ్య మరియు మరొక ముఖ్యఅతిథి కమటాల భాస్కరరావు అలాగే జిల్లా కేంద్రానికి చెందిన సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొని వారిని ఘనంగా సన్మానించారు అలాగే ప్రస్తుతం వ్యవసాయం చేస్తున్న రైతు యువ రైతు మహిపాల్ రెడ్డి ని ఘనంగా దుశాలువాతో మెమెంటోలతో సన్మానం నిర్వహించినారు ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులను రైతులను సన్మానించడం అభినందనీయమని అలాగే నేటి యువత ఆర్మీ జవాన్లను ఆదర్శంగా తీసుకోవాలని ప్రతి ఒక్క తల్లిదండ్రులు తమ కుమారులను ఒక డాక్టర్ ఎటు ఒక ఇంజనీరు చేయాలన్న సంకల్పంతో ఉన్నారు కానీ తక్కువ మంది మాత్రమే తల్లిదండ్రులు తమ కుమారులను దేశ సేవలో భాగంగా ఆర్మీ సైనికులను చేయాలనే సంకల్పం వారికి కలగడం ఆనందమని నేటి యువత ప్రతి ఒక్కరూ సైనికులను ఆదర్శంగా తీసుకొని దేశ సేవలో భాగస్వామ్యం కావాలని వారు పిలుపునిచ్చారు కార్యక్రమంలో ఆర్య వైశ్యులు మరియు వాసవి క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# నిర్ధేశించిన గడువులోగా భూ సమస్యల పరిష్కారం

### పదేళ్లలో పడ్డ గోసను రెవెన్యూ సదస్సుల్లో ఆవేదనతో రైతులు చెప్పుకుంటున్నారు

### 7,578 రెవెన్యూ సదస్సుల్లో 4.61 లక్షల దరఖాస్తులు స్వీకరణ

### ఐదు నక్షా గ్రామాల్లో శరవేగంగా భూ సర్వే

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ : రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై రైతులు చేసుకున్న దరఖాస్తులను నిర్ధేశించిన గడువులోగా పరిష్కరించాలని రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 3వ తేదీ నుంచి హైదరాబాద్ జిల్లా మినహా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఇప్పటి వరకు 561 మండలాల్లో 7,578 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ సదస్సుల్లో 4.61 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈసదస్సులు ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి మానవతా దృక్పథంతో వీలైనంత త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై అధికారులతో ఆదివారం నాడు సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఆగస్టు 15వ తేదీనాటికి అన్ని భూ సమస్యలను పరిష్కరించాలని ఈ ఇందిరమ్మ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం పనిచేయాలన్నారు. గత పదేళ్ల కాలంలో భూ సమస్యలకు సంబంధించి రైతులు ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. ధరణి చట్టం వచ్చాక తమ ప్రమేయం లేకుండానే రైతులు భూ సమస్యల్లో చిక్కుకున్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన రెవెన్యూ యంత్రాంగం ధరణి కారణంగా ఉత్సవ విగ్రహాల్లా మారిపోయారు. ప్రతిదానికి కోర్టు మెట్లు ఎక్కడమేతప్ప రైతుకు మరోదారి లేకుండా పోయింది. దాదాపు గత రెండు నెలలుగా భూభారతి చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో దాదాపు 50 ప్రాంతాల్లో తాను స్వయంగా పాల్గొనడం జరిగిందని, ఆసదస్సుల్లో రైతులు తమ గోసను ఆవేదనతో చెప్పుకోవడం తనను ఎంతో బాధకు గురిచేసిందన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నేతృత్వంలో భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చాం. ఈ చట్టాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా రైతులకు మేలు చేసేలా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు.

శరవేగంగా భూ సర్వే

రాష్ట్రంలో తరతరాలుగా సర్వే చేయని లేదా సర్వే రికార్డులు లేని ఐదు నక్షా గ్రామాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన భూసర్వే శరవేగంగా సాగుతోందని మంత్రి పొంగులేటి తెలిపారు.

రాష్ట్రంలో నక్షా గ్రామాలను గత ప్రభుత్వం గాలికి వదిలేస్తే గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వం లోని ఇందిరమ్మ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో సర్వే చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 413 నక్షా గ్రామాలకు గాను ఐదు గ్రామాలలో ప్రయోగాత్మకంగా గత నెల మూడవ వారం నుంచి సర్వేను ప్రారంభించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో పైలెట్ గ్రామాలుగా మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్‌లో 422 ఎకరాలకు 337 ఎకరాల్లో సర్వే పూర్తయిందన్నారు. జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి ( కొత్తది) గ్రామంలో 626 ఎకరాలకు 269 ఎకరాలు, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ లోని 845 ఎకరాలకు 445 ఎకరాలు ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురులో 502 ఎకరాలకు 232 ఎకరాలు సంగారెడ్డి జిల్లా వట్ పల్లి మండలం షాహిద్ నగర్ లో 593 ఎకరాలకు 308 ఎకరాలలో సర్వే పూర్తయిందని తెలిపారు మొత్తం ఐదు గ్రామాల్లో 2988 ఎకరాలకు గాను ఇప్పటివరకు 1591 ఎకరాల్లో సర్వే పూర్తిచేయడం జరిగిందన్నారు. మరో వారం పదిరోజుల్లో సర్వే ప్రక్రియను మొత్తం పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. చిన్న వివాదాలకు తావులేకుండా రైతుల సమక్షంలోనే క్షేత్రస్థాయిలో భౌతికంగా ఈ సర్వే జరుగుతోందని మంత్రి వివరించారు. ఈ నూతన విధానాల వల్ల భూమి సమాచారం, పారదర్శకత, వివాద పరిష్కారం, భూ యాజమాన్యంలో స్పష్టత వస్తుందని ఫలితంగా రైతులు, గ్రామీణ భూ యజమానులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు.

# రాష్ట్రంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించండి..

### సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి జయంత్ చౌదరి సూచన



**ఐటీఐలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని విజ్ఞప్తి**

**స్కిల్ యూనివర్సిటీకి మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరిన సీఎం**

**ఐటీఐల సిలబస్ అప్‌గ్రేడ్‌కు కమిటీ ఏర్పాటు చేయాలని అధికారులకు సీఎం ఆదేశం**



హైదరాబాద్: రాష్ట్రంలో వీఎఫ్ఎక్స్, గేమింగ్, ఆడియో విజువల్స్ రంగాలకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆయన నివాసంలో కేంద్ర మంత్రి జయంత్ చౌదరి ఆదివారం సమావేశమయ్యారు. ఐటీఐ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. తాము ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసి.. దానిని ఐటీఐలను అనుసంధానిస్తామని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి తెలియజేశారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రిని కేంద్ర మంత్రి అభినందించారు. జాతీయ నైపుణ్య శిక్షణ కింద యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఐటీఐలన్నింటికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని కేంద్ర మంత్రి సీఎంను కోరారు. ఐటీఐల్లో సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం వెంటనే అధికారులను ఆదేశించారు. ఆధునిక పరిశ్రమ అవసరాలకు తగినట్లు కాలానుగుణంగా ఐటీఐల్లో సిలబస్‌ను అప్‌గ్రేడ్ చేయాలని.. ఇందుకోసం ప్రత్యేక కమిటీ నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, సీఎంవో పరిశ్రమలు, పెట్టుబడుల విభాగం సీఈవో జయేశ్ రంజన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులు పాల్గొన్నారు.

https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# సముచిత నిర్ణయాలు

## (విశ్లేషణ)

స్వీయ లోటుపాట్లను సరిదిద్దుకోవటంలో న్యాయవ్యవస్థ సక్రమంగా వ్యవహరించటం లేదన్న విమర్శలు వస్తున్న నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం తీసుకున్న రెండు నిర్ణయాలు ఎన్నదగి నవి. ఇప్పటికే 21 మంది న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను వెల్లడించగా, వాటిని సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. మొన్న మార్చి 4న ఢిల్లీలోని తన అధికార నివాసంలో భారీ యెత్తున కరెన్సీ నోట్ల కట్టలు బయటపడిన ఉదంతంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసనకు చర్యలు తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకూ, ప్రధాని నరేంద్ర మోదీకీ లేఖ రాయటం కీలక పరిణామం. ఆ ఉదంతంపై విచారణకు నియమించిన ముగ్గురు సభ్యుల కమిటీ ఇచ్చిన నివేదికనూ, జస్టిస్ వర్మ ఇచ్చిన ప్రత్యుత్తరాన్ని కూడా దానికి జతపరిచారు. అవినీతి మకిలి అంటిన న్యాయమూర్తుల్ని తొలగించటమనే ప్రక్రియ చాలా సుదీర్ఘమైనదీ,సంక్లిష్టమైనదీ. న్యాయమూర్తిపై ఆరోపణలొచ్చినప్పుడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అంత ర్గత విచారణ కమిటీని నియమించటం, అది ఇచ్చే నివేదికపై నిందపడిన న్యాయమూర్తి అభిప్రా యాన్ని కోరటం, ఆ తర్వాత అవసరమనుకుంటే రాజీనామా లేదా స్వచ్ఛంద పదవీ విరమణ చేయమని అడగటం రివాజుగా వస్తోంది. అందుకు నిరాకరిస్తే పార్లమెంటులో అభిశంసన తీర్మానం ద్వారా తొలగించమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిఫార్సు చేస్తారు. ఈ తీర్మానం కోసం ఇచ్చే నోటీసుపై లోక్‌సభలో కనీసం 150 మంది ఎంపీలూ, రాజ్యసభలో కనీసం 50 మందిఎంపీలూ సంతకాలు పెట్టాల్సివుంటుంది. ఆ తీర్మానాన్ని అనుమతించాలో లేదో స్పీకర్ లేదా రాజ్య సభ చైర్మన్ నిర్ణయిస్తారు. రాజ్యాంగంలోని 124, 218 అధికరణలు దుర్వర్తన లేదా అసమర్థత ఆరోపణల ఆధారంగా న్యాయమూర్తుల తొలగింపునకు అవకాశాన్నిస్తున్నాయి. అయితే ఇన్ని దశా బ్దాల్లో ఈ ప్రక్రియ కింద పదవిని కోల్పోయిన న్యాయమూర్తి ఒక్కరూ లేరంటే ఆశ్చర్యం కలుగుతుంది. అలాగని ఫిర్యాదుల సంఖ్య తక్కువేం లేదు. 2017-2021 మధ్య సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికీ, వివిధ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకూ 1,631 ఫిర్యాదులు వచ్చాయని చెబుతున్నారు. అయితే అంతర్గత విచారణ ప్రక్రియ రహస్యమైనది కావటంవల్ల ఎంతమంది న్యాయమూర్తులపై విచారణ జరిగిందో, ఎందరిపై చర్యలు మొదలయ్యాయో తెలియదు. తొలిసారి 1993లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామస్వామిపై నిధుల దుర్వినియోగం విషయంలో వచ్చిన ఆరోపణల పర్యవసానంగా పార్లమెంటులో అభిశంసన ప్రక్రియ నడిచింది. అప్పట్లో ఆయనపై వచ్చిన 14 ఆరోపణల్లో పదకొండింటికి ఆధారాలున్నాయని తేల్చారు. తీరా పార్లమెంటులో అభిశంసన తీర్మానంపై జరిగిన వోటింగ్‌కు కాంగ్రెస్ గైర్హాజర్ కావటంతో అది వీగిపోయింది. 2009లో అప్పటి సిక్కిం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పీడీ దినకరన్‌పైనా ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న అభియోగం వచ్చింది. అభిశంసన ప్రక్రియ ప్రారంభం కాగానే ఆయన రాజీనామా చేయటంతో అది అర్ధాంతరంగా ముగిసింది. మద్రాస్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె. వీరాస్వామిపై అవినీతి కేసులో సీబీఐ చార్జిషీటు నమోదు చేసింది. కానీ విచారణ ముందుకు సాగకుండా ఆయన అన్నివిధాలా ప్రయత్నించారు. చివరకు 2010లో ఆయన మరణించారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ విశ్వహిందూ పరిషత్ సభలో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. సుప్రీంకోర్టు కొలీజియం బహిరంగ క్షమాపణ చెప్పాలని, వివరణనివ్వాలని కోరింది కూడా. కానీ ఇంతవరకూ అదేం జరగలేదు. అదే హైకోర్టుకు చెందిన జస్టిస్ ఎస్ఎన్ శుక్లా అవినీతిపై అంతర్గత కమిటీకి ఆధారాలు లభ్యమయ్యా యన్నారు. కేసుల విచారణ పని అప్పగించటం మానే శారు. కానీ ఆయన రిటైరయ్యేవరకూ న్యాయ మూర్తిగా జీతభత్యాలు తీసుకుంటూనే వున్నారు. అందుకే అవినీతి ఆరోపణలున్న ప్రభుత్వోద్యో గులూ, రాజకీయ పక్షాల నేతల మాదిరి న్యాయమూ ర్తులపై విచారణ సాగటం లేదన్న విమర్శలుంటున్నాయి. జస్టిస్ వర్మ వ్యవహారశైలి మొదటినుంచీ అనుమానాలకు తావిచ్చేదిగావుంది. మార్చి 14-15 రాత్రి అగ్నిప్రమాదం జరిగినప్పుడు కొన్ని కరెన్సీ కట్టలు తగలబడినా, మిగిలినవి సురక్షతంగా వున్నాయని మొదటగా అక్కడికొచ్చిన అగ్ని మాపక సిబ్బంది, పోలీసులు చెప్పగా... అటుపై బాగున్న కట్టలు మాయమయ్యాయి. దీనిపై జస్టిస్ వర్మ వివరణ సంతృప్తికరంగా లేకపోవటంతో వ్యవహారం అభిశంసన వరకూ వెళ్లింది. ఇప్పటికే కేసుల విచారణనుంచి ఆయన్ను తప్పించారు. నిజానికి జస్టిస్ వర్మ ఉదంతం ప్రభావంతోనే న్యాయవ్యవస్థపై నింద పడకూడదన్న ఉద్దేశంతో జస్టిస్ సంజీవ్ ఖన్నా న్యాయమూర్తుల ఆస్తుల ప్రకటన నిర్ణయం తీసుకున్నారు. మన దేశంలో న్యాయమూర్తులు ఆస్తులు ప్రకటిస్తున్నా ఎవరైనా సమాచార హక్కు చట్టంకింద కోరితే తప్ప వివరాలు బహిరంగపరిచే విధానం లేదు. బ్రిటన్, కెనడాల్లోనూ అంతే. అయితే అమెరికా, దక్షిణ కొరియా, అర్జెంటీనా, రష్యాల్లో చట్టప్రకారం న్యాయమూర్తుల ఆస్తుల వెల్లడి తప్పనిసరి. ఏదేమైనా జస్టిస్ సంజీవ్ ఖన్నా తాజా నిర్ణయం పారదర్శకత దిశగా ఒక కీలకమైన ముందడుగనే చెప్పాలి. అయితే నిందపడిన న్యాయమూర్తులను లోక్‌పాల్ చట్టం కింద విచారించవచ్చునా లేదా అన్నది ఇంకా తేలాల్సేవుంది. మొత్తానికి స్వీయప్రక్షాళనకు న్యాయవ్యవస్థ నడుం బిగించటంప్రశంసనీయమైన పరిణామం.

# పక్కా ఆధారాలతో బయటపడ్డ పాక్ బండారం..! ఉగ్రవాదిని మానవతా వాది అంటూ దొంగనాటకాలు!

పాకిస్తాన్ తన దేశంలో పెరుగుతున్న ఉగ్రవాదాన్ని దాచడానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తోంది. కానీ, ఎంత దాచాలని ప్రయత్నిస్తున్నా.. ప్రపంచానికి దాని నిజ స్వరూపం తెలుస్తూనే ఉంది. పాకిస్థాన్ ప్రభుత్వం, పాకిస్థాన్ సైన్యం అమాయక మతాధికారిగా చిత్రీకరించడానికి ప్రయత్నిస్తున్న ఉగ్రవాది, ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా ప్రధాన నాయకుడు, సహాయక చర్యల ముసుగులో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నాడు. అతని పేరు హాఫీజ్ అబ్దుల్ రవూఫ్. గత కొన్ని రోజులుగా వైరల్ అవుతున్న ఓ ఫొటోలో ఉన్న వ్యక్తి ఉగ్రవాది కాదని, మత నాయకుడు అని పాకిస్తాన్ ఆర్మీ ప్రతినిధి విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ వ్యక్తి కొంతమంది పాకిస్తాన్ సైనికులతో పాటు అంత్యక్రియల ఊరేగింపులో కనిపించాడు. ఆ వ్యక్తి తన ఐడి కార్డు కూడా చూపించి తాను ఒక సాధారణ రాజకీయ కార్యకర్తనని చెప్పాడు. అయితే పాకిస్తాన్ సైన్యం ఇచ్చిన ఆ వ్యక్తి సమాచారం.. అంటే పేరు, పుట్టిన తేదీ, జాతీయ గుర్తింపు సంఖ్య కూడా అమెరికాచే ప్రత్యేకంగా నియమించబడిన గ్లోబల్ టెర్రరిస్ట్‌గా ప్రకటించబడిన వ్యక్తితో పూర్తిగా సరిపోలుతున్నట్లు తేలింది. అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ప్రకారం.. హాఫీజ్ అబ్దుల్ రవూఫ్ లష్కరే తోయిబా, దాని ఫ్రంట్ సంస్థల కోసం విరాళాలు సేకరిస్తున్నాడు. పాకిస్తాన్ ఆర్మీ ప్రతినిధి చూపించిన ఐడి కార్డులో అతను "వెల్ఫేర్ వింగ్ ఇన్‌చార్జ్, పీఎంఎంఎల్" అని ఉంది, అంటే అతను తన కార్యకలాపాలను దాచడానికి ఒక రాజకీయ లేదా మతపరమైన సంస్థ పేరును ఉపయోగిస్తున్నాడు. పాకిస్తాన్ సైన్యం మత ప్రచారకుడిగా అభివర్ణించిన వ్యక్తి నిజానికి ఒక అంతర్జాతీయ ఉగ్రవాది. దీన్ని బట్టి పాకిస్తాన్ ఉద్దేశపూర్వకంగా ఉగ్రవాదులకు రక్షణ కల్పిస్తోందని, ప్రపంచాన్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తోందని స్పష్టమవుతోంది.





### 1999 నుండి లష్కర్ కోసం పనిచేస్తున్నాను..

యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ప్రకారం.. ఉగ్రవాది హాఫీజ్ అబ్దుల్ రవూఫ్ ఫేస్ ఆఫ్ ది లష్కరే తోయిబాగా ఉన్నాడు. లష్కరే తోయిబా అగ్ర నాయకత్వ బృందంలో చేరిన హాఫీజ్ అబ్దుల్ రవూఫ్ 1999 నుండి ఆ సంస్థ కోసం పనిచేస్తున్నాడు. రవూఫ్ లష్కరే ఫ్రంట్ సంస్థ ఫలాహ్-ఎ-ఇన్సానియత్ ఫౌండేషన్ అధిపతి, ఇది సహాయ చర్యల ముసుగులో ఉగ్రవాద కార్యకలాపాల కోసం నిధులు సేకరిస్తుంది. 2008 ముంబై దాడుల తర్వాత లష్కరేపై అంతర్జాతీయంగా ఒత్తిడి పెరిగినప్పుడు, రవూఫ్ FIF పేరుతో పాకిస్తాన్‌లో నిధుల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించాడు. 2009లో ఈ కార్యక్రమం నుండి భారీ మొత్తంలో నిధులు సేకరించినట్లు సమాచారం. లష్కరే తోయిబా, జమాత్-ఉద్-దవా అధిపతి హాఫీజ్ మొహమ్మద్ సయీద్ సూచనల మేరకు రవూఫ్ నేరుగా పనిచేస్తాడు. 2008లో రవూఫ్ లష్కర్ మానవతా సహాయ డైరెక్టర్‌గా నియమితులయ్యాడు. 2003లో పబ్లిక్ సర్వీస్ డైరెక్టర్‌గా ఉన్నాడు. ఆగస్టు 2008లో హాఫీజ్ సయీద్ ఆదేశం మేరకు,పాకిస్తాన్‌లోని బజౌర్ ప్రాంతంలో సహాయ, నిధుల సేకరణ కార్యకలాపాలను సమీక్షించడానికి రవూఫ్ ఒక బృందానికి నాయకత్వం వహించాడు. ఇది మాత్రమే కాదు, రవూఫ్ లష్కర్ ప్రతినిధిగా కూడా ఉన్నాడు. ఆయన సంస్థ తరపున మీడియాలో, వెబ్‌సైట్‌లలో, ప్రజా వేదికలలో మాట్లాడుతున్నాడు. FIF ద్వారా అతను లష్కర్ కు ప్రజల మద్దతు, నిధులను సేకరించడానికి హై-ప్రొఫైల్ మీడియా ఈవెంట్లను నిర్వహిస్తాడు. డిసెంబర్ 2008లో లష్కర్ వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసిన ఇంటర్వ్యూలో రవూఫ్ లష్కర్, జమాత్-ఉద్-దవా సంక్షేమ కార్యకలాపాల గురించి బహిరంగంగా మాట్లాడాడు, దానిని తన సంస్థ అని పేర్కొన్నాడు.

### ఇదారా-ఎ-ఖిద్మత్-ఎ-ఖల్క్‌కు నాయకత్వం వహించాడు

హాఫీజ్ రవూఫ్ లష్కర్ స్వచ్ఛంద విభాగం "ఇదారా-ఎ-ఖిద్మత్-ఎ-ఖల్క్" అంటే IKKకి కూడా నాయకత్వం వహించాడు. 2007లో అతను పెషావర్‌కు వెళ్లి, వరద బాధితుల సహాయ చర్యలను పర్యవేక్షించాడు. మే 2004లో జమాత్-ఉద్-దవా సంక్షేమ అధిపతిగా అతను ఒక వైద్య సంస్థ వార్షిక నివేదికను కూడా సమర్పించాడు. IKK, JUD లను 2006 ఏప్రిల్‌లో ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు సంస్థలుగా అమెరికా గుర్తించింది. హాఫీజ్ సయీద్‌ను మే 2008లో ప్రత్యేకంగా నియమించబడిన గ్లోబల్ టెర్రరిస్ట్ గా ప్రకటించారు. 2008 డిసెంబర్ లో జమాత్-ఉద్-దవాను UN 1267 ఆంక్షల జాబితాలో ఉంచారు. హాఫీజ్ అబ్దుల్ రవూఫ్ పై వచ్చిన ఆరోపణలు, ఉగ్రవాద సంస్థలు సేవ పేరుతో ఎలా భయాన్ని వ్యాప్తి చేస్తాయో మరోసారి నిరూపిస్తున్నాయి.

# ఆపరేషన్ సింధూర్‌లో ఇప్పటి వరకు ఎంత మంది భారత సైనికులు అమరులయ్యారంటే..?



పాకిస్తాన్‌కు ఇంతవరకూ చూపించింది ట్రైలరే.. మళ్లీ తోక జాడిస్తే అసలు సినిమా ముందుముందు చూపిస్తామని త్రివిధ దళాలు స్పష్టం చేశాయి. ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకే ఆపరేషన్ సింధూర్ చేపట్టామని త్రివిధ దళాలు స్పష్టం చేశాయి. భారత సైన్యం. ఉగ్ర స్థావరాలను గుర్తించి అంతం చేయడమే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్‌లో.. 9 ఉగ్ర శిబిరాలు ధ్వంసమవడంతో పాటు వందమంది ఉగ్రవాదులు అంతమయ్యారని ప్రకటించారు. ఆపరేషన్ సింధూర్‌పై ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించిన త్రివిధ దళాల అధికారులు.. ఆపరేషన్‌పై కీలక వివరాలను వెల్లడించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 5 , పాకిస్థాన్‌లో 4 ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేసినట్లు వివరించారు. భారత్ దాడులు చేస్తుందన్న భయంతో పాక్‌లోని ఉగ్రశిబిరాలు ఖాళీ అవుతున్నాయన్నారు. సరిహద్దు అవతల ఉన్న ఉగ్ర శిబిరాలను కచ్చితమైన ఆధారాలతో గుర్తించి దాడులు చేసినట్టు చెప్పింది భారత సైన్యం. అందుకు సంబంధించిన మ్యాప్‌లు, ఫోటోలను విడుదల చేసింది. భారత్ దాడులతో వణికిపోయిన పాకిస్తాన్.. మనదేశంలో పౌరులే లక్ష్యంగా దాడులకు పాల్పడింది. అయితే శత్రుదేశం అందుకు తగిన మూల్యం చెల్లించుకుంది. మే 8, 9వ తేదీల్లో భారత్‌పై గగనతల దాడికి పాకిస్థాన్ విఫలయత్నం చేసింది. డ్రోన్లు, మానవరహిత విమానాలను భారత్‌పై ప్రయోగించింది. వాటన్నింటినీ భారత గగనతల రక్షణ వ్యవస్థ సమర్థంగా తిప్పికొట్టింది. పాక్ డ్రోన్ దాడులకు కౌంటర్‌గా పాక్ రాడార్ స్టేషన్లు, సైనిక స్థావరాలపై బలమైన దాడులు చేసింది భారత్. మూడు రోజులపాటు కొనసాగిన దాడుల్లో 35 నుంచి 40 మంది పాకిస్థాన్ సైనికులు చనిపోయినట్లు అంచనా వేస్తున్నామని సైనిక అధికారులు తెలిపారు. ఇక మే 7 నుండి పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలపై భారత్ ప్రారంభించిన ఆపరేషన్ సింధూర్‌లో భారతదేశానికి చెందిన 5 మంది సైనికులు అమరులయ్యారని భారత సాయుధ దళాలు తెలిపాయి. పాక్ పౌరులను లక్ష్యంగా చేసుకుని భారత్ ఎలాంటి దాడులు చేయలేదు. పాకిస్తాన్ మాత్రం భారత్ నగరాలే లక్ష్యంగా దాడులకు తెగబడింది. అయితే భారత వాయుసేన, క్షిపణి రక్షణ వ్యవస్థలతో పాకిస్తాన్‌కు స్పష్టమైన సందేశం ఇచ్చింది. భారత సైన్యం. దుస్సాహసానికి పాల్పడితే ఎలాంటి పర్యవసానాలు ఎదురవుతాయో ప్రత్యక్ష్యంగా తెలుసుకుంది. పాక్ ప్రతిపాదన మేరకే కాల్పుల విరమణకు అంగీకరించింది భారత్. ఆ దేశం మళ్లీ తోక జాడిస్తే సరైన సమాధానం చెప్పడానికి.. సైన్యం, వాయుసేనకు అనుబంధంగా అరేబియా సముద్రంలో నౌకాదళం సిద్ధంగా ఉంది.

# పిఓకె, ఉగ్రవాదులను భారత్‌కు అప్పగిస్తేనే చర్చలు.. ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదుః ప్రధాని మోదీ



పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలను తగ్గించే ఒప్పందంపై జరిగిన చర్చ సందర్భంగా, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో మాట్లాడారు. పొరుగు దేశంతో చర్చించాల్సిన ఏకైక విషయం పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకె) తిరిగి రావడం మాత్రమే అని ప్రధాని మోదీ తేల్చి చెప్పారు. అలాగే పాకిస్తాన్ ఉగ్రవాదులను ఎలా ఎదుర్కోవాలనే అంశంపైనే మాత్రమే చర్చలు జరుగుతాయని ప్రధాని మోదీ స్పష్టంగా చెప్పారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఫోన్ చేశారు. భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలపై సుదీర్ఘంగా చర్చించారు. కాల్పుల విరమణ దిశగా పాకిస్థాన్‌ను ఒప్పించేందుకు తాము సిద్ధమని జేడీ వాన్స్ మోదీకి వివరించారు. దీనికి మోదీ ప్రతిస్పందనగా.. మరోసారి నిబంధనలు ఉల్లంఘించి పాక్ కాల్పులు జరిపితే.. తాము మౌనంగా ఉండబోమని.. ధీటుగా బదులిస్తామని జేడీ వాన్స్‌కు ప్రధాని మోదీ తేల్చి చెప్పారు. "కాశ్మీర్ విషయంలో మాకు చాలా స్పష్టమైన వైఖరి ఉంది, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ తిరిగి రావడం అనే ఒకే ఒక విషయం మిగిలి ఉంది. ఇంకేమీ మాట్లాడటం లేదు. అలాగే ఉగ్రవాదులను అప్పగించడం గురించి వారు మాట్లాడితే, మనం మాట్లాడుకోవచ్చు. నాకు వేరే ఏ అంశం ఉద్దేశం లేదు" అని ప్రధాని మోదీ, జేడీ వాన్స్‌తో చెప్పినట్లు సమాచారం. ఈ అంశంపై భారతదేశం ఎలాంటి మధ్యవర్తిత్వాన్ని కోరుకోవడం లేదని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

"మేము ఎవరూ మధ్యవర్తిత్వం వహించాలని కోరుకోవడం లేదు. మాకు ఎవరూ మధ్యవర్తిత్వం వహించాల్సిన అవసరం లేదు" అని ఆయన చెప్పినట్లు సమాచారం. రెండు దాయాది దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలను ప్రత్యక్షంగా ప్రస్తావిస్తూ, పాకిస్తాన్ దాడులు జరిగిన అదే రాత్రి, భారతదేశం పాకిస్తాన్ అంతటా 26 స్థావరాలపై దాడులు చేసి ప్రతీకారం తీర్చుకుంది. భారతదేశం తన సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలనే దృఢ సంకల్పాన్ని ప్రదర్శించింది. భారతదేశం, పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య, రెండు దేశాలు ఒకదానికొకటి సైనిక కదలికలను నిశితంగా పరిశీలిస్తున్న నేపథ్యంలో ప్రధాని మోదీ ఈ ప్రకటన చేశారు. అంతర్జాతీయ సమాజానికి, పాకిస్తాన్‌కు ప్రధానమంత్రి మోదీ స్పష్టమైన సందేశం ఇచ్చారు. భారతదేశం సరిహద్దు దాడులను సహించదని, అలాంటి ఏవైనా చర్యలను అధిక శక్తితో ఎదుర్కొంటామని ప్రదాని మోదీ వెల్లడించారు. ఈ పరిణామం, సరిహద్దు ఉగ్రవాదం, రెచ్చగొట్టే చర్యలను ఎదుర్కోవడంలో భారతదేశ విధానం మరింత చురుకైన, నిర్ణయాత్మక వ్యూహానికి మారిందని, దాని జాతీయ భద్రత విషయంలో రాజీకి అవకాశం లేదని సూచిస్తుంది. ఆపరేషన్ సిందూర్ ముగియలేదని ప్రధాని మోదీ మరోసారి స్పష్టం చేశారు. "మనం కొత్త సాధారణ స్థితిలో ఉన్నాం, ప్రపంచం దీనిని అంగీకరించాలి. పాకిస్తాన్ దీనిని అంగీకరించాలి, ఇది యథావిధిగా వ్యాపారం కాదు" అని మోదీ అన్నారు. పాకిస్తాన్ కాల్పులు జరిపితే, భారత్ మిస్సైల్స్‌తో దాడి చేస్తుందని భారత ప్రధానమంత్రి మోదీ గట్టి సందేశం ఇచ్చారు. మళ్లీ పాక్ కాల్పులకు తెగబడితే.. ధీటుగా స్పందించాలని భారత ఆర్మీని ప్రదాని మోదీ ఆదేశించారు. అటు నుంచి గోలీ మన దేశంలోకి వస్తే.. ఇటు నుంచి మిస్సైల్స్‌ను వదలండి అని ఆదేశించారు.

## భారీ లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు..



ముంబయి : సోమవారం ఉదయం భారీ లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ ముగింపు సమయానికి భారీ లాభాల బాటనే ముగిశాయి. సెన్సెక్స్ ఏకంగా 2,950.34 పాయింట్లు లేదా 3.71 శాతం లాభంతో 82,404.81 వద్ద, నిఫ్టీ 912.80 పాయింట్లు లేదా 3.80 శాతం లాభంతో 24,920.80 వద్ద నిలిచాయి. చాల రోజుల తరువాత భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్ నేడు ముగిసింది. ఈ విషయం తెలిసిన విదేశీ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు ఈ రోజు 3,500 కోట్ల రూపాయల నికర కొనుగోళ్లను నమోదు చేశారు. ఇదే సమయంలో డొమెస్టిక్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు కూడా 2,800 కోట్ల రూపాయల విలువైన షేర్లను కొన్నారు. ఇది మార్కెట్‌లో బలమైన డిమాండ్‌ను సూచిస్తుంది. కొన్ని కంపెనీలు తమ త్రైమాసిక ఫలితాలతో మార్కెట్‌ను ఆకర్షించాయి. బజాజ్ ఎలక్ట్రికల్స్ తమ నికర లాభం 59.05 కోట్ల రూపాయలకు చేరడంతో 14.78 శాతం పెరిగింది. ఈ క్రమంలో రాబోయే త్రైమాసిక ఫలితాలు, ఆర్‌బిఐ వడ్డీ రేట్ల నిర్ణయాలు మార్కెట్ దిశను నిర్ణయించే కీలక అంశాలుగా మారనున్నాయి.

## యుద్ధం అంటే రొమాంటిక్.. బాలీవుడ్ సినిమా కాదు

### భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ నరవణె



పుణె : భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల వేళ కాల్పుల విరమణ ఒప్పందంపై కొందరు ప్రశ్నలు లేవనెత్తుతున్న సమయంలో భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ నరవణె కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధమంటే రొమాంటిక్ వ్యవహారం కాదని, అదొక బాలీవుడ్ సినిమా అసలే కాదని స్పష్టం చేశారు. ఘర్షణ వాతావరణానికి స్వస్తి పలికి, దౌత్య మార్గాల ద్వారా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పుణెలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఒక కార్యక్రమంలో భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ నరవణె ప్రసంగిస్తూ. "యుద్ధం లేదా హింస అనేవి మనం ఆశ్రయించాల్సిన చివరి మార్గాలు కావాలి. అవివేకులైన కొందరు మనపై యుద్ధాన్ని రుద్దినా, మనం దానిని ప్రోత్సహించకూడదు" అని స్పష్టం చేశారు. పూర్తిస్థాయి యుద్ధానికి ఎందుకు వెళ్లడం లేదని కొందరు ప్రశ్నిస్తున్నారని చెబుతూ "ఒక సైనికుడిగా, ఆదేశాలు వస్తే నేను యుద్ధానికి వెళతాను. కానీ, అది నా మొదటి ఎంపిక కాదు" అని జనరల్ నరవణె తేల్చి చెప్పారు. దౌత్యానికి, చర్చల ద్వారా విభేదాలను పరిష్కరించుకోవడానికే తాను ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని, సాయుధ పోరాటం వరకు పరిస్థితి రాకుండా చూడాలని కోరుకుంటానని అన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ప్రజలు, ముఖ్యంగా పిల్లలు పడే ఇబ్బందులను ఆయన ప్రస్తావించారు. "షెల్లింగ్ జరిగినప్పుడు, రాత్రిపూట సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీయాల్సి రావడం వంటి భయానక దృశ్యాలు చిన్నారుల మనసులపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ప్రియమైన వారిని కోల్పోయిన వారి బాధ తరతరాలు వెంటాడుతుంది. పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ (పీటీఎస్‌డీ) బారిన పడిన వారు, భయంకరమైన ఘటనలు చూసిన ఇరవై ఏళ్ల తర్వాత కూడా చెమటలతో నిద్రలేచి, మానసిక చికిత్స అవసరమయ్యే పరిస్థితులు ఉంటాయి" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశాల మధ్యే కాకుండా, కుటుంబాలు, రాష్ట్రాలు, ప్రాంతాలు, వర్గాల మధ్య కూడా విభేదాలను హింస ద్వారా కాకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. "జాతీయ భద్రతలో మనమందరం సమాన భాగస్వాములం. హింస దేనికీ సమాధానం కాదు" అని నరవణె ఉద్ఘాటించారు.

## సాఫ్ట్‌వేర్, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో జీసీసీ హబ్‌గా హైదరాబాద్



తెలంగాణ : సాఫ్ట్‌వేర్, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్ జీసీసీ హబ్‌గా మారిందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో సొనాటా సాఫ్ట్‌వేర్ సంస్థను ముఖ్యమంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఏఐ-రెడీ డేటా సెంటర్లు, తయారీ రంగాలకు హైదరాబాద్ కేంద్రంగా మారిందన్నారు. కొత్తగా రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షకు పైగా ఉద్యోగాలు సఅష్టించినట్లు చెప్పారు. మరిన్ని ప్రపంచ స్థాయి కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోందని అన్నారు. రాష్ట్రంలో అభివఅద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన, సంక్షేమం సమతుల్యంగా సాగుతున్నాయని వివరించారు. ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగడంలో అందరి సహకారం కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

## త్రివిధ దళాధిపతులతో ప్రధాని ఉన్నతస్థాయి సమావేశం



న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి మోడి నివాసంలో త్రివిధ దళాధిపతులతో నేడు ప్రధాని ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. భారత్, పాక్‌ల పరస్పర చర్చల తర్వాత కాల్పుల విరమణ ప్రకటించడం, ఆ తర్వాత దానిని ఇస్లామాబాద్ ఉల్లంఘించడం వంటి విషయాలపై సోమవారం భారత్-పాక్ మధ్య కీలక చర్చలు జరగనున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కీలక సమావేశంలో త్రివిధ దళాధిపతులు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పలువురు సైనిక దళాధిపతులు పాల్గొన్నారు. తాత్కాలిక కాల్పుల విరమణకు అంగీకరించిన కొన్ని గంటల్లోనే పాక్ మళ్లీ దాడులకు తెగబడటం, అనంతర పరిణామాలపై త్రివిధ దళాలతో ప్రధాని మోడి ఎప్పటికప్పుడు సమీక్షలు చేపడుతున్నారు. తాజా పరిస్థితులపై మరికొద్దిసేపట్లో విదేశాంగ శాఖ, రక్షణశాఖ ప్రెస్ బ్రీఫింగ్ చేయనుంది.

# మీడియా చేసిన యుద్ధం




కశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22వ తేదీన పర్యాటకులపై పాకిస్తాన్ ప్రేరేపిత టెర్రరిస్టులు దాడిచేసి 26 మందిని పొట్టన పెట్టుకున్న సంఘటనలో పొరుగు దేశానికి మరోసారి గట్టిగా బుద్ధి చెప్పడానికి భారత ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవడానికి రెండు వారాలు పట్టింది. నిజమే, ఇటువంటి ప్రధానమైన నిర్ణయం, దాదాపుగా పొరుగుదేశం మీద యుద్ధం చేస్తున్నంత పెద్ద నిర్ణయం తీసుకోవడానికి కేంద్రానికి అంత సమయం పట్టడంలో ఆశ్చర్యం లేదు. అసలు ఆ విషాదం నుంచి దేశం తేరుకోవడానికే వారం రోజులు పట్టి ఉంటుంది. ఇప్పటికీ ఇంకా ఈ దేశప్రజల కళ్ళల్లో ఆ దృశ్యాలు మెదులుతూనే ఉంటాయి. అయితే కేంద్ర ప్రభుత్వం బాధ్యతగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడానికి సమయం తీసుకున్నదే తప్ప మన భారతదేశ మీడియాకు మాత్రం అంత ఓపిక లేదు. సంఘటన జరిగిన మరునాటి నుండే మన మీడియా.. ముఖ్యంగా 24 గంటల వార్తా ప్రసారాలు చేసే న్యూస్ ఛానళ్లు పాకిస్తాన్ మీద యుద్ధం ప్రకటించేసాయి. 'ఇంకా ఆలస్యం దేనికి? యుద్ధం మొదలు పెట్టండి' అని చెప్పి కేంద్ర ప్రభుత్వాన్ని గదమాయిస్తున్న, సలహాలిస్తున్న ప్రసారాలు అనేకం మనకి ఈ పక్షం రోజుల్లో కనిపించాయి, వినిపించాయి.' ఎటువంటి నియంత్రణలకు అవకాశం లేని మాధ్యమాల పేరిట చలామణి అవుతున్న సామాజిక వేదికల బాధ్యతరాహిత్యం గురించి కుప్పలుతెప్పలుగా ఫిర్యాదులు వచ్చి పెద్దయెత్తున చర్చ జరుగుతున్న సమయంలో, ఎంతో కొంత నియంత్రణకు లోబడి పని చేస్తాయి అనుకుంటున్న, ప్రధాన స్రవంతి మీడియాగా చెప్పుకుంటున్న 24 గంటల వార్తా ప్రసారాలు సాగించే ఛానళ్ళ నిర్వాకం ఈ పక్షం రోజుల్లో చూసినవాళ్ళు, ఆ హింసను అనుభవించిన వాళ్ళు వీటిని నియంత్రించడం ఎలా అనే ఆలోచనలో పడ్డారు. వార్తాపత్రికలు తమ సర్కులేషన్లను, వార్తాప్రసార మాధ్యమాలు తమ టీఆర్పీలను (వీక్షకుల సంఖ్య) పెంచుకోవడానికి సంచలనాలకోసం పాకులాడటం కొత్త విషయం ఏమీ కాకపోయినా ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో వాటి ఈ వ్యవహార శైలి తీవ్ర విమర్శలకు గురవుతున్నది. కొంతలో కొంత ప్రింట్ మీడియా సంయమనం పాటిస్తున్నప్పటికీ, 24 గంటల న్యూస్ ఛానళ్ళు మాత్రం రెచ్చిపోయి తమకు తోచిన విధంగా అసత్యాలు, అర్ధసత్యాలు, అభూతకల్పనలను దేశ ప్రజల చెవులు చిల్లులు పడేట్టు అరిచి చెప్తున్నాయి. 'ఆపరేషన్ సిందూర్' జరుగుతున్న క్రమంలో ఒక మీడియా హౌస్ సంపాదకవర్గ సమావేశంలో అధికారికంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే బ్రీఫింగుకు సంబంధించిన వార్తలు మాత్రమే ప్రచురించాలన్న ప్రతిపాదన చర్చకు వచ్చినప్పుడు.. అలా అయితే పేజీలు నింపడం ఎలా? అన్న సందేహాలు వ్యక్తం అయ్యాయట. 24 గంటలలో ఒకసారి మాత్రమే ఉదయంపూట పాఠకుల చేతికి అందే దినపత్రికల పరిస్థితే ఇలా ఉంటే ప్రసార మాధ్యమాలు 24 గంటలు ఏం చూపించాలి, ఏం మాట్లాడాలి? అందుకే ఒకరు ఇస్లామాబాద్ పని అయిపోయిందంటే, మరొకరు లాహోర్ మట్టి కొట్టుకుపోయిందని, ఇంకొకరు కరాచీ కనిపించకుండాపోయిందని మసాలాలు దట్టించి వార్తలు ప్రసారం చేయడం మనం 'ఆపరేషన్ సిందూర్' మొదలయినప్పటినుండి చూస్తున్నాం. పాకిస్తాన్ పని అయిపోయిందని ఒక ప్రముఖ పాత్రికేయుడు వ్యాఖ్యానిస్తే, ఆ దేశ ప్రధానమంత్రి ఇల్లు వదిలి పారిపోయాడని మరొక వార్త ఛానల్ చెబుతుంది. లేదు, ఆ దేశంలోని ప్రముఖులంతా బహరిన్‌కు తట్టాబుట్టా సర్దుకుని వెళ్ళిపోయారని ఇంకొక ఛానల్ చెప్తుంది. అసలు జరుగుతున్నది ఏమిటి? ఈ దేశ ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత.. అందులోనూ వాస్తవాలు తెలియజేయాల్సిన బాధ్యత తన మీద ఉందన్న విషయం మీడియా మరిచిపోయింది. దానికి కారణం.. అసలు ఏం జరుగుతుందో పూర్తిగా తెలియకపోవడం, తెలుసుకునే ప్రయత్నం చెయ్యకపోవడం. సీనియర్ పాత్రికేయురాలు కల్పనాశర్మ ఒకచోట రాసినట్టు భారతదేశాన్ని తీవ్రమైన టెర్రరిజం అనే మబ్బులు కమ్మేసి ఏం జరుగుతుందో కనిపించని, ఏ శబ్దాలు వినిపించని వేళ మన మీడియా పుంఖానుపుంఖాలుగా కథనాల్ని వండి వార్చేస్తున్నది. నిజానికి ఏం జరుగుతున్నది? పహల్గాం మారణకాండ అనంతరం భారత ప్రభుత్వం పాకిస్తాన్‌లోని తొమ్మిది టెర్రరిస్ట్ కేంద్రాలను టార్గెట్‌గా చేసుకొని చేసిన దాడి, ఆ దాడిలో 100 మంది వరకు మృతి చెందిన విషయం, దానికి జవాబుగా భారత భూభాగంపైకి పాకిస్తాన్ ప్రయోగిస్తున్న డ్రోన్లను మట్టికరిపించే పనిలో భారత సైనిక బలగాలు పనిచేస్తున్నాయి. దీనికి సంబంధించి గత మూడు రోజులుగా సైన్యానికి సంబంధించిన ఉన్నతాధికారులు అధికారికంగా పత్రికా సమావేశాలు నిర్వహించి వివరాలు వెల్లడిస్తూనే ఉన్నారు. అది మాత్రమే రాసి ఊరుకుంటే 24 గంటలు న్యూస్ ఛానల్ నడపడం ఎలా? వీక్షకుణ్ని మరో ఛానల్ వైపు వెళ్లకుండా ఆపడం ఎలా? ఇదీ ఇవాళ మెజారిటీ న్యూస్ ఛానల్ పరిస్థితి దేశంలో. ప్రభుత్వం వెల్లడించిన సమాచారాన్ని మాత్రమే ప్రజలకు తెలిపి ఊరుకుంటే అది మీడియా బాధ్యతా ఎలా అవుతుందని ఆ మాధ్యమాల వాళ్లు ప్రశ్నించవచ్చు. నిజమే.. మామూలు పరిస్థితుల్లో అయితే ప్రభుత్వం అందించే సమాచారంలో ఎంతవరకు నిజం ఉందో తెలుసుకుని అసలు వాస్తవాలను ప్రజలకు తెలియజెయ్యాల్సిన బాధ్యత మీడియాది. ఆ పని మీడియా చేస్తున్నట్టు కనిపించదు. ఇటువంటి యుద్ధ వాతావరణం ఉన్న సమయలో ఆ అవకాశాలు కూడా తక్కువే ఉంటాయి. అందుకని మనం చేస్తున్నదేమిటి.. చర్చల పేరిట గాలి పోగు చేసి వీక్షకుల మీదకు వదులుతున్నాం. ఇందులో కొన్ని మినహాయింపులు లేవని చెప్పలేం, అయితే అవి చాలా స్వల్పం. కేంద్రప్రభుత్వం కూడా ఈ మెజారిటీ న్యూస్ ఛానళ్ళు రోజుల తరబడి ప్రసారం చేసే అసత్యాలు, అర్ధసత్యాలు, అభూతకల్పనల జోలికి వెళ్లడం లేదు. నిపుణుల పేరుతో గంటల తరబడి తెలిసీ తెలియని విషయాలు చర్చించేవాళ్ళని కూడా ఎవరూ తప్పు పట్టడం కానీ, సరి చెయ్యడం కానీ జరగడం లేదు. చరిత్ర తీవ్ర వక్రీకరణలకు గురికావడానికి రేపు ఈ మాధ్యమాలవారు బాధ్యులు కాక తప్పదు. విశ్వసనీయత చెడకుండా వీలైనంతవరకు ఒకటికి రెండుసార్లు సరిచూసుకొని వాస్తవాలను మాత్రమే ప్రజలకు అందించాలనే ఆలోచన కలిగిన, ఆ మార్గాన్నే నడుస్తున్న కొన్ని ఛానళ్లు లేదా కొన్ని డిజిటల్ వేదికలు సహజంగానే వెనుకబడిపోతున్నాయి. ఇలా యుద్ధోన్మాదంతో ఊగిపోతున్న ఛానళ్ళను వదిలేసి విచిత్రంగా 'ది వైర్' వంటి డిజిటల్ ఛానల్‌ను ఆ ఛానల్ యాజమాన్యానికి సమాచారం లేకుండా 2000 సంవత్సరం ఐటీ చట్టం కింద బ్లాక్ చేసినట్టు సర్వీస్ ప్రొవైడర్ ద్వారా తెలియజేయడం, ఏ కారణం చేతనో ఒక రోజు తర్వాత మళ్లీ దాన్ని పునరుద్ధరించడం చూసాం. సమాచారం తెలుసుకునేందుకు భారత రాజ్యాంగం ఈ దేశప్రజలకు ఇచ్చిన హక్కును కాపాడే బాధ్యతను మాత్రమే నిర్వర్తించాల్సిన మీడియా ఆ పని మాత్రం మరిచిపోయి ఆశ్వరభ శరభ అంటూ శివాలెత్తిపోతున్న వేళ వాటిమీద ఏ చర్యా లేకుండా వదిలేసి, సత్యాన్ని ఒకటికి రెండుసార్లు సరిచూసుకొని ప్రసారం చేసే, ప్రచురించే ఇటువంటి మాధ్యమాలకు ఆటంకాలు సృష్టించడం పత్రికాస్వేచ్ఛకు భంగం కలిగించడమే అనడంలో సందేహం లేదు. భారతదేశం మీద పాకిస్తాన్ చేస్తున్నటువంటి దుశ్చర్యలు ఇవాళ కొత్తగా జరుగుతున్నవేమీ కాదు. దానికి దీటుగా సమాధానం చెప్పేందుకు భారతదేశం వైపు నుంచి కూడా చర్యలు జరగడం ఇవాళ కొత్త ఏమీ కాదు. గత తొమ్మిది సంవత్సరాల కాలంలో కనీసం మూడు సందర్భాలలో 'ఆపరేషన్ సిందూర్' వంటి భారీ జవాబులు భారతదేశం ఇచ్చింది. మన మీడియా, పొరుగుదేశ ప్రభుత్వం ఇప్పుడు జరుగుతున్న దానిని యుద్ధం అంటున్నాయి కానీ భారత ప్రభుత్వం దీన్ని యుద్ధం అని అనకపోవడం గమనార్హం. మొత్తానికి తాత్కాలికంగానయినా ఇది రాయడం పూర్తవుతున్న సమయాన ఇరు దేశాలూ కాల్పుల విరమణకు అంగీకారం ప్రకటించాయి. అయితే భవిష్యత్తులో భారతదేశంలో జరిగే ఏ ఉగ్రదాడినయినా యుద్ధంగానే పరిగణిస్తామని భారత్ ప్రకటించింది. మన మీడియా ఇప్పుడేం చేస్తుంది? ఇవాల్టి నుండి ఒక కొత్త యుద్ధాన్ని వెతుక్కోవాలేమో.

# సమాజాభివృద్ధిలో సాంకేతికత కీలకం



పోఖ్రాన్‌లో 1998లో జయప్రదంగా జరిపిన అణు పరీక్షలు నిర్వహించిన మే 11వ తేదీనే ప్రతి సంవత్సరం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి సూచనలతో మన దేశంలో 'జాతీయ సాంకేతికత దినోత్సవం (నేషనల్ టెక్నాలజీ డే) గా జరుపుకుంటారు. ఆదిమానవుడి నుంచి నేటి ఆధునిక మానవుడుగా అభివృద్ధి చెందటానికి ప్రధాన కారణం 'చదువు'. పూర్వకాలంలో ముఖ్యంగా మన దేశంలో చదువు కొందరికి మాత్రమే అందుబాటులో ఉండే పరిస్థితి. ముఖ్యంగా జ్యోతి రావు పూలే, సావిత్రి బాయ్ పూలే, అంబేద్కర్ వంటి ఎందరో సంఘ సంస్కర్తల కృషి ఫలితంగా ముఖ్యంగా భారత రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులు ద్వారా అందరికీ కనీసం పదవ తరగతి వరకూ చదువుకునే అవకాశం లభించింది. అయితే దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాల పూర్తి అవుతున్నా అందరికీ సమానమైన, నాణ్యమైన ఉన్నత, సాంకేతిక విద్య అందరికీ అందుబాటులో లేదు అనే విషయాన్ని మరువకూడదు. ఇక ఏమిటి, ఎందుకు, ఎలా? అనే ప్రశ్నలు ఉద్భవించడం ద్వారానే నేడు ఈ సమాజం ఇంత అందంగా, ఆకర్షణీయంగా, సౌకర్యవంతంగా మారింది అని గ్రహించాలి. ముఖ్యంగా దేశంలో చదువు ద్వారానే సమాజంలో ఉన్న అనేక రుగ్మతలను దూరం చేయడం జరుగుతున్నది. కుల మత వర్గ లింగ వివక్షలు అణచివేతకు చదువు సాధనంగా మారింది. అయినప్పటికీ నేటికీ వివిధ రకాల రాజకీయ, ఆర్థిక, సామాజిక, వివక్షలు కొనసాగుతూనే ఉన్నాయి అనే విషయాన్ని మరువకూడదు. ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామిక విప్లవం సంభవించిన తరువాత అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ప్రజల్లో సామాజిక, రాజకీయ, ఆర్థిక మార్పులు చోటు చేసుకున్నాయి. ఉన్నత చదువులు, పరిశోధనలు ఊపందుకున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం, మెడిసిన్ పరిశోధనలు, అంతరిక్ష పరిశోధన వంటివి రోజురోజుకు కొత్తపుంతలు తొక్కుతున్నాయి. ముఖ్యంగా దేశంలో స్వాతంత్ర్యం అనంతరం వ్యవసాయ, పారిశ్రామిక, అంతరిక్ష, అణుశక్తి, మెడిసిన్ వంటి రంగాల్లో అభివృద్ధి, పరిశోధనలు పుంజుకున్నాయి. హరిత విప్లవంద్వారా ఆహార ఉత్పత్తులు పెరిగాయి. నూతన సాంకేతికతను ఉపయోగించి అనేక నిర్మాణాలు, డ్యాంలు, భవనాలు, ఆనకట్టలు, రైల్వేలైన్లు ముఖ్యంగా ఇటీవల కాలంలో జమ్మూకశ్మీర్ లో పర్వతాలు మధ్య నిర్మించిన అతి ఎత్తైనా రైల్వే వంతెన, అలాగే రామేశ్వరంలో సముద్రంలో నిర్మించిన వంతెన భారతీయ సాంకేతికతలో సాధించిన అద్భుతమైన విజయాలుగా చెప్పుకోవచ్చు. అలాగే ఇటీవల కాలంలో ప్రపంచాన్ని వణికించిన 'కరోనా వైరస్' నియంత్రణకు మన దేశంలో అతి తక్కువ సమయంలో కనుగొన్న 'వ్యాక్సిన్' భారతదేశం మెడిసిన్ రంగంలో సాధించిన మరో అద్భుతమైన విజయంగా చెప్పవచ్చు. ఇక అంతరిక్షంలో 'ఇస్రో' చరిత్ర సృష్టిస్తుంది. చంద్రయాన్, ఆదిత్య వంటి ప్రాజెక్టులు విజయ దుందుభి మోగిస్తున్నాయి. అంతేకాకుండా ఇతర దేశాల రాకెట్లు కూడా మన దేశంలో నుంచే ప్రయోగిస్తూ విదేశీ మారకద్రవ్యం ఆర్జించడం జరుగుతున్నది. అయితే ఇటీవల పాలకులు విద్యా రంగాన్ని ప్రైవేటీకరణ, చరిత్రను తిరగరాసే ప్రయత్నాలు, విద్యా రంగంలో కాషాయీకరణ, మతక్రతువులు, కుంభమేళా వంటి విషయాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో ఆందోళన కలిగిస్తోంది. అలాగే ముఖ్యంగా విశ్వవిద్యాలయాల్లో వైస్ ఛాన్సలర్ నియామకాల్లో మత సంబంధమైన వ్యక్తులను నియమించడం జరుగుతున్నది. నిష్ణాతులైన, నిపుణులైన అధ్యాపకులను 21వ శతాబ్దానికి అవసరమైన విద్య, వైజ్ఞానిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సిలబస్ ప్రవేశపెట్టాలి. పరిశోధనలకు బడ్జెట్ కేటాయింపులు చేయాలి. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. మౌలిక సదుపాయాలు, గ్రంథాలయాలు, లేబరేటరీ వంటి సదుపాయాలు అన్ని పాఠశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో ఏర్పాటు చేయాలి. ఖాళీగాఉన్న పోస్టులను, అధ్యాపకులను వెంటనే నియమించాలి. మూఢ నమ్మకాలు, మూఢ విశ్వాసాలు పెంచే సిలబస్, విధానాలు విడనాడాలి. త్వరలో దేశం నుంచి 'నోబెల్ బహుమతి' అందుకునే విధంగా పరిశోధకులు మారాలి. పరిశోధనలు, పేటెంట్ రైట్స్ సాధించాలి. అనేక శతాబ్దాలుగా, భారతదేశంలో ఉన్న అనేక వివక్షలు కనుమరుగు అవడానికి కారణం చదువు, సాంకేతిక పరిజ్ఞానం. ఈ రోజు మన దేశం నుంచే లక్షల మంది 'సాఫ్ట్ వేర్' ఇంజినర్లు విదేశాల్లో అనేక అద్భుతమైన విజయాలు సాధిస్తున్నారు. సుందర్ పిచాయ్ వంటి ఎందరో అంతర్జాతీయ సంస్థలకు సిఇఒలుగా పని చేయడం జరుగుతున్నది. సునీత విలియమ్స్ వ్యోమగామి దేశమూలాలకు చెందిన వారే అని గ్రహించాలి. ఇటీవల కాలంలో దేశంలో తిరోగమన విధానాలు అమలులోకి వస్తున్నాయి. ఈ విషయాలు ఆందోళన కలిగిస్తోంది. రాజకీయ ప్రమేయం పెరుగుతుంది. యుజిసి, అనేక కేంద్ర విశ్వవిద్యాలయాల్లో రాజకీయ, మతపరమైన అంశాలు పెరుగుతున్నాయి. ఇటువంటి ధోరణులు శ్రేయోస్కరం కాదు. ఆరు అంగుళాల సెల్ ఫోన్‌తో మొత్తం ప్రపంచం అంతా మన చేతుల్లోనే ఉంటుంది. టివి, కంప్యూటర్, లాప్‌టాప్, టాబ్లెట్ వంటి అనేక పనిముట్లు, గాడ్జెట్లు అందుబాటులోకి రావడం మానవ జీవితంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. సౌకర్యవంతమైన జీవితం లభిస్తుంది అంటే కారణం సాంకేతికత. మన దేశంలో దాదాపు జనాభాకు అనుగుణంగా సెల్ ఫోన్లు ఉన్నాయి అంటే అతిశయోక్తికాదు. ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అన్నింటా డిజిటల్ రూపం సంతరించుకొంది. ఫోన్ పే, గూగుల్ పే వంటి ఆర్థిక లావాదేవీలు పుంజుకున్నాయి. ఆన్‌లైన్ లావాదేవీలు, అమేజాన్, ఫ్లిప్ కార్ట్ వంటి సంస్థలు ద్వారా ఇంటి వద్ద నుండే అనేక సౌకర్యాలు లభిస్తున్నాయి అంటే కారణం సాంకేతికత అనే విషయాన్ని మరువకూడదు. వైద్య రంగంలో రోబోటిక్స్ పాత్ర పెరుగుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో ముఖ్యంగా భారత్‌లో అందరికీ సమానమైన, నాణ్యమైన విద్య అందరికీ అందించవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. దేశంలో ఉన్న అన్ని ప్రాంతాల్లో అందరూ, సమానంగా అభివృద్ధి సాధించాలంటే అందరికీ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తేవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

# నక్షత్రాన్నే నమిలేస్తూ.. మింగేస్తూ

### అదృశ్యం చేస్తున్న మహా కృష్ణబిలం
### గెలాక్సీ కేంద్రస్థానంలో కాకుండా దూరంగా ఉన్న సంచార బ్లాక్‌హోల్
### అంతరిక్ష వింత గుట్టు విప్పిన హబుల్ టెలిస్కోప్

నక్షత్రం అంటేనే అంతులేని ఉష్ణంతో, దేదీప్యమానంగా వెలిగిపోతూ వందల కోట్ల కిలోమీటర్ల దాకా కాంతిని వెదజల్లే శక్తియంత్రం. అలాంటి నక్షత్రాన్ని అరటిపండులా అమాంతం మింగేస్తున్న రాకాసి కృష్ణబిలం జాడను అత్యంత అధునాతన హబుల్ టెలిస్కోప్ కనిపెట్టింది. నక్షత్రం మొత్తాన్ని తనలో కలిపేసుకుంటున్న ఈ బ్లాక్‌హోల్ మిగతా కృష్ణబిలాల్లా నక్షత్రమండలం(గెలాక్సీ) కేంద్రస్థానంలో కాకుండా కోట్ల కోట్ల కిలోమీటర్ల దూరంగా ఉండటం మరో విశేషం. గెలాక్సీ మధ్యలో కాకుండా చాలా దూరంగా సైతం భారీ కృష్ణబిలాలు మనగల్గుతాయని, వాటి అపారమైన గురుత్వాకర్షణ బలాలు సమీప స్టార్‌లనూ సమాధి చేస్తాయని తొలిసారిగా వెల్లడైంది. సాధారణంగా నక్షత్రాలను కృష్ణబిలం తనలో కలిపేసుకునే (టైడల్ డిస్ట్రప్షన్ ఈవెంట్-టీడీఈ) దృగ్విషయం గెలాక్సీ మధ్యలో చోటుచేసుకుంటుంది. కానీ ఇలా టీడీఈ అనేది గెలాక్సీ మధ్యలో కాకుండా వేరే చోట సంభవించడాన్ని తొలిసారిగా గుర్తించినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు. దీనికి 'ఏటీ2024టీవీడీ'అని పేరు పెట్టారు. మింగేస్తున్న ఈ కృష్ణబిలం ద్రవ్యరాశి ఆ అంతర్ధానమవుతోన్న నక్షత్రం ద్రవ్యరాశికంటే ఏకంగా 10 కోట్ల రెట్లు ఎక్కువగా ఉండటం విశేషం. నక్షత్రమండలం కేంద్రస్థానం చుట్టూ



తిరిగే ఏదైనా నక్షత్రం అనుకోకుండా కృష్ణబిలం చెంతకు వచ్చినప్పుడు మాత్రమే అక్కడ బ్లాక్‌హోల్ ఉందనే విషయం తెలుస్తుంది. బ్లాక్ తాను మింగేసే ఖగోళ వస్తువును ఉన్నది ఉన్నట్లుగాకాకుండా ఆకారాన్ని నూడుల్స్‌లాగా సాగదీసి సాగదీసి లోపలికి లాగేసుకుంటుంది. ఈ ప్రక్రియనే స్పాగెటిఫికేషన్ అంటారు. తాజాగా నక్షత్రాన్ని మింగేస్తున్న క్రమంలోనే ఈ కృష్ణబిలం ఉనికి వెలుగులోకి వచ్చింది. అమెరికా శాండిగోలోని పాలోమార్ అబ్జర్వేటరీలోని ఆప్టికల్ కెమెరా తొలిసారిగా దీనిని గుర్తించింది. ఈ బ్లాక్‌హోల్ మన భూమికి ఏకంగా 60 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. హబుల్ టెలిస్కోప్ దీనిపై మరింత పరిశోధన చేసింది. సాధారణంగా కృష్ణబిలంలోకి నక్షత్రం లాగబడే క్రమంలో ఆ నక్షత్రం ఊహించనంత స్థాయిలో అతినీలలోహిత కాంతిని బయటకు వెదజల్లుతుంది. తర్వాత బ్లాక్‌హోల్ లోపలికి వెళ్లిపోయి ఆ స్టార్ అంతర్ధానమవుతుంది.

### కేంద్రం నుంచి ఎంతో దూరంలో బ్లాక్‌హోల్

ఈ బ్లాక్‌హోల్ తనకు ఆశ్రయం ఇచ్చిన నక్షత్రమండలానికి సంబంధించిన కేంద్రస్థానంలో ఉండకుండా ఏకంగా 2,600 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. దీంతో కేంద్రస్థానంలోని బ్లాక్‌హోల్స్ కంటే ఇది భిన్నంగా ప్రవర్తిస్తుందేమో అని తెల్సుకునేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా రంగంలోకి దిగింది. ఈ కృష్ణబిలంపై ఓ కన్నేశామని చంద్ర ఎక్స్-రే అబ్జర్వేటరీ, నేషనల్ రేడియో ఆస్ట్రోనమీ అబ్జర్వేటరీలోని వెరీ లార్జ్ అరే రేడియో టెలిస్కోప్ పరిశోధకుల బృందాలు తెలిపాయి. రెండు గెలాక్సీల విలీనం తర్వాత ఇలాంటి కృష్ణబిలాలు ఇలా సుదూరంగా మిగిలిపోయి ఉంటాయని భావిస్తున్నారు. లేదంటే రెండు అయస్కాంతాల తరహాలో రెండు కృష్ణబిలాల వ్యతిరేక బలాల వల్ల ఇది సుదూరంగా నెట్టివేయబడి ఉండొచ్చని ఇంకొందరు అధ్యయనకారులు అంచనావేస్తున్నారు. "కేంద్రస్థానంలో స్థిరంగా ఉండిపోకుండా ఇలా సంచార జీవిలా ఎక్కడో మౌనంగా ఉన్న ఇలాంటి కృష్ణబిలాలు కొత్త తరహా పరిశోధనలకు సాయపడతాయి"అని బెర్క్లీలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో సంబంధిత పరిశోధనలో ప్రధాన రచయిత, ఖగోళశాస్త్రంలో పోస్ట్ డాక్టోరల్ యుహాన్ యాఓ చెప్పారు. త్వరలో అందుబాటులోకి రానున్న వెరీ సి.రూబిన్ అబ్జర్వేటరీ సాయంతో ఇలాంటి ఖగోళ వింతలను మరింత పరిశోధన జరగనుంది.

PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
www.prabhathasuryudu.com

## 90 రోజుల పాటు కొత్త సుంకాలు: అమెరికా, చైనా మధ్య డీల్



**న్యూఢిల్లీ,:** నువ్వా నేనా అంటూ ప్రతీకార సుంకాలను అంతకంతకూ పెంచుకుంటూ పోయిన అమెరికా, చైనా దేశాలు టారిఫ్‌ల విషయంలో ఓ డీల్ కుదుర్చుకున్నాయి. తాజా ఒప్పందం ప్రకారం.. అమెరికా దిగుమతులపైన చైనా విధించిన 125 శాతం సుంకాలలో 10 శాతం తగ్గించింది. అదే సమయంలో అమెరికా కూడా చైనా దిగుమతుల మీద విధించిన 145 శాతం సుంకాలలో 30 శాతం తగ్గించించింది. ఇరు దేశాలు (చైనా, అమెరికా) కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం.. ఈ సుంకాల తగ్గింపు 90 రోజులు మాత్రమే అమలులో ఉంటాయని తెలుస్తోంది. కొత్త సుంకాలు మే 14 నుంచి అమలులోకి రానున్నాయి. ఆ తరువాత తగ్గింపు సుంకాలే కొనసాగుతాయా?, ముందుకు విధించిన సుంకాలు కొనసాగుతాయా?, అనే విషయం తెలియాల్సి ఉంది. అమెరికా ప్రపంచ దేశాల మీద ప్రతీకార సుంకాలను విధించిన సమయంలో.. చైనా కూడా అమెరికాకు ధీటుగా సుంకాలను పెంచింది. దీంతో వాణిజ్య యుద్ధం మొదలైంది. ఈ ప్రభావం స్టాక్ మార్కెట్ల మీద విపరీతమైన ప్రభావం చూపింది. దిగ్గజ పారిశ్రామిక వేత్తలు కూడా భారీ నష్టాలను చవి చూడాల్సి వచ్చింది. అయితే తాజాగా.. ఇరుదేశాల మధ్య స్విట్జర్లాండ్ వేదికగా జరిగిన వాణిజ్య చర్చల్లో భాగంగా ఈ సుంకాలను తగ్గించుకోవడానికి నిర్ణయం తీసుకున్నారు.


## ఆ పదవి దక్కలేదన్న అక్కసుతోనే మాట్లాడుతున్నారు..

### ఈటలపై టీపీసీసీ చీఫ్ ఫైర్



**హైదరాబాద్, :** బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఏ కులమో చెప్పాలి..అని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిపై ఇష్టానుసారం మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కలేదన్న అక్కసుతో ఈటల మాట్లాడుతున్నారు. సీఎంపై మాట్లాడిన తీరు సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉంది. బీఆర్ఎస్ హయంలో ఆర్థిక మంత్రిగా ఈటల ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసింది...అని మహేష్ గౌడ్ ఆరోపించారు. హైడ్రా గురించి మాట్లాడే ఈటల దేవాదాయశాఖ భూములను కబ్జా చేశారని కేసు ఉన్న విషయం మర్చిపోయారా?. బీసీ బిడ్డవై కేసీఆర్‌కి అడుగులకు మడుగులు వత్తిన విషయం మరిచావా?. కేసీఆర్ హయంలో చేతకాని, దద్దమ్మ మంత్రులుగా ఉన్న మీరు సీఎం రేవంత్ గురుంచి మాట్లాడే నైతిక అర్హత లేదు. 60 వేల ఉద్యోగాలు ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీ పడిపోతుందా?. ధనిక రాష్ట్రమైన తెలంగాణ దివాలా తీయడానికి.. కారణమైన కేసీఆర్ అలీబాబా చోరీస్‌లో ఈటల ఒకరు.. అని మహేష్ కుమార్ గౌడ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీజేపీ నేతలు ఈటల, బండి సంజయ్ ఏమి మాట్లాడుతున్నారో వారికే అర్థం కావడం లేదు. తెలంగాణ అభివృద్ధికి బీజేపీ నేతలు అడుగడుగునా అడ్డు పడుతున్నారు. బీసీ బిడ్డగా ఈటల, బండి సంజయ్‌ను ఎవరు అంగీకరించని పరిస్థితిలో లేరు. బీసీ బిల్లు విషయంలో బీజేపీ నేతల వైఖరిని బీసీ సమాజం క్షమించే పరిస్థితి లేదు. తప్పులు ఎత్తి చూపండి.. సద్వి విమర్శ చేయండి.. అంతేగాని స్వార్థంతో నోటికొచ్చింది మాట్లాడితే సహించే ప్రసక్తే లేదు..అని టీపీసీసీ చీఫ్ వార్నింగ్ ఇచ్చారు.

## పాకిస్థాన్‌లో మరోసారి భారీ భూకంపం



పాకిస్థాన్-పాకిస్థాన్‌లో మరోసారి భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.6 తీవ్రత నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూకంప తీవ్రత స్వల్పంగా ఉన్నప్పటికి పలు ప్రాంతాల్లో భారీగా ప్రకంపనలు వచ్చినట్లు సమాచారం. భూకంప కేంద్రం తజికిస్తాన్‌లోని అష్కాషెమ్‌కు పశ్చిమాన ఆఫ్ఘనిస్తాన్ నుండి 34 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు ఎన్‌సీఎస్ తెలిపింది. కాగా, అంతకుముందు.. ఈ నెల 10న భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ.. 4.0 తీవ్రతతో భూకంపం వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ఆందోళనకు గురైన పాకిస్థాన్ ప్రజలు భయంతో వీధుల్లోకి పరుగులు తీశారు. తాజాగా, మరో భూకంపం రావడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఎన్‌సీఎస్ నివేదిక ప్రకారం.. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.0గా నమోదైంది. భూకంప కేంద్రం 10 కిలోమీటర్ల లోతులో ఉందని.. 29.67 డిగ్రీల ఉత్తర అక్షాంశం... 66.10 డిగ్రీల తూర్పు రేఖాంశం వద్ద నమోదైంది.

## దేశద్రోహులకు, కాంగ్రెస్‌కు ఉన్న సంబంధం బయటపడింది..




సంగారెడ్డి జిల్లాలోని జిన్నారంలో మత ఘర్షణలో అరెస్ట్ అయిన బీజేపీ కార్యకర్తను సంగారెడ్డి సెంట్రల్ జైలులో మెదక్ ఎంపీ రఘునందన్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిన్నారంలో ఏం జరుగుతుందో విచారణ జరిపించాలని ఉన్నతాధికారులను నాలుగుసార్లు ఎంపీగా అడిగినా సరైన సమాధానం లేదు అని పేర్కొన్నారు. దేశద్రోహులను వెంటనే పంపించాలని కేంద్ర హెూంశాఖ ఆదేశాలు ఇచ్చినా.. ఇప్పటికి అధికార యంత్రాంగం స్పందించడం లేదు అని ఆరోపించారు. దేశద్రోహులకు, కాంగ్రెస్‌కు ఉన్న సంబంధం బయటపడింది అని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. అయితే, జిన్నారం, పటాన్ చెరుల్లో ఉన్న మదర్సాలలో చదువు చెప్పేందుకు ఎక్కడి నుంచి తీసుకు వచ్చారు అని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి వివరణ ఇవ్వకపోతే హిందూ బంధువులు విడుదలైన తర్వాత పోలీస్ స్టేషన్ ముందు ధర్నాకు దిగుతాం అని హెచ్చరించారు. జిన్నారం మదర్సాపై జిల్లా ఎస్పీ సరైన సమాధానం ఇవ్వకపోతే డీవోపీటీకి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. మీరు దేశ ద్రోహులకు మద్దత్తు ఇస్తున్నారా అని రఘునందన్ రావు తెలిపారు.

# ఆందోళనలో మానవాభివృద్ధి



ప్రపంచ మానవాభివృద్ధి ప్రగతి గడచిన మూడున్నర దశాబ్దాల్లో అత్యంత తక్కువ నమోదు కావడం పట్ల ఐక్యరాజ్య సమితి చీఫ్ అంటానియో గుటెరస్ వ్యక్తపర్చిన ఆందోళన మానవాళికి హెచ్చరిక. కరోనా మహమ్మారితో పూర్తిగా రెండు సంవత్సరాలు ఆర్థిక వ్యవస్థ స్తంభించిన అనంతరం మానవాభివృద్ధిలో సుస్థిరత నెలకొని మరింత మెరుగుదల దిశగా పయనించాల్సింది పోయి అధమ స్థాయికి దిగజారడం ఆత్మవిమర్శనాపూర్వకంగా ఆలోచించాల్సిన విషయం. 2024 సంవత్సరానికి ఐరాస అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి) ప్రపంచ మానవాభివృద్ధి నివేదికను మంగళవారం వెలువరించింది. కృత్రిమ మేధ యుగంలో ప్రజలు, అవకాశాలపై నివేదిక విశ్లేషించింది. మానవాభివృద్ధి ప్రగతి నిర్ణయించుకున్న లక్ష్యాలకనుగుణంగా లేదు. మానవాభివృద్ధి తక్కువ ఉన్న దేశాలు, ఎక్కువ ఉన్న దేశాల మధ్య అసమానతలు తీవ్ర స్థాయిలో ఉన్నాయని నివేదిక కుండబద్దలు కొట్టింది. ఈ అసమానతలు వరుసగా నాల్గవ తడవ కూడా మరింతగా విస్తరించడం ఆందోళన కలిగించే విషయం. ఆర్థిక, పర్యావరణ షాక్‌లు మానవాభివృద్ధికి తప్పవని, వాణిజ్య ఉగ్రవాదం పర్యవసానాలూ వెంటాడుతున్నాయని, రుణ సంక్షోభం, నిరుద్యోగిత పెరుగుతాయని క్లిష్టతర భవిష్యత్‌ను ఆవిష్కరించింది. కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఎఐ)కు హ్యూమన్ ఫేస్ ఉండాలన్న హితబోధ జాగరూకతను సూచిస్తుంది. విద్య, ఆరోగ్య రంగాలను ఆధునీకరించాలన్న సిఫారసు తక్షణం కార్యాచరణలో పెట్టాల్సి ఉంది. మానవాభివృద్ధి సూచిలో భారతదేశం ర్యాంక్ గతం కంటే స్వల్పంగా మెరుగుపడినా ఆర్థిక అసమానతలు, లింగ వివక్ష సవాళ్లను సృష్టిస్తూనే ఉన్నాయని యుఎన్‌డిపి నివేదికతో తెలుస్తుంది. 193 దేశాల్లో మన దేశం స్థానం 130. అదే 2022లో మన ర్యాంక్ 133. సుదీర్ఘ, ఆరోగ్యకర జీవితం, జ్ఞానాన్ని సంపాదించడం, మంచి జీవన ప్రమాణం.. ఈ మూడు ప్రధాన అంశాల్లో మన దేశం బలంగా ఉందని నివేదికలో పేర్కొన్నారు. ఉపాధి హామీ, విద్యాహక్కు చట్టం, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ వంటి కార్యక్రమాలు మానవాభివృద్ధి ప్రగతికి కొంత వరకు పని చేశాయని చెప్పవచ్చు. కాగా సమాజంలో ఆర్థిక అసమానతలు, లింగ వివక్ష ఆందోళన కలిగిస్తున్నాయి. దేశంలో శత కోటీశ్వరుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోందని ఫోర్బ్స్ సహా పలు అంతర్జాతీయ సంస్థలు ఎప్పటికప్పుడు వెల్లడిస్తూనే ఉన్నాయి. వాటికి అభిముఖంగా దిగజారుతున్న పేదరికం వృద్ధి, ప్రజల కొనుగోలు శక్తి తరుగుదల, పారిశ్రామిక మందగమనం, ఉపాధి అవకాశాల తగ్గుదల, పోషకాహార లోపం, పాఠశాలల్లో డ్రాపవుట్స్, బాలకార్మిక సమస్యలు పీడిస్తున్నాయి. ప్రపంచ ఆకలి సూచిలో ఇండియా స్థానం చిట్టచివరిలో ఊగిసలాట అసమానతల తీవ్రతకు ప్రతిరూపం. 2023-24లో మహిళా కార్మిక శక్తి భాగస్వామ్యం 41.71 శాతానికి పెరిగిందని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సర్వేలో ఉటంకించబడింది. మహిళాశక్తి సద్వినియోగం కావాలంటే మహిళలు ఉద్యోగాల్లో చేరే వాతావరణం నెలకొల్పబడాలి. వారు తమ ఉద్యోగాలను నిలుపుకునే అవకాశాలు సృష్టించబడాలి. ప్రస్తుతం ఆ పరిస్థితులు తక్కువేనన్నది నిపుణుల మాట. రాజకీయ భాగస్వామ్యంలో మహిళల వెనుకబాటు కొనసాగుతోంది. చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఎప్పటికి సాకారమవుతాయో తెలియకుండా ఉంది. ఈ పరిస్థితుల్లో మార్పు రాకుండా మానవాభివృద్ధి పెరగదన్నది కఠోర నిజం. ఆదాయ, లింగ అసమానతలు భారతదేశ మానవాభివృద్ధి ప్రగతిని 30.7 శాతం తగ్గించాయి. ఎ.ఐ., అభివృద్ధి పరిమితులపై మానవాభివృద్ధి ఆధారపడి ఉంది. ఎ.ఐ. విషయంలో 2019లో సున్నా స్థానంలో ఉన్న ఇండియా పరిశోధకులను నిలుపుకుంది. అభివృద్ధి వైపు అడుగులేస్తోంది. వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, ప్రజా సేవల డెలివరీలో ఎ.ఐ.ని ఉపయోగించాలి. కానీ ఎ.ఐ. ఇప్పటికే నెలకొని ఉన్న అసమానతలను తీవ్రతరం చేసే ప్రమాదాన్ని నివారించే సరైన విధానం, రక్షణ చర్యలు అత్యవసరం. యుఎన్‌డిపి నివేదిక సారాంశం ఇదే!

# "నిజమైన అందం శాశ్వతమైన ఆనందాన్ని కలిగిస్తుంది"






"దునియా దేశాల మహిళామణుల్ని, అందాల బందీఖానాలేసి, ఆడదేహాలతో ఆడే జూదాలు. అందాలంటే ఆడోళ్లకే పేటెంట్స్ అంటగట్టి, గంటకొట్టింది పేట్రియార్కీ పెత్తనమే. యాపార సోపాన సామ్రాజ్యాలకు కార్పొరేట్ కాస్మటిక్స్‌ల కరిగిచ్చి, కొలతల కొలిమిల్లో కోతలు పడే ఫాన్సీ ప్లాస్టిక్ అందసందాల విందులకు మహిళా మాంసం కొట్టులు పెట్టి సరుకు సౌదలు అమ్ముకునే సంతలు" ఈ అందాల పోటీలు అని ఈ పోటీల అంతఃసారాన్ని కవిత్వీకరిస్తారు ప్రముఖ కవయిత్రి జూపాక సుభద్ర. అసలు అందమంటే ఏమిటో, వాటికి పోటీలు నిర్వహించడంలోని అసలు ఉద్దేశ్యాలు ఎప్పుడూ చర్చనీయాంశమవుతూనే ఉన్నాయి. వివాదాలు, వ్యతిరేకతలు ఎన్ని ఉన్నా ప్రపంచ సుందరి పోటీలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడు మన రాష్ట్రంలోనే హైద్రాబాదు నగరం అందుకు వేదికయింది. ఈ పోటీ కార్యక్రమాన్ని ఇక్కడి విద్యార్థినులు తిలకించి స్ఫూర్తి పొందాలని ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది కూడా. సాధికారత, ఆత్మవిశ్వాసం, యువతలో కలుగచేస్తుందని నిర్వాహకులు భావిస్తున్నట్లు ప్రకటించారు. నిజంగా అమ్మాయిలకు ప్రేరణ స్ఫూర్తి కలిగిస్తాయా ఇవి? 'అందమె ఆనందం, ఆనందమె జీవిత మకరందం' అంటాడు ఓ సినీ గీత రచయిత. ఆనందాన్ని కలిగించేదే అందమని కవి హృదయం, ఎవరికి దేనివల్ల ఆనందం కలుగుతుందో ఎలా చెబుతాము! 'అందమనేది చూసేవాళ్ల చూపులో ఉంటుందన్నది ఓ ఆంగ్ల సామెత. ఒకరికి అందంగా కనిపించింది మరొకరికి కనిపించకపోవచ్చు. అందం కొలతల ప్రమాణాల్లో, రంగుల్లో, ధరించే దుస్తుల్లో ఉండదు. "నిజమైన అందం శాశ్వతమైన ఆనందాన్ని కలిగిస్తుంది" అంటాడు జాన్ కీట్స్. 'లోకో భిన్న రుచి' అన్నట్లు వివిధ సాంస్కృతిక జీవన పరిణామాల్లో రూపుదిద్దుకునే ఒక మానసిక భావనే అందం. అది భిన్న ప్రాంతాలలో భిన్న రీతులుగా ఉంటుంది. మరిప్పుడు ప్రపంచమంతటికీ అందమయినదీ అని ఎంపిక చేయడంలో సమంజసత్వం ఏమున్నది? అసలు అందమంటే రూపానికి సంబంధించినదే కాదు. భారతీయ తాత్త్విక ఆలోచనతో చూసినా 'సత్యం శివం సుందరం' అంటాడు. సత్యమే శివం, శివమే సుందరం. భౌతికమైన అందం శాశ్వతమైనది కాదంటారు. అసలు వస్తువుకీ, మనిషికి సంబంధించినది కాదు. మనస్సుకి సంబంధించినది. అందుకే 'ఆత్మ సౌందర్యం' అనే మాట వింటాం. అదే మనిషి మూలతత్త్వానికి సంబంధించినది. ప్రేమపూరిత మనసు, దయ, కరుణ, సుహృద్భావం వంటి వాటితో మనసు నిండి ఉంటే, ఆ రకమైన సానుకూల భావతరంగాలు మనిషిని కాంతివంతం చేస్తాయి. అప్పుడు అందంగా కనిపిస్తారు. అంతేకాదు, మనం చేసే పనితో, ప్రవర్తనతో, సామర్థ్యాలతో, సాధికారతను, ఆత్మవిశ్వాసాన్ని పొందుతాము తప్ప కేవలం రూపంతోకాదు. వాస్తవంగా పంటను సృష్టించే చేతులది అందం. కాలువలు పారించే కష్టానిది అందం. భవనాల్ని, మందిరాల్ని నిర్మించే శ్రమఫలాలు అందం. అందుకే "శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదోరు" అన్నాడు శ్రీశ్రీ. ఎన్నెన్నో చేతులు నిత్యం శ్రమిస్తూ స్వేదాన్ని ధారపోయటం ద్వారానే మనం అందమైన దుస్తుల్ని, అలంకరణల్ని చేసుకోగలుగుతున్నాము. "కారులో షికారు కెళ్లే పాలబుగ్గల పసిడిచాన, నీ బుగ్గ మీద గులాబిరంగు ఎలా వచ్చెనో చెప్పగలవా! నిన్ను మించిన కన్నెలెందరొ మండుటెండలో మాడిపోగ, వారి బుగ్గల నిగ్గు నీకు వచ్చి చేరెను తెలుసుకో"అని వివరించాడు ఆత్రేయ. మంచి మనసు, బాధ్యతగల ప్రవర్తన, సామాజిక అవగాహన, వాస్తవిక మానవీయ సంబంధాలను కలిగి ఉండటంలోనే నిజమైన అందం ప్రస్ఫుటమవుతుంది. కానీ నేటి అందాన్ని ప్రామాణికరించేది మీడియా, మార్కెటింగ్, వ్యాపారాలు, ప్రభుత్వాలు, ఇతర సంస్థలు. ఈ శక్తులే యువతను ప్రభావితం చేస్తున్నాయి. ప్రదర్శన, సౌందర్య సాధనాలు, దుస్తులు, ప్రవర్తన మొదలైన అంశాల ఆధారంగా తీర్చిదిద్దుతున్నారు. అందాల పోటీలు కేవలం అందాన్ని ప్రదర్శించటానికే కాదు, సమాజంపట్ల బాధ్యత, సమస్యల్లో ఉన్నవారికి చేయూత, సంతోషాలతో కూడిన అందమైన ప్రపంచాన్ని సృష్టించడానికని నిర్వాహకులు చెబుతున్నారు. కానీ గత సుందరీమణుల ప్రచారమంతా సౌదర్య సాధనాల ప్రచారానికి, సినిమాలకి, సరుకుల మార్కెటింగ్ పెరుగుదలకు ప్రచారానికే వినియోగపడింది. ఇది ప్రపంచవ్యాపిత ఏకరూప వ్యాపార ఏర్పాటుకు చేసే తంతు మాత్రమే. ఈ దేశంలోని 35శాతం మంది అమ్మాయిలకు పోషక విలువలుగల ఆహారం అందటంలేదు. మొత్తం విద్యా శాతంలో బాలికల విద్యా శాతం తక్కువగానే ఉంది. వివక్షతకు, ఇంట్లో చాకిరికి, హింసకు గురవుతున్న మహిళల సంఖ్య తగ్గడమేలేదు. వీటి గురించిన చర్చ ఏమీ మనముందులేదు. వారి సాధికారతకు తీసుకునే చర్యలూ కానరావు. కానీ అందాల పోటీల పేరుతో వ్యాపార సరుకుల మోహాన్ని పెంచడమే కాదు, స్త్రీల వ్యక్తిత్వాన్ని అందానికి, ప్రదర్శనకు పరిమితం చేస్తున్నారు. అందమైన సరుకుగా మారుస్తున్నారు. తెలంగాణ సంస్కృతికి ఇది పూర్తి వ్యతిరేకమైనది. కొంగు నడుముకు చుట్టి కొడవళ్లు చేతబట్టిన చైతన్య సంస్కృతి ఇక్కడి మహిళలది.

# ఆపదవేళ.. అన్నీ అందేలా..




పాకిస్థాన్ పెంచి పోషిస్తున్న ఉగ్రమూకల స్థావరాలను నేలమట్టం చేయాలని ఆపరేషన్ సిందూర్‌ను భారత్ అప్రతిహతంగా చేపట్టగా, పాకిస్థాన్ మాత్రం సుదీర్ఘ పోరును కోరుకున్నట్టయితే దానిని ఎదుర్కోడానికి భారత్ సర్వదా సిద్ధంగానే ఉంది. ఆర్థికంగా, లాజిస్టిక్‌గా సౌకర్యవంతంగానే ఉంది. అతి ముఖ్యమైన చమురు, గ్యాస్ దిగుమతులు 30 నెలలపాటు కొనసాగించడానికి అలాగే ఇతర ముఖ్యమైన దిగుమతులు ఏడాదిపాటు కొనసాగించడానికి కావలసి విదేశీ మారక నిల్వలు భారత్ వద్ద ఉన్నాయి.ఇక ఆహార భద్రతకు సంబంధించి గోధుమలు, వరి నిల్వలు ప్రభుత్వ సౌకర్యవంతమైన స్థాయికి మించి ఉన్నాయి. దేశంలో పటిష్టమైన, వైవిధ్యమైన ఉత్పాదక రంగం నెలకొని ఉంది. అభివృద్ధి రేటు పైస్థాయిలో ఉండగా, ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంది. కానీ ఇది సంతృప్తి చెందాల్సిన సమయం కాదు. సంఘర్షణలో ఎదురయ్యే అన్ని పరిస్థితులకు బడ్జెట్ వేసుకోక తప్పదు. అంటే కీలకమైన మౌలిక సౌకర్యాలపై ఓ కన్నేసి ఉంచాలి. అందువల్ల ఆకస్మిక ప్రణాళికలను ఎప్పటికప్పుడు రూపొందించుకోవడం ముఖ్యం. ఈ నేపథ్యంలో నిత్యావసరాల సరఫరా వ్యవస్థకు ఎలాంటి విఘాతం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోడీ జాతీయ స్థాయిలో ఎంతవరకు మనం సన్నద్ధంగా ఉన్నామో వివిధ మంత్రిత్వ శాఖల సెక్రటరీలతో గురువారం సమీక్షించారు. భారీ సంఘర్షణలో ఎలాంటి అవాంతరాలు లేకుండా నిత్యావసరాలు, ఇతర ముఖ్యమైన సేవలు ప్రజలకు అందేలా గట్టిగా నమ్మకం కల్పించేలా పనిచేయాలన్నారు. సరఫరా వ్యవస్థ ప్రధానంగా ప్రైవేట్ రంగంపైనే ఆధారపడినప్పటికీ, కలుపుకుని పోవడం కీలకం. జాతీయ ప్రయోజనాల విషయంలో భారతీయులు వెనుకంజవేయరన్న విశ్వాసం ఉన్నప్పటికీ, వీటన్నిటినీ ఒక మార్గంలో ముందుకు తీసుకెళ్లడం ఒక సవాలు. ఈ పరిస్థితుల్లో భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతుండడంతో దేశం గోధుమ, చక్కెర, వంటనూనెలు నిల్వలు కావలసినంత సమకూర్చుకుంది. ఇవి అత్యవసర సమయంలో అవసరాలకు సరిపోతాయి. ముడి చమురు నిల్వలు కూడా తగినంత స్థాయిలో ఉన్నాయి. దేశంలో ప్రస్తుతం 70 రోజులకు సరిపడే ముడి చమురు, 74 రోజులకు సరిపడే పెట్రోలియం నిల్వలు ఉన్నాయి. దేశం మొత్తం మీద వినియోగానికి 60 నుంచి 64 రోజులకు సరిపడే ఇంధనం నిల్వలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు కలిగి ఉన్నాయి. మరో తొమ్మిది రోజులకు అదనంగా కావలసిన ఇంధనాన్ని ఇండియన్ స్ట్రాటెజిక్ పెట్రోలియం రిజర్వు నిల్వ చేసింది. ఇంధనం ధరలు తగ్గుముఖంలో ఉండడంతో కొనుగోళ్లు వేగవంతం చేయడానికి ఒఎంసి ప్రయత్నిస్తోంది. ధరలు నిలకడగా లేనప్పుడు ఈ విధంగా కొనుగోళ్లు చేయడం పరిపాటిగా వస్తోంది. ప్రస్తుతం చాలినంత ముడి చమురు నిల్వలు ఉన్నాయని సహజవాయు మంత్రిత్వశాఖకు చెందిన అధికార వర్గాలు పేర్కొన్నాయి. ముడిచమురును సరఫరా చేసే దేశాలు అందుబాటులో ఉండడంతో ముడి చమురు నిల్వలు లోటు లేకుండా ఉండడం గమనార్హం. 2025 కు ముందు 27 దేశాలనుంచి చమురు నిల్వలను దిగుమతి చేసుకోగా, 2025 మొదట్లో 40 దేశాల నుంచి ముడిచమురు నిల్వలను దిగుమతి చేసుకుంది. ఈ ఏడాది జనవరిలో 1.48 శాతం వరకు దిగుమతులు తగ్గినప్పటికీ, ఫిబ్రవరి, మార్చి వచ్చే సరికి 6.6 శాతం నుంచి 9.04 శాతం వరకు దిగుమతులు పెరిగాయి. ప్రత్యేక ప్రయోజనం కల్పించే వెహికల్ ఐఎస్ఆర్‌పిఎల్, మంత్రిత్వశాఖ కింది ఆయిల్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ బోర్డు దేశం మొత్తం మీద మూడు ప్రాంతాల్లో ముడిచమురు నిల్వలు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, కర్ణాటకలోని మంగలూరు, పాడూరు (ఉడిపి సమీపాన) ప్రాంతాల్లో ఈ నిల్వలు ఉంటున్నాయి. అంతర్జాతీయ ఎనర్జీ ఏజెన్సీ ప్రమాణాల ప్రకారం సభ్యదేశాలు 90 రోజుల పాటు చేసుకున్న దిగుమతులకు సమానంగా ముడిచమురు నిల్వలను ఉంచుకోవచ్చు. ఇక ఆహార ధాన్యాల విషయాన్ని పరిశీలిస్తే ఆహార మంత్రిత్వశాఖ డేటా ప్రకారం ఏప్రిల్ 27 నాటికి దేశంలో మొత్తం 66.17 మిలియన్ టన్నుల గోధుమ, వరి ధాన్యాల నిల్వలు గిడ్డంగుల్లో ఉన్నాయి. 202324 లో 52 మిలియన్ టన్నులకు పైగా ఆహార ధాన్యాలను ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేశారు. సూక్ష్మంగా చెప్పాలంటే గోధుమ, వరి నిల్వలు ఏడాది కాలానికి సరిపడే ఉన్నాయి.

ఈ ఏడాది మే 1 నాటికి చక్కెర ఉత్పత్తి గత ఏడాది కన్నా 18 శాతం తగ్గినప్పటికీ, రానున్న సీజన్‌లో అక్టోబర్ నాటికి చక్కెర ఉత్పత్తి నిల్వలు భారీగా అందుబాటులోకి వస్తాయని అంచనా వేస్తున్నారు. దేశం కొత్త చక్కెర సీజన్‌ను 202526 (అక్టోబర్ నుంచి సెప్టెంబర్ వరకు) దాదాపు 5.4 మిలియన్ టన్నుల చక్కెర నిల్వతో ప్రారంభించడానికి సిద్ధంగా ఉంది. అంటే రెండు నెలల వినియోగం కన్నా ఎక్కువ. ఇక పప్పు ధాన్యాల నిల్వలను పరిశీలిస్తే ఈ ఏడాది ఏప్రిల్ 1 నాటికి 1.8 మిలియన్ టన్నుల నిల్వలు ఉన్నాయి. సాధారణంగా 3.5 మిలియన్ టన్నుల వరకు నిల్వలు ఉంటాయి.అయితే పెసలు, బఠాణీలు అందుబాటులో ఉన్నాయి. కొత్త శనగ పంట ఇప్పటికే మార్కెట్‌లోకి వచ్చింది. అందువల్ల రానున్న నెలల్లో సరఫరాకు ఎలాంటి ఆటంకాలు ఉండబోవని పప్పుదినుసుల వ్యాపారులు భావిస్తున్నారు. ఇక ఖాద్య తైలాల నిల్వలు 1.6 మిలియన్ టన్నుల నుంచి 1.7 మిలియన్ టన్నుల వరకు ఉన్నాయి. వచ్చే 25 రోజుల వరకు వీటి సరఫరాకు ఎలాంటి ఢోకా ఉండదు. సాధారణంగా ఒక నెలకు సరిపడే నిల్వలను ముందుగానే జాగ్రత్త చేసి ఉంచుకుంటామని, కానీ ఇటీవల కాలంలో దిగుమతులు తగ్గాయని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వెల్లడించారు.

# అప్పు తీర్చడం ఎలా?: చాట్‌జీపీటీ సమాధానం






చాలీచాలని జీతాలతో పనిచేసేవారి సంఖ్య ఎక్కువే ఉంది. జీతాలు సరిపోక పోవడంతో లోన్స్ తీసుకోవడం లేదా ఇతరుల దగ్గర అప్పు చేయడం వంటివి చేస్తారు. అప్పులు ఎక్కువైపోయినప్పుడు వాటిని ఎలా తీర్చాలో తెలియక కొందరు సతమతమవుతారు. చేసిన అప్పును సులభంగా ఎలా తీర్చాలి?, అనే ప్రశ్నకు.. చాట్‌జీపీటీ ఇచ్చిన సమాధానం ఇక్కడ చూసేద్దాం.

స్నోబాల్ విధానం: మీరు చేసిన మొత్తం అప్పుల్లో చిన్న అప్పులను ముందుగా తీర్చేయాలి. ఇలా చేయడం వల్ల అప్పుల సంఖ్య తగ్గుతుంది. ఇది మీకు కొంతవరకు మానసిక ప్రశాంతతను అందిస్తుంది.

అవలాంచీ విధానం: అత్యధిక వడ్డీ చెల్లిస్తున్న అప్పులను ముందుగా తీర్చేయాలి. వడ్డీ ఎక్కువ కడుతున్న అప్పులు తీర్చేయడం వల్ల.. ఆర్థిక భారం కొంత తగ్గుతుంది. ఎక్కువ వడ్డీ చెల్లించే అవసరం కూడా ఉండదు. బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్: చిన్న మొత్తంలో అప్పు ఉంటే.. దానిని క్రెడిట్ కార్డుకు బదిలీ చేయడం ఉత్తమం. ఇలా క్రెడిట్ కార్డు ద్వారా అప్పు చెల్లించడం ద్వారా ఆర్థిక ఒత్తిడి తగ్గుతుంది. వడ్డీ రేటు కూడా కొంత తగ్గుతుంది.

ఆదాయాన్ని పెంచి, ఖర్చులను తగ్గించండి: అనవసరమైన ఖర్చులను తగ్గించుకోవాలి. ఆదాయాన్ని పెంచుకోవడానికి పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేయడం వంటివి చేయాలి. పొదుపు చేయడం పెంచాలి. మీ డబ్బు ఎక్కడ.. ఎక్కువ ఖర్చు అవుతుందో అర్థం చేసుకోవడానికి మీ ఆదాయం, ఖర్చులను బేరీజు వేసుకోండి. ఇలా చేసినప్పుడు ఖర్చులు తగ్గించడం సాధ్యమవుతుంది. అప్పుల ఏకీకరణ: బ్యాంకులలో ఒకటి కంటే ఎక్కువ లోన్స్ తీసుకుని ఉన్నట్లయితే.. వాటన్నింటినీ ఒకటే లోన్ కిందికి వచ్చేలా మార్చుకోవాలి. ఇలా చేయడం వల్ల వడ్డీ తగ్గుతుంది. ఈఎంఐ విధానం ద్వారా అప్పు చెల్లిస్తారు కాబట్టి.. అప్పు చెల్లించడం సులభతరం అవుతుంది.



# ట్రిప్ కోసం బెస్ట్ గ్యాడ్జెట్స్ ఇవే..

ప్రపంచాన్ని చుట్టేయడం ఒక అందమైన అనుభవం. అందుకే, చాలామంది కాస్త తీరిక దొరికితే చాలు, బ్యాగ్‌లో బట్టలు సర్దేసుకుని, ప్రయాణాలకు సిద్ధపడుతుంటారు. ఇప్పుడు మీ ప్రయాణాన్ని మరింత సులభంగా, సౌకర్యవంతంగా మార్చేయడానికి అవసరమయ్యే ఎనర్జీ గేర్స్.. ఈ గ్యాడ్జెట్స్..

### చేతిలోనే వాటర్ ఫిల్టర్

ప్రయాణిం చేటప్పుడు ప్రతిచోటా శుభ్రమైన నీరు దొరకడం చాలా కష్టం. అలాగని, అపరిశుభ్రమైన నీటిని తాగితే, రోగాల బారిన పడతాం. ఇందుకోసమే మార్కెట్‌లోకి వివిధ వాటర్ ప్యూరిఫైయింగ్ వాటర్ బాటిల్స్ అందుబాటులోకి వచ్చేశాయి. ఇవి ఫిల్టర్, యూవీ- సీ లైట్ పద్ధతులతో నీటిలోని బ్యాక్టీరియా, వైరస్, ఇతర సూక్ష్మజీవులను, మలినాలను తొలగించి శుభ్రమైన తాగునీటిని అందిస్తాయి. ఇవి క్యాంపింగ్, ట్రెక్కింగ్, ట్రావెలింగ్ చేసే వారికి బాగా ఉపయోగపడతాయి. బ్యాటరీలతో పనిచేసే వీటిని చార్జ్ చేసుకొని వాడుకోవచ్చు. ధర వివిధ కంపెనీలను బట్టి రూ. పది నుంచి ఇరవై వేల వరకు ఉంటాయి.

### పాకెట్‌లో సూర్యశక్తి

ట్రావెలింగ్ చేస్తూ అడవిలో చిక్కుకున్నా కూడా మీ ఫోన్ బ్యాటరీ తగ్గిపోదు, ఒకవేళ మీ వద్ద ఈ 'సోలార్ పవర్ బ్యాంక్' కనుక ఉంటే. దీనిని చాలా చిన్నగా ఎక్కడికైనా సులభంగా జేబులో వేసుకొని వెళ్లేలా రూపొందించారు. ఇది కేవలం సౌరశక్తిని ఉపయోగించి, సుమారు 10,000 ఎమ్ఏహెచ్ వరకు బ్యాటరీని స్టోర్ చేసుకోగలదు. ఒకేసారి మూడు పరికరాలను చార్జ్ చేసుకునే వెసులుబాటు కూడా ఉంది. ఇది ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్‌తో పాటు, వాటర్‌ప్రూఫ్, డస్ట్‌ప్రూఫ్‌తో వస్తుంది. ఇక దీనికున్న రెండు పవర్‌ఫుల్ ఫ్లాష్‌ట్లైట్లు మీకు మరో టార్చ్‌తో అవసరం లేకుండా చేస్తాయి. ధర రూ.2,300.

### బ్యాగ్ పోయే రోజులు పోయాయి

ప్రయాణాల్లో బ్యాగ్ పోయినా, ఏమాత్రం భయపడనక్కర్లేదు. ఇకపై చిటికెలో పోయిన బ్యాగు ఆచూకీ తెలుసుకోవచ్చు. తాజాగా విడుదలైన 'అరిస్ట్రా వోల్ట్ స్మార్ట్ లగేజీ బ్యాగ్'లో అబ్బురపరిచే ఫీచర్స్ ఎన్నో ఉన్నాయి. ఇందులోని జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్ సులభంగా బ్యాగ్ లొకేషన్‌ను ట్రాక్ చేస్తుంది. మొబైల్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను చార్జ్ చేసుకోవడానికి వీలుగా ఒక ఇంటిగ్రేటెడ్ పవర్‌బ్యాంక్ ఉంటుంది. డిజిటల్ లాక్ సిస్టమ్‌తో బ్యాగ్ భద్రత కూడా క్షేమంగా, సులువుగా మొబైల్‌తోనే చేసేయొచ్చు. మరో ఆసక్తికర విషయం ఏంటంటే, ఆటోమేటిక్ లగేజీ వెయిట్ చెక్ ఫీచర్. ఇది విమాన ప్రయాణాలు చేసే వారికి బాగా ఉపయోగపడుతుంది. ధర. రూ.81,100.

### మినీ ఐరన్ మాస్టర్

ప్రయాణాల్లో ఎదురయ్యే సమస్యల్లో బట్టల ఇస్త్రీ ఒకటి. సమస్య చిన్నదే అయినా, బిజినెజ్ ట్రిప్స్, ప్రత్యేక కార్యక్రమాలు, ఫంక్షన్స్‌కు వెళ్లేటప్పుడు నలిగిన బట్టల కారణంగా, ట్రిప్ వైబ్ మొత్తం పాడవుతుంది.

ఈ చిన్న సమస్యను, ఒక చిన్న పోర్టబుల్ స్టీమ్ ఐరన్‌తో పరిష్కరించవచ్చు. చూడ్డానికి చిన్నగా, అతి తక్కువ బరువుతో ఉంటే ఈ స్టీమ్ ఐరర్షీ , కేవలం కొద్ది సెకండ్లలోనే వేడి అయ్యి, స్టీమ్‌తో బట్టల మడతలను పోగొడుతుంది. యూఎస్‌బీ పోర్ట్ ద్వారా చార్జ్ చే సుకొని వాడుకోవచ్చు. ధర రూ. 999. అంతకంటే తక్కువ, ఎక్కువలోనూ వివిధ బ్రాండ్‌లలో లభిస్తున్నాయి.

# ఏ రంగంపై ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఉన్నారంటే..



భారత్-పాక్ యుద్ధం నేపథ్యంలో భౌగోళిక రాజకీయ మార్పుల కారణంగా భారతదేశ రక్షణ సాంకేతిక రంగాన్ని పెట్టుబడిదారులు అవకాశంగా చూస్తున్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వం బలమైన విధాన మద్దతు, వేగవంతమైన సాంకేతిక పురోగతి ఇందుకు కారణమని నిపుణులు అంచనా వేస్తున్నారు. రక్షణ రంగంలో స్వావలంబన సాధించేందుకు కేంద్రం దృష్టి సారించడం, పరిశ్రమ ఆవిష్కరణలు, వ్యూహాత్మక పరిష్కారాలకు భారత్ గ్లోబల్ హబ్‌గా రూపాంతరం చెందే అవకాశం ఉండడంతో ఇన్వెస్టర్లు ఈ రంగంపై ఆసక్తిగా ఉన్నట్లు మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

### పెట్టుబడుల వృద్ధికి కారణాలు

దేశీయ రక్షణ తయారీని బలోపేతం చేసే లక్ష్యంతో భారత ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ చర్యల వల్ల వివిధ కంపెనీలతో ఇటీవల 253 అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకోవడంతో రూ.53,439 కోట్ల పెట్టుబడులు సమకూరే అవకాశం ఉంది. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యానికి పెద్దపీట వేయడం వల్ల రక్షణ సాంకేతిక పరిజ్ఞానంలో పెట్టుబడిదారులకు భారత్ ఆకర్షణీయంగా మారుతోంది.


### సాంకేతికత అభివృద్ధి

సివిలియన్, మిలిటరీ అప్లికేషన్లకు సర్వీసులు అందించే డ్యుయల్-యూజ్ టెక్నాలజీలపై పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నారు. నిఘా, వ్యూహాత్మక కార్యకలాపాల కోసం స్వయంప్రతిపత్తి కలిగిన డ్రోన్ల తయారీ సంస్థలపై దృష్టి సారిస్తున్నారు. రియల్ టైమ్ ముప్పును గుర్తించడం కోసం ఏఐ ఆధారిత నిఘా వ్యవస్థలను రూపొందించే కంపెనీలను గుర్తిస్తున్నారు. సముద్ర భద్రత, అన్వేషణ కోసం అండర్ వాటర్ డ్రోన్లు, అధునాతన డిఫెన్స్ ఇమేజింగ్, ఇంటెలిజెన్స్ కోసం హైపర్ స్పెక్ట్రల్ ఉపగ్రహాల వంటి వాటిపై పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నారు.

కంపెనీల తీరు


డిఫెన్స్ టెక్ స్టార్టప్‌లు డీప్ రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ (ఆర్ అండ్ డీ), మాడ్యులర్ టెక్నాలజీ, రెగ్యులేటరీ ప్రమాణాలకు అనుగుణంగా ప్రాధాన్యత ఇస్తూ దీర్ఘకాలిక పెట్టుబడులను ఆకర్షించే పనిలో ఉన్నాయి. కంపెనీలు తక్కువ ఖర్చుతో సుస్థిరమైన, కృత్రిమ మేధ ఆధారిత రక్షణ పరిష్కారాలపై దృష్టి సారిస్తున్నాయి.

# ఈ స్మార్ట్ టీవీల ఫీచర్లు అదుర్స్.. రూ.25 వేల ధర నుంచే ప్రారంభం



ప్రముఖ బ్రాండ్ షియోమి మన దేశంలో క్యూలెడ్ టీవీ ఎఫ్ఎక్స్ ప్రో, 4కె టీవీ ఎఫ్ఎక్స్ సిరీస్ స్మార్ట్ టీవీలను ప్రవేశపెట్టింది. తద్వారా మార్కెట్ లో తన ఉత్పత్తుల శ్రేణిని విస్తరించింది. ఈ రెండు స్మార్ట్ టీవీలకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. హై-ఎండ్ ఆడియో విజువల్, స్మార్ట్ హోమ్ ఫీచర్లతో వీక్షకులకు థియేటర్ అనుభవాన్ని కలిగిస్తాయి. ఇవి మే 12వ తేదీ నుంచి కొనుగోలుదారులకు అందుబాటులోకి వస్తాయి. షియోమి క్యూలెడ్ టీవీ ఎఫ్ఎక్స్ ప్రో విషయానికి వస్తే.. దీనిలోని 43 అంగుళాల టీవీ ధర రూ.27,999 కాగా.. హెచ్ డీఎఫ్ సీ బ్యాంకు రూ.2 వేల క్యాష్ బ్యాక్ అందిస్తోంది. ఆ కార్డు ద్వారా ఈఎంఐ విధానంలో రూ.25.999కి కొనుగోలు చేయవచ్చు. అమెజాన్.ఇన్, ఫ్లిప్ కార్ట్, ఎంఐ.కమ్ లలో ఈ టీవీ అందుబాటులో ఉంది. ఇక దీనిలోనే 55 అంగుళాల టీవీపై కూడా హెచ్ డీఎఫ్ సీ క్యాష్ బ్యాక్ అందుబాటులో ఉంది. కేవలం రూ.37,999కి కొనుగోలు చేసుకోవచ్చు. అమెజాన్.ఇన్, ఎంఐ.కమ్ లో అందుబాటులో ఉంది. షియోమి 4కే టీవీ ఎఫ్ ఎక్స్ కు సంబంధించి 43 అంగుళాల టీవీ అసలు ధర రూ.26,499 కాగా హెచ్ డీఎఫ్ సీ బ్యాంకు క్యాష్ బ్యాక్ ద్వారా రూ.24,499కి కొనవచ్చు. అమెజాన్.ఇన్, ఎంఐ.కమ్ లో ఈ టీవీ దొరుకుతుంది. 55 అంగుళాల టీవీని రూ.34,999కి సొంతం చేసుకోవచ్చు. దీనికి హెచ్ డీఎఫ్ సీ క్యాష్ బ్యాక్ ఆఫర్ వర్తిస్తుంది. అమెజాన్.ఇన్, ఫ్లిప్ కార్ట్, ఎంఐ.కమ్ లలో అందుబాటులో ఉంది. రెండు స్మార్ట్ టీవీలూ హెచ్ డీఆర్10 ప్లస్ సపోర్టుతో ప్రతి ఫ్రేమ్ ను చక్కగా చూపిస్తాయి. డాల్బీ అట్మోస్ ద్వారా ట్యూన్ చేసిన 34 డబ్ల్యూ బాక్స్ స్పీకర్లతో ఆడియో చాలా బాగుంటుంది. ప్రైమ్ వీడియో, నెట్ ఫ్లిక్స్, జియో హాట్ స్టార్, జీ5, సోనీ ఎల్ఐవీ నుంచి అనేక కార్యక్రమాలను వీక్షించొచ్చు. అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్, యూట్యూబ్ తదితర వాటి ద్వారా కంటెంట్ ను ఆస్వాదించగలరు. తమ హోమ్ స్క్రీన్ నుంచి డీటీహెచ్ టీవీ చానెళ్లు, ఓటీటీ యాప్ ల మధ్య సజావుగా మారవచ్చు.

# స్మార్ట్ వాచ్‌లతో మరింత స్మార్ట్.. మదర్స్ డే గిఫ్ట్‌గా ఆర్డర్ చేసేయండి..!




ప్రతి ఒక్కరూ తమ తల్లికి ఏ బహుమతి ఇవ్వాలా అని ఆలోచిస్తారు. అయితే అమ్మకు స్మార్ట్ వాచ్ బహుమతిగా ఇస్తే బాగుంటుంది. సమయం చూసుకోవడంతో పాటు అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. ప్రస్తుతం మార్కెట్ లో అందుబాటులో ఉన్న బెస్ట్ స్మార్ట్ వాచ్ లు, వాటి ధరలు, ఇతర ప్రత్యేకతలను తెలుసుకుందాం.

### ఆపిల్ వాచ్ ఎస్ఈ

మణికట్టుకు అందాన్నివ్వడంతో పాటు నాణ్యమైన పనితీరు అందించడం ఆపిల్ వాచ్ ఎస్ఈ ప్రత్యేకత. దీనిలోని ప్రకాశవంతమైన డిస్ ప్లేతో నోటిఫికేషన్లను చక్కగా చూడవచ్చు. అన్ని పనులను ట్రాక్ చేసుకోవచ్చు. ఫిట్ నెస్ తో పాటు గుండె స్పందన తదితర ఆరోగ్య విషయాలను చెక్ చేసుకోవచ్చు. జీపీఎస్ 40 ఎంఎం వెర్షన్ తో కూడిన బేస్ మోడల్ వాచ్ రూ.24,900 ధరకు అందుబాటులో ఉంది.

### సామ్సంగ్ గెలాక్సీ వాచ్ అల్ట్రా

ప్రముఖ బ్రాండ్ సామ్సంగ్ నుంచి విడుదలైన గెలాక్సీ వాచ్ అల్ట్రా ఆధునిక ఫీచర్లతో ఆకట్టుకుంటోంది. దీనిలో 1.5 అంగుళాల సూపర్ అమోలెడ్ డిస్ ప్లే, 2 జీబీ ర్యామ్, టైటానియం కేస్, నీలమణి క్రిస్టల్ గ్లాస్, ఐపీ 68 వాటర్ రెసిస్టెంట్, లేటెస్ట్ హెల్త్ ట్రాకింగ్ తదితర ఫీచర్లు ఉన్నాయి. డ్యూయల్ ఫ్రీక్వెన్సీ జీపీఎస్ తో అత్యవసర సైరన్ ను కూడా మోగిస్తుంది. ఈ వాచ్ అసలు ధర రూ.50,999 కాగా.. ప్రస్తుతం ఆన్ లైన్ లో రూ.34,900 కంటే తక్కువ ధరకు అందుబాటులో ఉంది.




### ఆపిల్ వాచ్ సిరీస్ 10

సమర్థవంతంగా పనిచేసే స్మార్ట్ వాచ్ లలో ఆపిల్ వాచ్ సిరీస్ 10 ముందుంటుంది. దీనిలో ఆల్వేస్ %-% ఆన్ రెటీనా డిస్ ప్లేలో విజువల్ ను ఏ కోణం నుంచి అయినా వీక్షించొచ్చు. ఎస్10 ఎస్ఐపీ ద్వారా పనితీరు వేగవంతంగా ఉంటుంది. గుండె వేగం, ఈసీజీ, రక్త ఆక్సిజన్ స్థాయిలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. అల్యూమినియం కేసు, స్పోర్ట్ బ్యాండ్ తో కూడిన ఈ వాచ్ బేస్ వేరియంట్ మన దేశంలో రూ.46,900 నుంచి ప్రారంభమవుతుంది.

గార్మిన్ ఇన్స్టింక్ట్ 3 సాహస యాత్రలు, పర్యటనలు చేసే వారికి ఎంతో ఉపయోగపడే గార్మిన్ ఇన్స్టింక్ట్ 3 వాచ్ లో అనేక ప్రత్యేకతలున్నాయి. 1.2 అంగుళాల అమోలెడ్ డిస్ ప్లే, థర్మల్, షాక్, నీటి నిరోధకత, కచ్చితమైన ట్రాకింగ్ కోసం మల్టీ బ్రాండ్ జీపీఎస్, రెడ్ లైడ్ మోడ్ తో అంతర్నిర్మిత ఎల్ఈడీ ఫ్లాష్ లైట్ బాగున్నాయి. గుండె స్పందన రేటు, నిద్ర, పల్స్, ఒత్తిడిని ట్రాకింగ్ చేసుకోవచ్చు. స్మార్ట్ నోటిఫికేషన్లు, స్పోర్ట్స్ యాప్ లు అదనపు ప్రత్యేకత. దీని బేస్ వేరియంట్ మన దేశంలో రూ.52,990కి అందుబాటులో ఉంది.

### రెడ్ మీ వాచ్ 5 యాక్టివ్

అత్యంత తక్కువ ధరలో బెస్ట్ వాచ్ కొనుగోలు చేయాలనుకునే వారికి రెడ్ మీ వాచ్ 5 యాక్టివ్ మంచి ఎంపిక. దీని ధర కేవలం రూ.2499 మాత్రమే. ఆకట్టుకునే ఫీచర్లు, స్టైలిష్ మెటల్ బాడీతో ఆకట్టుకుంటోంది. దీనిలో 2 అంగుళాల హెచ్ డీ ఎల్సీడీ డిస్ ప్లే ఏర్పాటు చేశారు. ఇది డ్యూయల్ మైక్ నాయిస్ క్యాన్సిలేషన్ తో బ్లూటూత్ కాలింగ్ కు మద్దతు ఇస్తుంది. అలాగే గుండె స్పందన రేటు, ఎస్పీవో2, ఒత్తిడి, నిద్రను పర్యవేక్షించుకోవచ్చు. 140కి పైగా వర్కౌంట్ మోడ్ లు, 5 ఏటీఎం నీటి నిరోధకత, 18 రోజుల బ్యాటరీ లైఫ్ బాగున్నాయి.

## కొత్త ఫోన్‌తో దుమ్మురేపుతున్న సామ్‌సంగ్..

# ఫీచర్స్ తెలిస్తే షాకవుతారంతే..!

సామ్ సంగ్ కంపెనీ ఇటీవల దాని ఎఫ్ సిరీస్ లైనప్‌లో స్లిమ్ డిజైన్‌తో వచ్చే గెలాక్సీ ఎఫ్-56 5జీ ఫోన్‌ను లాంచ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ స్మార్ట్ ఫోన్ కేవలం 7.2 ఎంఎం మందంతో ఉంటుంది. ఎల్‌పీడీడీఆర్ 5 ఎక్స్ ర్యామ్‌తో ఎక్సినోస్ 1480 ప్రాసెసర్ ద్వారా ఆధారంగా ఎఫ్-56 5జీ సున్నితమైన మల్టీ టాస్కింగ్, లాగ్-ఫ్రీ గేమింగ్, శక్తి సామర్థ్యాన్ని హామీ ఇస్తుందని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. ఈ స్మార్ట్ ఫోన్ ముందు, వెనుక రెండు గ్లాసులు గొరిల్లా విక్టస్ ప్లస్ రక్షణతో ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా సొగసైన ఫారమ్ ఫ్యాక్టర్‌తో పాటు అధిక మన్నికను అందిస్తుంది.

సామ్‌సంగ్ గెలాక్సీ ఎఫ్-56 5జీ ఫోన్ 6.7 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ప్లస్ సూపర్ ఎమోఎల్‌ఈడీ డిస్‌ప్లేతో ఆకట్టుకుంటుంది. 120 హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్‌తో 1200 నిట్స్ బ్రైట్‌నెస్‌కు మద్దతు ఇస్తుంది. గెలాక్సీ ఎఫ్56లో ఓఐఎస్, 12 ఎంపీ హెచ్‌డీఆర్ ఫ్రంట్ కెమెరాతో 50 ఎంపీ ప్రధాన కెమెరా ఉంది. అందువల్ల పోర్ట్రెయిట్ 2.0, బిగ్ పిక్సెల్ టెక్, ఏఐ ఐఎస్‌పీ వంటి ఫోటోగ్రఫీ ఫీచర్‌లతో ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా వీడియో రికార్డింగ్ విషయానికి వస్తే 4 కే 30 ఎఫ్‌పీఎస్ హెచ్‌డీఆర్ సాయంతో రికార్డు చేసుకోవచ్చు. సామ్‌సంగ్ ఆబ్జెక్ట్ ఎరేజర్, ఎడిట్ సజెషన్స్ వంటి ఏఐ-ఆధారిత ఎడిటింగ్ సాధనాలు యూజర్లు అమితంగా ఆకట్టుకుంటాయని నిపుణులు చెబుతున్నారు. సిక్స్ జనరేషన్ ఆండ్రాయిడ్ అప్‌గ్రేడ్‌లతో పాటు ఎఫ్-56 కోసం ఆరు సంవత్సరాల సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని సామ్‌సంగ్ కంపెనీ ప్రకటించింది.




సామ్‌సంగ్ ఎఫ్-56 స్మార్ట్ ఫోన్ వన్ యూఐ7తో వస్తుంది. అందువల్ల గూగుల్ జెమినీ సపోర్టుతో పాటు నౌ బార్ సాయంతో త్వరిత అప్‌డేట్స్ పొందుతుంది. ఈ స్మార్ట్ ఫోన్ ద్వారా సామ్ సంగ్ వ్యాలెట్ పేలో అందుబాటులో ఉన్నా ట్యాప్ అండ్ పేకు కూడా సపోర్ట్ చేస్తుంది. సామ్‌సంగ్ ఎఫ్-56 ద్వారా 45 వాట్స్ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్‌తో కూడిన 5,000 ఎంఏహెచ్ బ్యాటరీతో వస్తుంది. అలాగే ఈ స్మార్ట్ ఫోన్ రెండు కాన్ఫిగరేషన్‌లలో లభిస్తుంది. 8 జీబీ ం 128 జీబీ వేరియంట్‌తో వచ్చే ఫోన్ ధర రూ.25,999గా ఉంటే 8 జీబీ ం 256 జీబీ రూ.28,999గా ఉంది. అలాగే ఈ రెండు ఫోన్లను కొనుగోలు చేస్తే రూ.2000 తక్షణ బ్యాంక్ డిస్కౌంట్‌ను పొందవచ్చు. సామ్‌సంగ్ గెలాక్సీ ఎఫ్-56 5 జీ స్మార్ట్ ఫోన్ రెండు రంగుల్లో అంటే గ్రీన్‌తో పాటు వైలెట్ కలర్స్‌లో అందుబాటులో ఉంది.



# ఒంటరి దీవిలో యంగ్ బ్యూటీ బికినీ ట్రీట్!





బికినీ బీచ్ సెలబ్రేషన్స్ తో స్టార్లు మరిగిస్తున్న సంగతి తెలిసిందే. ఒంటరి దీవుల్లో మంటలు పెట్టేందుకు అందాల భామలు వెనకాడటం లేదు. ఇప్పుడు తన బర్త్ డే వేడుకల్ని పురస్కరించుకుని యంగ్ బ్యూటీ అమైరా దస్తూర్ బీచ్ పరిసరాల్లో చెలరేగి పోతోంది. అందుకు సంబంధించిన ఫోటో షూట్లు ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి.


తాజాగా అమైరా బికినీ బీచ్ సెలబ్రేషన్స్ కి సంబంధించిన ఫోటోలు యువతరం వాట్సాపుల్లోకి వచ్చాయి. అమైరా అందచందాలు, టీజింగ్ యాటిట్యూడ్ కి ఫిదా కాని వాళ్లు లేరు. ఈ ఏడాదితో అమైరా 32 బార్డర్ క్రాస్ చేస్తోంది. ఇప్పటికే చాలా సాధించాల్సి ఉన్నా, నటిగా కెరీర్ అంతంత మాత్రమే. కానీ మోడలింగ్ లో టాప్ క్వీన్ గా వెలిగిపోతోంది. నిరంతరం అమైరా రెడ్ కార్పెట్ ఈవెంట్లలో సందడి చేస్తూనే ఉంది. శ్రీలంక దీవుల్లో బికినీ షూట్లకు సంబంధించిన ఫోటోలు హీటెక్కిస్తున్నాయి. అమైరా తెలుగు చిత్రసీమలో అవకాశాలు అందుకుంది. ముంబై బ్యూటీ అమైరా దస్తూర్ - మనసుకు నచ్చింది -% సినిమాతో టాలీడ్ లో ఎంట్రీ ఇచ్చింది. అటుపై రాజ్ తరుణ్ - రాజుగాడు - లో నటించింది. కానీ ఈ రెండు చిత్రాలు ఫ్లాపయ్యాయి. కోలీవుడ్ లో భగీరా అనే చిత్రంలో నటించింది. అలాగే కొన్ని వెబ్ సిరీస్ లతోను బిజీ అయింది. 2017లో జాకీ చాన్‌తో కలిసి తన అంతర్జాతీయ ప్రాజెక్ట్ కుంగ్ ఫూ యోగాలో నటించడం ద్వారా క్రేజ్ తెచ్చుకుంది. కానీ అది బాలీవుడ్ కెరీర్ కి కలిసి రాలేదు.

ప్రస్తుతం కెరీర్ బండిని ట్రాక్ లో పెట్టేందుకు చాలా ప్రయత్నాలు చేస్తోంది అమైరా. నిరంతర ఫోటోషూట్లతో అభిమా నులకు, ఫిలింమేకర్స్ కి టచ్ లో ఉంది.

Cinema

# నరసింహస్వామి అవతారంపై హొంబలే






నరసింహా పేరుతో విష్ణువు అవతారాల్లో అత్యంత కీలక అవతారాన్ని ప్రజలకు యానిమేటెడ్ ఫిలిం రూపంలో చూపించేందుకు సన్నాహకాల్లో ఉంది హొంబలే. కేజీఎఫ్, కేజీఎఫ్ 2, కాంతార వంటి పాన్ ఇండియన్ చిత్రాలను అందించిన హొంబలే సంస్థ వరుసగా ప్రయోగాత్మక చిత్రాలతో సంచలనాలు సృష్టిస్తోంది. హొంబలేతో కలిసి అశ్విన్ కుమార్ నిర్మించిన 'మహావతార్ నరసింహ' జూలైలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మహావతార్ సిరీస్ నుండి మొదటి ప్రాజెక్ట్ టీజర్ ని మూడు నెలల క్రితం విడుదల చేయగా అద్భుత స్పందన వచ్చింది. విష్ణువు అనేక అవతారాలను ఈ సిరీస్ లో చూపించబోతున్నామని హొంబలే ప్రకటించింది. తాజాగా రిలీజ్ డేట్ ని ప్రకటిస్తూ, థియేటర్లకు రావాల్సిందిగా హొంబలే సంస్థ కోరింది. నరసింహ స్వామి శక్తివంతమైన గర్జనను అనుభూతి చెందడానికి.. పెద్ద తెరపై ఇంతకు ముందు ఎన్నడూ లేని అనుభవాన్ని పొందడానికి! మహావతార్ నరసింహ గ్లింప్స్‌ను ప్రదర్శిస్తున్నాము. గర్జనతో మీ ఆత్మను మేల్కొల్పండి! అనుభవించండి. జీవించండి... బీ రెడీ.. ! అంటూ టీజ్ చేసింది. %-%మహావతార్ నరసింహ%-% అద్భుతమైన పురాణేతిహాస కథ. అత్యంత క్రూరమైన, సగం మనిషి-సగం సింహం అవతారం.. విష్ణువు అత్యంత శక్తివంతమైన అవతారం అయిన నరసింహ భగవానుడి పురాణ కథకు ప్రాణం పోసే ప్రయత్నమిది. హిరణ్యకశిపుడు, ప్రహ్లాదుడు కథను ఇందులో చూపిస్తున్నారు.

ఈ చిత్రం హిందీ, కన్నడ, తెలుగు, తమిళం, మలయాళ భాషలలో విడుదల కానుంది.

సినిమా పురాణేతిహాసాలపై భారీ పాన్ ఇండియన్ సినిమాలు తెరకెక్కించాలనే ఆసక్తి దేశవ్యాప్తంగా ఫిలింమేకర్స్ లో ఉంది. అయితే దీనికోసం వందల కోట్ల బడ్జెట్లు అవసరం. పైగా ప్రతి భాష నుంచి స్టార్లను వెతికి హాలీవుడ్ స్థాయిలో సాంకేతిక నిపుణులను సమకూర్చుకుని, విజువల్ వండర్ ని క్రియేట్ చేస్తేనే జనం థియేటర్లకు వస్తున్నారు. ఇలాంటి కథలను ఒరిజినాలిటీ చెడకుండా ఉన్నది ఉన్నట్టు తీయలి. లేదంటే మనోభావాల కాలంలో చాలా సవాళ్లను ఎదుర్కోవాలి. ఇంత చేసినా రిలీజయ్యాక హిట్టవుతుందంటే చెప్పలేం. ఏ యుద్ధం వచ్చిందనో, కరోనా రంగ ప్రవేశం చేసిందనో వార్త వెలువడితే చాలు జనం ఓటీటీలో చూద్దాం.. థియేటర్లకు ఎందుకులే! అనుకుంటున్నారు. మరి ఇలాంటి క్లిష్ట పరిస్థితిలో పురాణేతిహాసాలను ప్రజలకు ఎలా చూపించాలో ఇప్పుడు హొంబలే ఫిలింస్ చేసి చూపిస్తోంది. మహావతార్

## తమ్ముడు ఆ విషయంలో కూడా వేరే లెవెల్ ప్లాన్..!



నితిన్ హీరోగా వేణు శ్రీరామ్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న సినిమా తమ్ముడు. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాలో సప్తమి గౌడ హీరోయిన్ గా నటిస్తుంది. సినిమాలో సిస్టర్ రోల్ లో ఒకప్పటి హీరోయిన్ లయ నటిస్తుంది. నితిన్ లయ కాంబినేషన్ సీన్స్ అదిరిపోతాయని అంటున్నారు. తమ్ముడు ఒక ఎమోషనల్ ఎంటర్టైనర్ గా రాబోతుందని తెలుస్తుంది. ఈ సినిమాలో నితిన్ కూడా అదరగొడతాడని అంటున్నారు.దిల్ రాజు కాంపౌండ్ లో ఆస్థాన డైరెక్టర్ గా ఉన్నాడు వేణు శ్రీరామ్. అతని సినిమాలు మినిమం గ్యారెంటీ అవుతున్నాయి. అందుకే తమ్ముడు సినిమా మీద అంచనాలు ఏర్పడ్డాయి. ఐతే తమ్ముడు సినిమా విషయంలో మరో స్పెషల్ థింగ్ క్రేజీగా మారింది. ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్ గా అజనీష్ లోక్ నాథ్ పనిచేస్తున్నాడు. కాంతారా తో సూపర్ క్రేజ్ తెచ్చుకున్న అజనీష్ తెలుగులో మంగళవారం సినిమా చేశాడు.ఈమధ్యనే వచ్చిన ఓదెల 2, అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమాలకు కూడా అతనే మ్యూజిక్ అందించాడు. ఐతే అజనీష్ మ్యూజిక్ అంటే అది రెగ్యులర్ కి భిన్నంగా ఉంటుందని ఆడియన్స్ ఫిక్స్ అయ్యారు. తమ్ముడు సినిమాకు అతన్ని ఏరి కోరి కావాలని తీసుకున్నారట. అజనీష్ మ్యూజిక్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ కానుందని తెలుస్తుంది. తమ్ముడు సినిమా ఒక ఎమోషనల్ ఎంటర్టైనర్ గా రాబోతుంది. ఈ సినిమాలో కొన్ని సీన్స్ థియేటర్ లో ఆడియన్స్ ని మెస్మరైజ్ చేస్తాయని అంటున్నారు.సినిమాకు అజనీష్ మ్యూజిక్ మరో అట్రాక్షన్ అవుతుందట. రీసెంట్ గా రాబిన్ హుడ్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన నితిన్ ఆ సినిమాతో ఆకట్టుకోలేకపోయాడు. ఐతే తమ్ముడు సినిమాతో హిట్ కొట్టాలని చూస్తున్నాడు. తమ్ముడు తర్వాత వేణు డైరెక్షన్ లో ఎల్లమ్మ సినిమా చేయనున్నాడు నితిన్. ఈ సినిమా కూడా భారీ అంచనాలతో రాబోతుంది. ఐతే తమ్ముడు, ఎల్లమ్మ రెండు ప్రాజెక్ట్ లు దిల్ రాజు బ్యానర్ లో తెరకెక్కుతున్న సినిమాలే అవ్వడం విశేషం. హీరో నితిన్ హిట్లు ఫ్లాపులతో సంబంధం లేకుండా కెరీర్ కొనసాగిస్తున్నాడు. ఐతే భీష్మ తో సక్సెస్ అందుకున్న నితిన్ మరో హిట్ కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. ఐతే తమ్ముడు, ఎల్లమ్మ రెండు సినిమాలైతే కచ్చితంగా వర్క్ అవుట్ అయ్యేలా ఉన్నాయని తెలుస్తుంది.

## 2027 క్రిస్ మస్ కి సాధ్యమయ్యే పనేనా..?

పుష్ప 2 తో పాన్ ఇండియా సెన్సేషనల్ హిట్ అందుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన నెక్స్ట్ సినిమా అట్లీతో చేస్తున్నాడు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ మొదలు కాబోతుందని తెలుస్తుంది. సన్ పిక్చర్స్ బ్యానర్ లో తెరకెక్కనున్న ఈ మూవీని ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా భారీ బడ్జెట్ తో నిర్మించబోతున్నారట. ఐతే ఈ సినిమా నుంచి వచ్చే ప్రతి అప్డేట్ అల్లు ఫ్యాన్స్ ని సర్ ప్రైజ్ చేస్తుంది. సినిమాలో అల్లు అర్జున్ డబుల్ రోల్ అని వార్తలు రాగా..

సినిమాలో బన్నీ ముగ్గురు హీరోయిన్స్ తో రొమాన్స్ చేస్తాడని హడావిడి చేస్తున్నారు. ఇదిలా ఉంటే అట్లీ సినిమాలు అన్నీ పర్ఫెక్ట్ ప్లానింగ్ తో వస్తాయి. ప్రీ ప్రొడక్షన్ లోనే సినిమా షెడ్యూల్, ప్రమోషన్స్, రిలీజ్ అన్నీ విషయాల గురించి డీటైల్డ్ గా ఫిక్స్ చేస్తారు. ముఖ్యంగా సినిమాను అనుకున్న డేట్ కి రిలీజ్ టార్గెట్ గా అట్లీ పెట్టుకుంటాడు. ఈ క్రమంలోనే అల్లు అర్జున్ అట్లీ సినిమా వన్ ఇయర్ లో షూటింగ్ పూర్తి చేసి 3 నెలలు పోస్ట్ ప్రొడక్షన్ చేసి మరో 3 నెలల్లో రిలీజ్ చేసేలా ప్లానింగ్ ఉందట. అంటే 2025 నుంచి 2026 చివరి వరకు షూటింగ్ కే టైం తీసుకుంటున్నారట. 2026 లో షూటింగ్ పూర్తి కాకపోయినా 2027 ఫస్ట్ హాఫ్ లో ఎట్టి పరిస్థితుల్లో సినిమాను పూర్తి చేసి 2027 సెకండ్ హాఫ్ అంటే దసరా లేదా క్రిస్ మస్ లో రిలీజ్ అనుకుంటున్నారట. అంటే రెండేళ్లలో ఈ సినిమా రిలీజ్ అవ్వాలన్నమాట.

ఈ సినిమాను హాలీవుడ్ రిఫరెన్స్ లతో భారీ ప్లానింగ్ తోనే సిద్ధం చేస్తున్నారు. జస్ట్ అనౌన్స్ మెంట్ వీడియోనే ఆడియన్స్ కి పూనకాలు తెప్పించేసింది. పుష్ప 1, 2 సినిమాలతో పాన్ ఇండియా లెవెల్ లో అల్లు అర్జున్ రేంజ్ పెరిగింది. పుష్ప 1 తో నేషనల్ అవార్డ్ సైతం అందుకున్న అల్లు అర్జున్ పుష్ప 2 తో కూడా మరోసారి జాతీయ అవార్డ్ అందుకునే ఛాన్స్ ఉందని అంటున్నారు. ఐతే అల్లు అర్జున్ అట్లీ కాంబో సినిమా కూడా అంచనాలకు మించి ఎవరి ఊహలకు అందని విధంగా ఉంటుందని అంటున్నారు. టెక్నికల్ గా హై స్టాండర్డ్స్ లో ఈ సినిమా సెట్ చేయబోతున్నారట. మరి ఇండియన్ తెర మీద రాబోతున్న ఈ సూపర్ హీరో మూవీ ఎలా ఉండబోతుందో చూడాలి.




# జూనియర్ ఎన్టీఆర్‌కు రామ్ చరణ్ సర్‌ప్రైజ్.. ఇంతకీ అదేంటంటే?



దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ చిత్రం ఆర్ఆర్ఆర్. ఈ మూవీ రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ హీరోలుగా మెప్పించారు. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ ఆలియా భట్ హీరోయిన్‌గా కనిపించింది. తాజాగా ఆర్ఆర్ఆర్ టీమ్ లండన్‌లో సందడి చేసింది. లండన్‌లోని రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో జరిగిన ఆర్ఆర్ఆర్ లైవ్ ఆర్కెస్ట్రా స్క్రీనింగ్‌లో రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ ఒకే వేదికపై మెరిశారు. ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్‌కు రామ్ చరణ్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా జూనియర్ బర్త్ డేకు పది రోజుల ముందే చెర్రీ విషెస్ చెప్పారు. ఈ సందర్భంగా ఒకరినొకరు హృదయపూర్వక ఆలింగనం చేసుకున్నారు. ఆ తర్వాత ఎన్టీఆర్ చెంపపై ముద్దు కూడా పెట్టారు. ఇది చూసిన ఫ్యాన్స్ చప్పట్లు కొట్టారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా.. ఆదివారం ఆర్ఆర్ఆర్ మూవీని లండన్‌లోని లెజెండరీ రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో ప్రదర్శించారు. ఈ స్క్రీనింగ్ వేడుకలో దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి, రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్‌లతో కలిసి సందడి చేశారు. దాదాపు మూడేళ్ల తర్వాత మొదటిసారి వేదికపైకి కనిపించారు. ఈ కార్యక్రమంలో ఆస్కార్ విజేత స్వరకర్త ఎంఎం కీరవాణి నేతృత్వంలోని రాయల్ ఫిల్హార్మోనిక్ కాన్సర్ట్ ఆర్కెస్ట్రా ఆర్ఆర్ఆర్ సంగీతాన్ని ప్రదర్శించారు. కాగా.. ఆర్ఆర్ఆర్ చిత్రంలో అజయ్ దేవ్‌గన్, అలియా భట్, శ్రియ శరణ్ కీలక పాత్రల్లో నటించారు. 2023లో 'నాటు నాటు' పాటకు ఉత్తమ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్ అవార్డును గెలుచుకున్న తొలి భారతీయ చిత్రంగా చరిత్ర సృష్టించింది.

# విశ్వక్ కల్ట్.. అతను పర్ఫెక్ట్ చాయిస్..!



మాస్ కా దాస్ విశ్వక్ సేన్ లైలా తర్వాత ఈసారి పక్కా ప్లానింగ్ తో వస్తున్నాడు. లైలా కోసం విశ్వక్ ఎంతో రిస్క్ తీసుకుని మరీ లేడీ గెటప్ వేయగా సినిమా ఆడియన్స్ ని మెప్పించడంలో విఫలమైంది. టాలీవుడ్ యువ హీరోల్లో 100 కోట్లు కొట్టగల సత్తా ఉన్నా కూడా ఎందుకో వెనకపడ్డాడు విశ్వక్ సేన్. అందుకే ఇక మీదట తన మాస్ స్టామినా చూపించాలని ఫిక్స్ అయ్యాడు. ప్రస్తుతం విశ్వక్ సేన్ అనుదీప్ కెవి డైరెక్షన్ లో ఫంకీ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా ఆల్రెడీ షూటింగ్ జరుపుకుంటుంది. డ్రాగన్ బ్యూటీ కయదు లోహర్ ఈ సినిమాలో విశ్వక్ ససన నటిస్తుంది. ఇక ఈ సినిమాతో పాటుగా విశ్వక్ సేన్ మరో సినిమా షురూ చేశాడు. ఈసారి తన డైరెక్షన్ లో సినిమా చేస్తున్నాడు విశ్వక్ సేన్. విశ్వక్ సేన్ డైరెక్షన్ లో వచ్చిన ఫలక్ నుమా దాస్ మాస్ ఆడియన్స్ ని మెప్పించింది. ఆ సినిమా చూసే విశ్వక్ కి మాస్ ఆడియన్స్ దగ్గరయ్యారు. ఇక ఇప్పుడు మరోసారి అతని డైరెక్షన్ టాలెంట్ చూపించాలని ఫిక్స్ అయ్యాడు విశ్వక్ సేన్. కల్ట్ అంటూ క్రేజీ టైటిల్ తో వస్తున్నాడు విశ్వక్ సేన్. ఈ సినిమా డైరెక్షన్ మాత్రమే కాదు నిర్మాతగా కూడా తనే వ్యవహరిస్తున్నాడు. ఐతే విశ్వక్ సేన్ కల్ట్ సినిమాకు కథ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ తానే అయినా డైలాగ్స్ మాత్రం మరో దర్శకుడు తరుణ్ భాస్కర్ కి ఛాన్స్ ఇచ్చాడు. విశ్వక్ సేన్ తో ఈ నగరానికి ఏమైంది సినిమా చేశాడు తరుణ్ భాస్కర్. అప్పటి నుంచి ఇద్దరి మధ్య మంచి బాండింగ్ ఉంది. తరుణ్ భాస్కర్ రైటింగ్ కి ప్రత్యేక ఫ్యాన్స్ ఉన్నారు. విశ్వక్ సేన్ కల్ట్ కి తరుణ్ భాస్కర్ రైటింగ్ సంథింగ్ స్పెషల్ అని చెప్పొచ్చు. ఈమధ్య విశ్వక్ సేన్ సినిమాలు అంచనాలను అందుకోలేకపోతున్నాయి. అందుకే ఈసారి టార్గెట్ మిస్ అవ్వకూడదని గట్టిగా ఫిక్స్ అయ్యి పర్ఫెక్ట్ ప్లానింగ్ తో విశ్వక్ సేన్ ఈ కల్ట్ సినిమాను చేస్తున్నాడు. కల్ట్ పోస్టర్ కూడా సంథింగ్ ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. మరి సినిమా ఎలా ఉంటుందో చూడాలి. విశ్వక్ సేన్ ఫంకీ ఈ ఇయర్ సెకండ్ హాఫ్ లో రిలీజ్ ఉండే ఛాన్స్ ఉంది. ఐతే ఈ కల్ట్ సినిమా మాత్రం నెక్స్ట్ ఇయరే వచ్చే అవకాశాలు ఉన్నాయి.

Printed by RATNA GRAPHICS, at H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad-500 013 Telangana. Published by CHERUKU UPENDAR on behalf of CHERUKU UPENDAR ( HAMSA PUBLICATIONS ), Printed at HYDERABAD and Pulblished at H.No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPUR MET MANDAL,Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City,Telangana. *Editor : CHERUKU UPENDAR E-mail: prabhathasuryudueditor@gmail.com PRGI Reg No : TGTEL/25/A0555